

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 19

గురువారం 11-4-2024



సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్!

-IIలో



ఆమె నదిని దాటించింది

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సైగలకు మాటలొచ్చాయి



న్యాయవాది అడ్వా సారా సన్ని భారతదేశపు మొట్టమొదటి వినికిడి లోపం గల రిజిస్టర్డ్ ప్రాక్టీసింగ్ లాయర్‌గా చరిత్ర సృష్టించారు. ఏప్రిల్ 4న ఆమెకు సహాయం చేయడానికి సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ ద్వారా సర్టిఫైడ్ ఇంటర్‌ప్రెటర్ సేవలను పొందాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఫలితంగా ఏప్రిల్ 8న కర్ణాటక హైకోర్ట్ రిజిస్టర్డ్ సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడి లోపం ఉన్న న్యాయవాది నుంచి వాదనలు విన్నది. దీంతో అడ్వకేట్ సారా సన్నీతోపాటు కర్ణాటక హైకోర్ట్ కూడా దివ్యాంగులకు ఒక గొప్ప బాసటగా నిలిచినట్లయింది. ఇది న్యాయ నిపుణులకు మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న పౌరులకు కూడా సమగ్ర న్యాయవ్యవస్థకు మార్గం మరింతగా సుగమం చేస్తుంది.


జస్టిస్ ఎం నాగప్రసన్న, అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్‌లతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ అడ్వా సన్నీ నమోదును ప్రశంసించింది. ఏఎస్‌జీ కామత్ మాట్లాడుతూ 'ఇంటర్‌ప్రెటర్ ద్వారా హియరింగ్, స్పీచ్ ఇంపెయిర్డ్ అడ్వకేట్ వాదనను విన్న మొదటి హైకోర్టుగా కర్ణాటక హైకోర్టు చరిత్రలో నిలిచిపోతుంది. సారా సన్నీ సంకేత భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడిలోపం, ప్రసంగం బలహీనంగా ఉండటం వల్ల కలిగే వైకల్యాన్ని ఓడించింది. అందుకు సారా సన్నీని అభినందించాల్సిందే. సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వాదప్రతివాదనలు జరిగినప్పటికీ ప్రశంసలు రికార్డులలో నమోదు అవుతాయి' అని తెలియజేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 'భారత న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాల నుండి ఎక్కువ మంది మహిళలు చేరాల'ని పదే పదే ప్రస్తావించారు.

ప్రోత్సహించడానికి... అడ్వా సారా సన్నీ కేరళలోని కొట్టాయం వాసి. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుకున్నారు. కేవలం స్వీయ ఆసక్తితో మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న ఇతరులను కూడా ప్రోత్సహించడానికి న్యాయవాద వృత్తిని ఎంచుకుంది. అడ్వకేట్ సన్నీ ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అండ్ హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో యాక్టివ్ మెంబర్. సెప్టెంబరు 2023లో న్యాయవాది సన్నీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఒక కేసు వాదించిన, వినికిడి లోపం ఉన్న మొట్ట మొదటి లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంలో సన్నీ 'డీవై చంద్రచూడ్ ఓపెన్ మైండ్ ప్రత్యేక సామర్థ్యం ఉన్న వ్యక్తుల కోసం తలుపులు తెరిచింది' అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సన్నీ కోర్టు సబిమిషన్స్‌లో సహాయం చేయడానికి సంకేత భాషా ఇంటర్‌ప్రెటర్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు గతంలో తన రిజిస్ట్రీని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు అది అమలు అయ్యింది. వైకల్యాలున్నవారు తమ అడ్డంకులను అధిగమించడంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అయ్యింది.

సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్!

నేడు రమజాన్



అల్లాహు
అక్బర్ ..
అల్లాహు అక్బర్ ..
లాయిలాహ ఇల్లల్లాహు
వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలి
ల్లాహిల్ హంద్ ..!

ఈ రోజు ఎటువిన్నా ఈ స్తోత్ర గానమే, ఆ దయామయుని కీర్తిగానమే వినిపిస్తూ హృదయాలను పులకింపజేస్తూ ఉంటుంది. ఊరు, వాడ, పల్లె, పట్నం, చిన్నా పెద్దా, ఆడా మగా, ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఈ అమృత వచనాలే జాలువారుతూ ఉంటాయి.

కొత్తబట్టలు, కొత్తహంగులు, తెల్లని టోపీలు మల్లెపూలలా మెరిసిపోతుంటాయి. అత్తరు పన్నీరు పరిమళాలు, అస్సలాము అలైకుం, ఈద్ ముబారక్‌లు, చిరునవ్వుల కరచాలనాలు, ఆలింగనాల ఆనంద తరంగాలు, అలయ్ బలయ్‌లతో విశ్వాసుల హృదయాలు సంతోషసాగరంలో ఓలలాడుతూ ఉంటాయి.

సేమ్యాలు, షీర్ ఖుర్మాలు, బగారా, బిర్యానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో ముస్లిముల లోగిళ్ళు కిలకిల నవ్వుతూ, కళకళలాడుతూ ఉంటాయి. ఇళ్ళలో ఆడాళ్ళ హడావిడికి, పిల్లల సందడికి హద్దులే ఉండవు. ఎందుకంటే ఇది ఒక్కనాటి పండుగ కాదుగదా! నెల్లాళ్ళపాటు భక్తిప్రపత్తులతో జరుపుకున్న పండుగకు అల్విదా చెబుతున్న ముగింపు ఉత్సవం.

రమజాన్ నెలరోజులూ ముస్లింల వీధులు 'సహెరీ','ఇఫ్తార్' ల సందడితో నిత్యనూతనంగా కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ వింత అనుభూతుల్ని పంచుతుంటాయి. భక్తులు పవిత్ర గ్రంథ పారాయణా మధురిమను గ్రోలుతూ వినూత్న అనుభూతులతో పరవశించి పోతుంటారు. అవును.., ఇలాంటి అనుభూతులు, ఆనందాలు, ఆహ్లాదాలు, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే పండుగ. ఇలాంటి ఓ అద్భుతమైన, అపురూప సందర్భమే 'ఈదుల్ ఫిత్ర్'. దీన్నే రమజాన్ పండుగ అంటారు. ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఇది మొదటిదీ, అతి పవిత్రమైనదీను. ఈ నెలలో ముస్లింలు అత్యంత నియమనిష్టలతో రోజా వ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తూ, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స)వారిపై సలాములు పంపుతూ ఉంటారు. దైవనామస్మరణలో అనునిత్యం వారి నాలుకలు నర్తిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు. ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాసదీక్షలు నెలరోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటితేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. ఈ పండుగ సంబంధం రమజాన్ నెలతో ముడివడి ఉన్న కారణంగా ఇది రమజాన్ పండుగగా ప్రసిద్ధి చెందింది. రమజాన్ ఉపవాస దీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకు పోయి ఉంది.

మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాస దీక్షల అసలు లక్ష్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, సూర్యోదయం కాకముందే భుజించడం(సహెరి), సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, రోజూ ఐదుసార్లు దైవారాధనచేస్తూ సూర్యాస్తమయం తరువాత రోజా విరమించడం(ఇఫ్తార్), మితాహారం తీసుకోవడం, మళ్ళీ అదనపు ఆరాధనలు అంటే తరావీహ్ నమాజులు చేయడం, మళ్ళీ తెల్లవారు ఝామున లేవడం – ఈవిధంగా రమజాన్ ఉపవాస వ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుతమైన, బాధ్యతాయుతమైన, దైవభక్తి పరాయణతతో కూడుకున్న జీవనవిధానానికి అలవాటు చేస్తుంది. మానవుల్లో ఇంతటి మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ త్రికరణ శుద్ధిగా పాటించ గలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతాపూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే, పవిత్ర రమజాన్ నెలలోనే సమస్త మానవాళి సన్మార్గ దీపిక అయిన మహత్తర గ్రంథరాజం ఖురాన్‌ను దేవుడు మానవాళికి ప్రసాదించాడు. సమస్త మానవజాతికీ మార్గదర్శక జ్యోతి పవిత్ర ఖురాన్. సన్మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథరాజం మానవులందరికీ సన్మార్గ బోధన చెయ్యడానికి అవతరించిన ప్రబోధనా జ్యోతి.

దైవ ప్రసన్నతను చూరగొనడానికి రోజా పాటించడం,'తరావీహ్'లు ఆచరించడం, దానధర్మాలు చేయడంతో పాటు, ఈ నెల చివరిలో'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత అమూల్యమైన రాత్రి అని అర్థం.

ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయన్నారు. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటివారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతం వరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. అందుకే 'ఈద్'(పండుగ)ను శ్రామికుని వేతనం(ప్రతిఫలం)లభించే రోజు అని చెప్పడం జరిగింది. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఒక ఉన్నతమానవీయ విలువలుకలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాదివేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర్ – రమజాన్ పర్వదిన పరమార్థం.

ఈ కాలంలోనే ఆర్థికంగా కలిగిన వాళ్ళు తమ ధనంలోని ఒక నిర్ణీతభాగాన్ని పేదసాదలకు దానం చేస్తారు. 'జకాత్' నిజానికి దానంకాదు. పేదవారి హక్కు. తమ నిల్వ ఆదాయంలోంచి నూటికి రెండున్నర శాతం తీసి దానం చేస్తారు. అలాగే ఫిత్రాలు కూడా! ఇది ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా కాస్తో కూస్తో కలిగిన వారందరూ చెల్లించాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పండుగ జరుపుకునే స్థోమతలేని వారికి ఫిత్రా దానం వల్ల గొప్ప ఊరట లభిస్తుంది. దీనివల్ల పేదసాదలు కూడా కొత్త బట్టలో, పండుగ సామగ్రో కొనుక్కోగలుగుతారు. ముస్లిములు, ముస్లిమేతరులు అన్న భేద భావం లేకుండా సమాజంలోని పేద సాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రమజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగవిలాసాలకు తమ ధనం వృథా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. అందుకే ప్రవక్త వారు రమజాన్‌ను 'సానుభూతుల నెల' అన్నారు.

సదాచరణల సంపూర్ణప్రతిఫలం లభించిన సంతోషంలో అంబరాన్నంటేలా సంబురాలు జరుపుకొని ఆనంద తరంగాల్లో తేలియాడే రోజు ఈదుల్ ఫిత్ర్. – ఆరోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిఖ్ఖు సోదరులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు.

పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదనుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ణి దైవదూతగా మలిచింది. అజ్ఞానం అంధకారాల కారు చీకట్ల నుండి వెలికి తీసి, విజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాథాలనుండి పైకిలాగి పవిత్రతా శిఖరాలపై నిలిపింది. మానవుల్లోని పశుప్రవృత్తిని మానవీయ పరిమళంతో పారద్రోలింది. ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి మనుషుల్ని మానవోత్తములుగా సర్వతోముఖంగా తీర్చిదిద్దింది. మానవాళికి ఇంతటి మహదానుగ్రహాలు ప్రసాదించి, వారి ఇహపరలోకాల సఫలతకు పూబాటలు పరిచిన నిఖిల జగన్నాయకునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకోవడమే ఈ పండుగ ఉద్దేశ్యం.

ఈదుల్ ఫిత్ర్ పర్వదిన శుభాకాంక్షలు

– మదీహా అర్జుమంద్

ఘనత



కింద గాఢంగా పారే చీనాబ్ నది. పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి. కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు. దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజినీర్ మాధవీ లత కృషి కీలకం. 'వరల్డ్ హైయ్యస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం.

ఆమె నదిని దాటించింది



• మాధవీ లత


ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజినీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత.

చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్

భారతీయ రైల్వే 2004లో జమ్ము–కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజినీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి.

ప్రొఫెసర్‌గా పని చేస్తూ...

ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజినీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా కూడా ఉంటూ సైన్స్‌ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజినీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీ లత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు.



అవకాశం ఇలా...

ఉధంపూర్ – బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ ఆర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలు కొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజినీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్–5 భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

కంచికి వెళ్లిన కథను ఇంటికి తెద్దాం

ఒకప్పుడు మనదేశంలో ప్రతి ఇల్లూ కథాకారులను తయారు చేసే గొప్ప సాంస్కృతిక వేదిక. కథాకారులు కనీసం ఇంటికొక్కరైనా ఉండేవారు. వీధిలో ఒకరిద్దరు నిష్ణాతులుండేవారు. ఆ నిష్ణాతులు కథ చెప్పడం మొదలు పెడితే చాలు, ఆ వీధిలోని అన్ని ఇళ్లలోని పిల్లలూ అక్కడే ఉండేవాళ్లు. శ్రోతలను కట్టిపడేసేటట్లు కథ చెప్పడానికి నియమిత శిక్షణ ఉండేది కాదు. వాళ్లు కథ చెప్పడంలో ఏ యూనివర్సిటీలోనూ కోర్సు చేయలేదు. అయినా సరే... కథ పూర్తయ్యేటప్పటికి హౌస్‌ఫుల్ అన్నట్లు ఆ ఇంటి వరండా నుంచి వీధి అరుగు వరకు జనంతో నిండిపోయేది. అలాంటి కథలు ఇప్పుడేమయ్యాయి?

మాయమవుతున్న కథాకారులు

గ్రామాలు కుచించుకుపోతున్నాయి, నగరాలు విస్తరిస్తున్నాయి. ప్రతి ఊరి నుంచి తరానికి కొందరు పట్టణాలకు వలసపోతున్నారు. పిల్లలకు కథలు చెప్పడానికి తగినంత ఖాళీ సమయం ఉన్న పెద్దవాళ్లు గ్రామాల్లో ఉండిపోవడం, పిల్లలు తల్లిదండ్రులతో నగరాలకు తరలి వెళ్లడంతో తరాలను కలిపి ఉంచిన కథ అనే అందమైన బంధం కూడా తెగిపోయింది. నగరాల్లో పిల్లలకు కథ చెప్పే బాధ్యతను తల్లిదండ్రులే తీసుకుందామనుకుంటే డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆ అవకాశాన్ని కూడా మింగేసింది. ఆ అగాథాన్ని గుర్తించిన విద్యావ్యవస్థ పిల్లలకు కథలు చెప్పడాన్ని సిలబస్‌లో చేర్చింది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికీ కార్పొరేట్ స్కూళ్ల దగ్గరే ఉంది. ఒక విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పగలిగిన సాధనం కథ. అంతటి ప్రభావవంతమైన సాధనాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామని ఆలోచించిన గీతారామానుజమ్ కథను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు.

ఇంటింటా కథాకారులు

'కథ కంచికి మనం ఇంటికి' అని ముగించే కథను కంచి నుంచి ఇంటికి తీసుకువచ్చే ప్రయత్నం మొదలైంది. కథల భాండాగారానికి పడి ఉన్న పీటముడిని విప్పుతున్నారు గీతారామానుజమ్. ఆమె వృత్తిరీత్యా శాస్త్రీయ గాయని. ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్‌గా అనుభవం ఉంది. రేడియో కార్యక్రమాల సమన్వయ కర్త కూడా. ఆమె 1996లో తోలుబొమ్మలతో పిల్లలకు కథ చెప్పడం మొదలుపెట్టారు. పిల్లలు కథలకు దూరం కావడానికి కారణం నగరాలకు వలసలతో పాటు నానమ్మ– తాతయ్యలకు దూరం కావడం ఒక కారణమైతే, టీవీలు స్మార్ట్ ఫోన్‌లు అంతకంటే ప్రమాదమైన భూమిక పోషిస్తున్నాయంటారామె. కథలను తిరిగి మన జీవితంలోకి తీసుకు రావడానికి బెంగళూరులో కథాలయ ఇంటర్నేషనల్ అకాడెమీ స్థాపించారు. ఆమె క్రమం తప్పకుండా సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలు నిర్వహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నారు. గత ఏడాది అరవైకి పైగా కథాకారులతో(కథ చెప్పేవాళ్లు) 'గాథ– ముంబయి ఇంటర్నేషనల్ స్టోరీ టెల్లింగ్ ఫెస్టివల్' నిర్వహించారు. పాతికేళ్ల ప్రయాణంలో ఆమె వేలాదిమంది కథాకారులను తయారు చేశారు. ఒక విషయాన్ని తెలియ చేయడానికి, విన్న వారిలో స్ఫూర్తిని అందించడానికి, ఉత్సాహపరచడానికి, చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడే అత్యంత ప్రభావవంతమైన సాధనం కథ. కథ చెప్పేటప్పుడు వినిపించేది గొంతు మాత్రమే. కానీ పలికేది గొంతు మాత్రమే కాదు. కథాకారుల ముఖం భావాలను పలుకుతుంది. గొంతు వాచకంతోపాటు నవరసాలను పలుకుతుంది. అంతకంటే ఎక్కువగా కళ్లు మాట్లాడుతాయి. అందుకే పిల్లలు చిన్నప్పుడు విన్న కథలు వారికి వృద్ధాప్యం వరకు తోడుగా వస్తాయి. వాళ్ల మనుమలకు చెప్పేవరకు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. ఇది దండలో దారంలా పైకి కనిపించని ఒక సంప్రదాయ పరంపర. ఈ పరంపరకు అంతరాయం కలగకూడదు. ఇప్పటికే ఏర్పడిన విరామానికి తెర దించుదాం. కంచికి వెళ్లిపోయిన కథను తిరిగి ఇంటికి తీసుకువద్దాం. 'అనగనగా ఒక రాజు' అంటూ కొత్త కథలను చెబుదాం. ప్రతి ఒక్కరం కథాకారులమవుదాం. పిల్లలున్న ప్రతి ఇంటినీ కథల నిలయంగా మారుద్దాం.




• కథకారిణి గీతా రామానుజమ్



• చిన్నారులకు కథలు చెబుతున్న ట్రైనర్



• ఆసక్తిగా వింటున్న ప్రేక్షకులు


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 19

గురువారం 11-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





ఇవి జేమ్స్ బాండ్ సీక్వెల్స్ కావు

అరెస్ట్ అయిన కేజ్రీవాల్‌ను సీఎం పోస్ట్ నుంచి తొలగించాలంటూ పదేపదే పిటిషన్లు దాఖలవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



ఆప్ మంత్రి రాజీనామా

ఢిల్లీ సంక్షేమ శాఖ మంత్రి, ఆప్ నేత రాజ్‌కుమార్ ఆనంద్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. పార్టీని సైతం వీడారు.

వివరాలు 6లో ▸



పబ్లిషర్ పేర్లు ముద్రించాల్సిందే

హోర్డింగులు సహా ఎన్నికల ప్రచారంలో వాడే సామగ్రిపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు కనిపించేలా ముద్రించాలని ఈసీ చెప్పింది.

వివరాలు 6లో ▸



అవినీతికి మారుపేరు డీఎంకే

డీఎంకే అవినీతికి మారుపేరుగా మారిందని, రాష్ట్రాభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రధాని మోదీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఓటును మించిన ఆయుధం లేదు



బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పదని, ఓటును మించిన ఆయుధం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బుధవారం బొటానికల్ గార్డెన్‌లో 2కే రన్ నిర్వహించారు.

- వివరాలు 2లో▶


టెట్ దరఖాస్తు గడువు పెంపు



టెట్‌కు దరఖాస్తు గడువును పొడిగించారు. ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొంది.

- వివరాలు 5లో▶

బాబుకు 'ఈడీ' వేడి



'లిక్కర్ స్కాం'లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిస్తోంది! హవాలా మార్గంలో అక్రమ నిధులు పొందే రాజకీయ పార్టీలపై ఈడీ కేసు నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 10లో▶

కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నివేదిత



సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నివేదిత పేరును అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. సాయన్న కుటుంబసభ్యులకే అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

- వివరాలు 3లో▶

జూన్‌లో లోకల్ వార్

లోక్‌సభ ఎన్నికలు ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికలు

- గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు
- విడివిడిగా చాలా రోజుల పాటు జరపడం సరికాదన్న యోచనలో సీఎం రేవంత్!
- లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ఆధారంగానే పదవులు వస్తాయని భువనగిరి సమీక్షలో స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలన్నింటికీ జూన్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బుధవారం జరిగిన భువనగిరి లోక్‌సభ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం.

మధ్య మధ్యలో ఎన్నికలతో ఇబ్బంది..

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పాలకవర్గాల పదవీకాలం జనవరి నెలాఖరులోనే పూర్తి కాగా.. ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు జూలైలో గడువు ముగియనుంది. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. జూలై తొలివారం నాటికి కొత్తగా మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలు కొలువుదీరాల్సి ఉంది. దీంతో జూన్ రెండో

మిగతా 3వ పేజీలో ▶

రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ

అసెంబ్లీ ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థను తెలంగాణలోనూ ఏర్పాటు చేయాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. తాజాగా భువనగిరి సమీక్ష సందర్భంగా ఈ కోణంలో చర్చ జరిగినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామని.. ఈ కమిటీల నుంచి చురుగ్గా ఉన్న ఒక కార్యకర్తను వలంటీర్‌గా ఎంపిక చేస్తామని సీఎం రేవంత్ చెప్పినట్టు సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలు క్రియాశీల పాత్ర పోషించే అవకాశం ఉంటుందని పేర్కొన్నట్టు తెలిసింది. వలంటీర్ల ద్వారా పథకాలను పారదర్శకంగా ప్రజలకు చేరువ చేయవచ్చనే ఆలోచనతో సీఎం ఈ వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం.



కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో నల్లగొండ, భువనగిరి ఎంపీ అభ్యర్థులు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు

ముప్పేట దాడి చేయాల్సిందే!

- బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజల్లో ఎండగట్టాల్సిందే..
- భువనగిరి లోక్‌సభ సమీక్షలో సీఎం రేవంత్ మార్గనిర్దేశం
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో భేటీ..

3లో

ఆర్థిక ఉగ్రవాది ఉన్మాదం

మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు, టీడీపీ డీలాతో రామోజీ బెంబేలు

నైరాశ్యంలో పాతాళానికి పతనమైన ఈనాడు రాతలు



- వేల కోట్లు కుమ్మరించేస్తోందంటూ వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతూ రోతరాతలు
- కోర్టు తీర్పుతో తన ఆర్థిక నేరాల గుట్టంతా రట్టవుతుందని గురివింద ఆందోళన
- ఈసీ కనుసన్నల్లో అధికారులు పనిచేస్తుంటే కూడా వంకర రాతలు.. ఎస్పీలు, కలెక్టర్లను బదిలీ చేస్తే 'ఈడ్చికొట్టిన ఈసీ' అంటూ ఆనందం
- మార్గదర్శి కేసు విచారించిన అధికారిని ఎన్నికల విధులకు వేరే రాష్ట్రానికి పంపితే చంకలు గుద్దుకున్న వైనం
- ఇప్పుడు వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని తేలడంతో మతిస్థిమితం కోల్పోయి పిచ్చిరాతలు
- ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహిస్తుంటే ముందస్తు చెల్లింపులు ఎలా సాధ్యం రామోజీ?
- జనసేన-బీజేపీతో జట్టుకట్టి.. నోట్ల కట్టలు వెదజల్లుతున్నా బాబుకు కన్పించని జనస్పందన
- చంద్రబాబు ఘోర పరాజయానికి ఇప్పటి నుంచే రామోజీ సాకులు వెతుకుతున్నారంటున్న పరిశీలకులు.. వాస్తవానికి రాజకీయాలను ఫక్తు వ్యాపారంగా మార్చేసిన చంద్రబాబు
- రూ. కోట్లు వెదజల్లే వారికే బాబు టికెట్లు... టిప్పర్ డ్రైవర్, ఉపాధి కూలీ వంటి సామాన్యులకు పెద్దపీట వేస్తూ టికెట్లు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

11లో

కాకి లెక్కలు కుదరవ్!

- మార్గదర్శికి తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు
- డిపాజిటర్లకు పూర్తిగా చెల్లించేశామన్న రామోజీ
- తమ ఆడిటర్లు లెక్కలు తేల్చేశారంటూ వాదన
- మీ సొంత ఆడిటర్లు చెబితే చెల్లదు..
- అది ధ్రువీకరించాల్సింది 2 రాష్ట్ర ప్రభుత్వాలేనన్న సుప్రీం
- బహిరంగ నోటీసు ఇవ్వనున్న ఇరు ప్రభుత్వాలు

11లో



వెల్లలచెరువు వద్ద ఓ మహిళ కన్నీళ్లు తుడుస్తున్న ఏపీ సీఎం జగన్

ఇదీ మా ప్రోగ్రెస్ రిపోర్ట్

2.31 లక్షల ఉద్యోగాలు, ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం.. చంద్రబాబు హయాంలో కేవలం 32 వేల ఉద్యోగాలే

పిడుగురాళ్ల సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్

చంద్రబాబు, పచ్చమీడియా కుట్ర రాజకీయాల్లో నిజాల నిగ్గు తేలుద్దాం

వారు చెప్పే అబద్ధాలు, మోసాలపై జాయింట్‌గా నిజ నిర్ధారణ చేద్దాం

వ్యవసాయం దండగన్న ఏకైక సీఎం బాబే

ఉచిత విద్యుత్ ఇస్తే బట్టలు ఆరేసుకోవాలని చెప్పింది ఈ పెద్దమనిషే.. రైతులను విచారించేందుకు కోర్టులు ఏర్పాటు చేసింది కూడా ఈయనే..

- వివరాలు 11లో

చంద్రబాబు మాదిరిగా

వెన్నుపోటు పొడుస్తారని..

అందుకే కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి అంటే భయపడుతున్నారు..

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



- రేవంత్‌ది బాబు స్కూలే కావడంతో కలవరపడుతున్నారు
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్లు ఆయన ఎప్పుడేం చేస్తారో తెలియని పరిస్థితి ఉంది.. రేవంత్ కాంగ్రెస్‌లో కంఫర్టబుల్‌గా లేరు..
- ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌తో చేతులు కలుపుతారు
- లేదంటే 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సొంత దుకాణం పెట్టుకునేందుకు రెడీగా ఉన్నారు
- ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి సైతం ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నారంటూ ఆరోపణ
- కాంగ్రెస్‌లో భట్టిని సైడ్ చేసే కుట్ర జరుగుతోందని వ్యాఖ్య

- వివరాలు 3లో

కాళేశ్వరంపై విచారణ వేసవి సెలవులు

ముగిశాకే..



- సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ
- తెలంగాణలోని 4 కోట్ల మందికి చెందిన రూ.లక్ష కోట్లకు సంబంధించిన అంశమన్న పిటిషనర్
- జూన్ తర్వాతకు వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లలో విచారణను హైకోర్టు వేసవి సెలవుల (జూన్) తర్వాతకు వాయిదా వేసింది. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్‌తో పాటు బక్క జడ్సన్ మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టింది. కేఏ.పాల్ వాదనలు వినిపిస్తూ.. 'దేశంలోనే అత్యంత అవినీతి జరిగిన ప్రాజెక్టు కాళేశ్వరం. వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలి. తెలంగాణలోని 4 కోట్ల మందికి చెందిన రూ.లక్ష కోట్లకు సంబంధించిన అంశం ఈ ప్రాజెక్టు. సీబీఐ

మిగతా 2వ పేజీలో ▶

ఐఎంజీ భూములపై దర్యాప్తునకు

సీబీఐ సిద్ధం



- కౌంటర్‌లోనూ దర్యాప్తు సంస్థ ఈ విషయం వెల్లడించింది
- అయినా ప్రభుత్వం తాత్సారం చేయడం తగదు
- సీబీఐ విచారణ కోరుతూ 12 ఏళ్ల క్రితమే వ్యాజ్యాలు
- హైకోర్టులో పిటిషనర్ల తరపు న్యాయవాది గండ్ర వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఎంజీబీపీఎల్)కు అక్రమంగా భూముల కేటాయింపుపై దర్యాప్తునకు సీబీఐ సిద్ధంగా ఉందని, అదే విషయాన్ని ఆ సంస్థ దాఖలు చేసిన కౌంటర్‌లోనూ పేర్కొందని హైకోర్టుకు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు తెలిపారు. అయినా ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. దేశంలో 2003లో జరిగిన అతిపెద్ద భూకుంభకోణం ఇదని.. దీనిపై సీబీఐ విచారణ కోరుతూ పిటిషనర్లు వ్యాజ్యాలు దాఖలు చేసి దాదాపు 12 ఏళ్లు గడిచిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రూ.వేల కోట్ల విలువైన (నేటి విలువ ప్రకారం దాదాపు రూ.లక్ష కోట్లు) హైదరాబాద్ పరిధిలో రెండుచోట్ల 850 ఎకరాల ప్రభుత్వ భూములను కారుచౌకగా ఓ బోగస్ కంపెనీకి కేటాయించారని, ఆ కంపెనీకి వందల కోట్ల రాయితీలు ఇవ్వడమే కాకుండా హైదరాబాద్‌లోని

మిగతా 2వ పేజీలో ▶

జేబులో కత్తెర పెట్టుకొని సీఎం

తిరుగుతాడా!



- జేబుదొంగలే తిరుగుతారు
- హామీలు నెరవేర్చమంటే మానవ బాంబులాగా మారతానంటున్నాడు
- మల్కాజిగిరిలో బీజేపీ కోసమే కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని పెట్టింది
- సీఎంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

బోడుప్పల్(హైదరాబాద్): జేబులో కత్తెర పెట్టుకొని సీఎం తిరుగుతాడా..జేబు దొంగలు మాత్రమే కత్తెర పెట్టుకొని తిరుగుతారని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా బుధవారం మేడిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చారని, వాటిలో కోటీ 67 లక్షల మంది మహిళలకు రూ.2,500 వచ్చాయా..రుణమాఫీ అయ్యిందా...రూ 4వేలు పింఛన్ వస్తోందా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, 6 గ్యారంటీలు అమలు చేస్తామని.. వాటిలో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. లంకెబిందెలు

మిగతా 3వ పేజీలో ▶



అనుభవం అనగానే 'వెన్నుపోట్ల'లో అని మీకు మీరే అనుకుంటే ఎలా!


చెరువంత కరువు జీవాల గుండె చెరువు

తరుముకొస్తున్న కరువుతో జీవాలకు గ్రాసం సైతం దొరకడం లేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బేరువాడ గ్రామ పరిధిలోని చెరువు పూర్తిగా అడుగంటి పోయి నెర్రెలు బారింది. దీంతో జీవాలకు గ్రాసం లేక.. తాగునీరు దొరక్క అల్లాడుతున్నాయి.



-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

1990 జూలై 1,000 | సెన్సెక్స్ బుల్ జర్నీ | 2024 ఏప్రిల్ 75,000



1986 జనవరిలో ఊపిరిపోసుకున్న స్టాక్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 550 పాయింట్ల వద్ద ప్రారంభమై ప్రస్తుతం 75,000 పాయింట్ల శిఖరానికి చేరింది. ఈ ప్రయాణంలో 2008లో గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలను కుదిపేసిన సబ్‌ప్రైమ్ సంక్షోభం, 2020లో ప్రపంచ దేశాలను వణికించిన కోవిడ్–19 మహమ్మారిని సైతం తట్టుకుని దౌడు తీస్తూ వచ్చింది. తాజాగా సరికొత్త రికార్డులకు తెరతీస్తూ బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ సైతం రూ. 400 లక్షల కోట్లను అధిగమించింది.

13లో

క్లుప్తంగా...

రంజాన్ ఆధ్యాత్మికతను పెంపొందిస్తుంది: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ రాధాకృష్ణన్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర ఖురాన్ బోధనల పట్ల, సమాజంపై వాటి ప్రగాఢమైన ప్రభావం పట్ల తనకెంతో గౌరవం ఉందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ ముస్లిం సమాజానికి స్వీయ–క్రమశిక్షణ, ఆధ్యాత్మికతను పెంపొంది స్తుందన్నారు. పవిత్రమైన రంజాన్ మాసం ముగింపు, ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ముస్లిం సమాజానికి గవర్నర్ హృదయపూ ర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

సీఎం రేవంత్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ముస్లిం సోదరసోదరీ మణులకు సీఎం రేవంత్‌రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్–ఉల్–ఫితర్ వేడుకలను రాష్ట్రంలోని ముస్లిం లందరూ ఆనందంగా జరుపుకొని అల్లా దీవెన లను అందుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం చెప్పా రు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పాతబస్తీలో మెట్రో రైలు లైన్‌కు శంకుస్థాపన చేయటంతో పాటు మైనా రిటీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులను పెంచిందని గుర్తుచేశారు.

పూలే జీవితం ఆదర్శనీయం: సీఎం

మహాత్మా జ్యోతిబా పూలే సేవలు చిరస్మ రణీయమని, ఆయన మార్గం మార్గదర్శకమని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. పూలే 198వ జయంతి (ఏప్రిల్ 11) సందర్భంగా ఆయన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునే ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతి బా పూలే పేరు పెట్టి ప్రజా భవన్‌గా మార్చిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పూలే జయం త్యుత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.

రాష్ట్రాన్ని సర్వమతాల సమాహారంగా నెలకొల్పాం

మాజీ సీఎం కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: పవిత్ర రంజాన్ మాసం చివరి రోజు ఈద్–ఉల్–ఫితర్ పర్వదినం సందర్భం గా ముస్లిం సహోదరులకు బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చం ద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. నెలరో జుల పాటు జరిగిన రంజాన్ ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు, పేదలకు సంతర్పణ కార్యాలు, తెలంగాణ వ్యాప్తంగా గొప్ప అధ్యా త్మిక వాతావరణాన్ని నింపాయన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, నూతన రాష్ట్రాన్ని సర్వమతాల సమాహారంగా, గంగా జమునా తహజీబ్‌కు ఆలవాలంగా నెల కొల్పామని పేర్కొన్నారు. లౌకికవాద సం ప్రదాయాలను పాటిస్తే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తమ పదేళ్ల పాలనలో నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు.

రంజాన్ సంతోషంగా జరుపుకోవాలి

మంత్రులు ఉత్తమ్, పొన్నం, సురేఖ, దామోదర, తుమ్మల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: నెలపాటు కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగ ను ముస్లింలందరూ సంతోషంగా జరుపుకోవా లని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దామోదర రాజన ర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించా రు. అన్ని సేవల కన్నా మానవ సేవ అత్యున్న తమైనదని చాటి చెప్పే రంజాన్ పండుగ లౌకి కవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యం త ప్రాధాన్యమిస్తుందని మంత్రులు తెలిపారు.

రామకృష్ణారావును విధుల నుంచి తొలగించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): పెండింగ్‌లో ఉన్న 10 నెలల ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు చెల్లించకుండా తిరస్కరించిన ఫైనాన్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావును వెంటనే విధుల్లోంచి తొల గించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రామకృష్ణారావు తీరును నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్య క్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యా నగర్‌లో హాస్టల్ విద్యార్థులు భారీ ర్యాలీ చేప ట్టారు. కృష్ణయ్య మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు గట్టిగా చెప్పినప్పటికీ, బీసీ సంఘాలు నెలరోజులుగా విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉద్దేశపూర్వకంగా మెస్‌బిల్లులు తిర స్కరించారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదువులకు దూరం చేయాలనే కుట్రతో ఇలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీం తో హాస్టళ్లలో ఉండే 8 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారనుందన్నారు.

ఓటును మించిన ఆయుధం లేదు

- 2కే రన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కోడ్ ఉల్లంఘనలపై 'సి విజిల్' యాప్‌లో ఫిర్యాదు చేయండి
- ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటాం



2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తదితరులు

గచ్చిబౌలి (హైదరాబాద్): బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పదని, ఓటును మించిన ఆయుధం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారం భించే ముందు ఆయన మాట్లాడుతూ, ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైందని పేర్కొన్నారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క రూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం కల్పి స్తున్న అవకాశాన్ని యువత వినియోగించుకోవా లని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గ కుండా ఓటును వినియోగించుకొని ప్రజాస్వా మ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉందని, ఏవైనా ఉల్లంఘనలు జరిగితే బాధ్యతగల పౌరులుగా తమకు ఫిర్యాదు చేయాలని సూచిం చారు. ఇందుకు 'సివిజిల్' యాప్‌ను మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదు అందిన వంద నిమిషాలలోపు విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని వికాస్‌రాజ్ తెలిపారు.

బ్యాలెట్ పవర్ గొప్పది: రోనాల్డ్‌రాస్

బుల్లెట్ కన్నా బ్యాలెట్ పవర్ చాలా గొప్పదని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం అన్నింటా ముందున్నా, ఓటింగ్‌లో 50 శాతం మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది, లేనిది చెక్ చేసుకోవాలని, లేనట్లయితే ఈనెల 15లోగా ఫారమ్–6 ద్వారా దరఖాస్తు చేసుకొని ఓటుహక్కు పొందాలని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, పెద్దసంఖ్యలో యువత, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. హైటెక్స్ రోడ్‌లోని మెటల్ చార్మినార్ వరకు రన్ కొనసాగింది.

ఒకటి గజదొంగ.. మరొకటి ఘరానా దొంగ

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



లాలాపేట(హైదరాబాద్): కాంగ్రెస్, బీఆర్ఎస్ వేర్వేరు కాదని...ఒకటి గజదొంగ.. మరొకటి ఘరానాదొంగ అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా బుధవారం ఆయన తార్నాక, విజయ పురికాలనీ మీదుగా మెట్టుగూడ వరకు పర్యటిం చారు. మెట్టుగూడలోని వైజంక్షన్ రోడ్డు వద్ద జరి గిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. రెండూ కుటుంబ పార్టీలని..ఎప్పుడూ ప్రజలను మోసం చేస్తూనే ఉంటాయని లేదన్నారు, నెహ్రూ కుటుంబంలో వారి వారసులే ప్రధానులు అయ్యా రు.. కేసీఆర్ తర్వాత ఆయన కుమారుడు, బిడ్డ, మనుమడే నాయకులుగా ఉంటారని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేది లేదని, ఎన్నికల తర్వాత ఆయన విదేశాలకు వెళతాడన్నారు.

కేసీఆర్ కూతురు కవిత ఎక్కడుంది

కేసీఆర్ కూతురు కవిత ఎక్కడుంది తెలుసా అంటూ కిషన్‌రెడ్డి ప్రజలను అడిగారు..వారంతా తిహార్ జైలులో అని సమాధానం ఇచ్చారు. తెలంగాణను దోచింది చాలదన్నట్టు ఢిల్లీలో బీరు, బ్రాండీ వ్యాపారం చేసిందని, వేల కోట్లు దోచుకుందామని వెళ్లి పట్టుబడిందన్నారు. గత పదేళ్ల పాలనలో పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఆశపెట్టి, ప్రజల నుంచి దోపిడీ చేసిన డబ్బులతో తండ్రి,కొడుకు, బిడ్డ తలా ఒక ఫామ్ హౌస్ కట్టుకున్నారని విమర్శించారు.

వినోద్, బండి కరీంనగర్‌కు ఏం చేశారు?

మంత్రి పొన్నం ప్రభాకర్



పూజలో పాల్గొన్న పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్ తదితరులు

కొండగట్టు(చొప్పదండి): కరీంనగర్‌కు బోయినపల్లి వినోద్‌కుమార్, బండి సంజయ్ ఏం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సంజయ్ రాముడి ఫొటోతో రాజకీయం చేస్తున్నారని, ఆయనకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, వినోద్‌కుమార్ సొంత జిల్లాకు వెళ్లాలని, లేకుంటే ఆయనకు నాలుగోస్థాన మేనన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనే యస్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి, మానకొండూరు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి బుధ వారం దర్శించుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ముడుపు కట్టామని, అనుకున్నట్టు జరగ డంతో మొక్కు చెల్లించుకున్నామని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. వినోద్‌కుమార్, బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని, లేకుంటే శ్వేతపత్రమైనా విడుదల చేయాలని సవాల్ చేశారు. గతంలో కేసీఆర్ కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో హిందుగాళ్లు.. బొందుగాళ్లు అన్న మాటను అడ్డు పెట్టుకొని గెలిచిన సంజయ్.. కొండగట్టు, వేములవాడ, ఇతర ఆలయాలకు ఏం చేశాడని ప్రశ్నించారు. వినోద్‌కుమార్ బీఆర్ఎస్ కట్టించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఓట్లు అడగాలని సూచించారు. కొండగట్టులో 65 మంది చనిపోతే కేసీఆర్, వినోద్‌కుమార్ పట్టించుకోలేదని, ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు.

అమరవీరుల స్తూపం వద్ద చర్చిద్దామా?

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఉద్యోగ సంఘాల మాజీ నేత సవాల్

సాక్షి, హైదరాబాద్: 'ఎవరి హయాంలో ఉద్యోగుల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయో అమరవీరుల స్తూపం వద్ద చర్చిద్దామా'అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఉద్యోగ సంఘాల మాజీ నేత హర్షవర్ధన్‌రెడ్డి సవాల్ చేశారు. ఉద్యోగులను, ఉద్యోగ సంఘాల నేతలను మోసం చేసిన శ్రీనివాస్‌గౌడ్‌కు వాళ్ల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం అండదండగా ఉండి అన్ని పనులు చేశామని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ మాట తప్పుతుందని విమర్శించడం చూస్తుంటే ఆయనకు ప్రజలిచ్చిన తీర్పుతో మతిభ్రమించినట్టు అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గతంలో ఉద్యోగ సంఘాల నాయకునిగా చెప్పుకుంటూ ఎమ్మెల్యే, మంత్రి పదవి పొందినా పదేళ్లలో ఒక్క ప్రయోజనకరమైన పని చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులకు నెలవారీ జీతం ఎప్పుడు వస్తుందో తెలియక, ఇబ్బందులు పడుతుంటే మాట్లాడని మీరు, ఇప్పుడు ఉద్యోగుల గురించి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు.

ఐఎంజీ భూములపై దర్యాప్తునకు సీబీఐ సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

స్టేడియాలు అప్పగించారని.. దీని వెనుక నాటి రాజకీయ పెద్దలు(చంద్రబాబు ప్రభుత్వం) ఉన్నారని, సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు హైకోర్టులో 2012లో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. నాటి నుంచి వీటిపై విచారణ సాగుతూ ఉంది. ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి ఈ వ్యాజ్యాలపై విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున గండ్ర వాదనలు వినిపిస్తూ.. 'సుప్రీంకోర్టులో ఐఎంజీబీపీఎల్ దాఖలు చేసిన అప్పీల్‌కు, ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలకు ఎలాంటి సంబంధం లేదు. ఐఎంజీబీపీఎల్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఇంకా లిస్ట్ కాలేదు. ఒకవేళ లిస్ట్ అయినా దానితో ఈ వ్యాజ్యాల విచారణకు ఎలాంటి ఆటంకం రాదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసమంటూ, సుప్రీంకోర్టులో అప్పీల్ అంటూ ఈ ఏడాదిలోనూ పదిసార్లు ఈ వ్యాజ్యాలు వాయిదా పడ్డాయి. విచారణ చేపట్టాలి'అని కోరారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. రెండు వారాలు వేచిచూసి విచారణ చేపడతామంటూ.. ఈ నెల 29కి వాయిదా వేసింది.

కాళేశ్వరంపై విచారణ వేసవి సెలవులు ముగిశాకే..

▶ మొదటి పేజీ తరువాయి

దర్యాప్తుతోపాటు భవిష్యత్‌లో ఎలాంటి ప్రాజెక్టు నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వినియోగించుకునేలా నిపుణుల కమిటీని కూడా వేయాలి. ఎన్నికలకు ముందు పలు సభలు, సమావేశాల్లో కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపిస్తామన్న సీఎం రేవంత్ అధికారంలోని రాగానే మాట మార్చారు. సీబీఐ విచారణ కోరకుండా.. రిటైర్డ్ జడ్జితో విచారణ అంటున్నారు'అని పేర్కొన్నారు. ఈ కేసులో సీఎం పార్టీ కాదని.. ఆయనపై చర్చ అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పాల్ వాదనలను ధర్మాసనం పలుమార్లు తప్పుబట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

బీసీ గురుకుల జూ. కాలేజీ ప్రవేశాల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు సొసైటీ కార్యదర్శి సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'కవిత సీబీఐ విచారణ' కేసు 26కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సీబీఐ జైలులో విచారించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను బుధవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించారు. కవిత దాఖలు చేసిన పిటిషన్‌లో సీబీఐ రిప్లై ఇవ్వలేదని న్యాయవాది నితీష్ రాణా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రిప్లై ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇవ్వకుండానే కవితను విచారించారన్నారు. శనివారం సాయంత్రం కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా సీబీఐ బేఖాతరు చేసిందన్నారు. దీనిపై తమ వాదనలు వినాలని కోరారు. అప్పటి వరకూ విచారణ అనుమతిపై స్టే ఇవ్వాలని కోరారు. అనంతరం, సీబీఐ తరఫు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ కవితను విచారించడానికి కోర్టు అనుమతి ఇచ్చిన తర్వాతే శనివారం మధ్యాహ్నం జైలులో విచారించామని ఈ నేపథ్యంలో కౌంటరు దాఖలు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇరు పక్షాల వాదనల తర్వాత... భవిష్యత్తులో విచారణ చేస్తే ముందుగా అప్లికేషన్ దాఖలు చేయాలని సీబీఐకు న్యాయమూర్తి సూచించారు. ఈ నెల 26న విచారణ చేపడతామని న్యాయమూర్తి వాయిదా వేశారు.

ఇక అడ్డగోలు ప్రైవేట్ ఆసుపత్రులపై కొరడా

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ హెచ్చరిక
- డ్యూటీ ఆఫీసర్లుగా ఎంబీబీఎస్ చేసిన వారినే నియమించాలి
- డిస్ ప్లే బోర్డులో డాక్టర్ల రిజిస్ట్రేషన్ నంబర్లు కచ్చితంగా ఉండాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా ప్రైవేట్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఆందోళన వ్యక్తం చేసింది. ఇకపై ఉల్లంఘన జరిగినట్టు నిర్ధారణైతే కఠిన చర్యలు తప్పవని మండలి చైర్మన్ డాక్టర్ కె.మహేష్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి హైదరాబాద్‌లోని వివిధ ఆసుపత్రులు, క్లినిక్‌లను తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించినట్లు తెలిపారు. చాలా ఆసుపత్రులు డిస్‌ప్లే బోర్డులో కన్సల్టెంట్ డాక్టర్ల రిజిస్ట్రేషన్ నంబర్లను ప్రదర్శించడం లేదని గుర్తించారు. కొన్ని ఆసుపత్రుల్లో ఫార్మ్ డీ పట్టా పొందిన వారిని డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా నియమిస్తున్నారని, వారు రోగులకు సంబంధించిన కేస్ షీట్లు కూడా రాస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. అనేక ఆసుపత్రులు ఆయుష్ వైద్యులను డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా నియమిస్తున్నట్లు తేలిందని స్పష్టం చేశారు. కొంతమంది కన్సల్టెంట్లు కూడా మండలి రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ లేకుండా ప్రాక్టీస్ చేస్తున్నట్టు గుర్తించామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు, ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లుగా ఎంబీబీఎస్ చేసిన వారిని మాత్రమే డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా నియమించాలని ఆయన ఆదేశించారు. ఫార్మ్ డీ, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్ తదితర ఇతర డిగ్రీ హోల్డర్లను డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌లుగా నియమించవద్దని మహేష్ స్పష్టం చేశారు.

గణేశ్‌పూర్‌లోనే రేషన్ పంపిణీకి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా బేల మండలం గణేశ్‌పూర్ గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. గణేశ్‌పూర్ పంచాయతీ పరిధిలోని రాయ్‌పూర్ కొలాం, రాయ్‌పూర్‌తండా గిరిజనులు రేషన్ బియ్యం కోసం పడుతున్న ఇబ్బందులపై 'రేషన్ అందక.. రెండ్రోజులు నడక'శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై డీఎస్‌ఓ కిరణ్‌కుమార్ స్పందించారు. పౌరసరఫరాల శాఖ, బేల మండల డిప్యూటీ తహసీల్దార్‌తో అక్కడి పరిస్థితులపై విచారణ జరిపించారు. గణేశ్‌పూర్‌లో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఉందని, సోన్‌కాస్‌లో జియో నెట్‌వర్క్ ఉన్నందున డీలర్ సోన్‌కాస్‌లో బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆయన తెలిపారు. దీంతో అనుబంధ గ్రామాల గిరిజనులు అక్కడికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. మే నెల నుంచి గణేశ్‌పూర్‌లోనే ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులంతా ఒకేసారి వస్తే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా వారి గ్రామాలకు బియ్యం తరలించేలా చూడాల్సిందిగా పంచాయతీ కార్యదర్శితో మాట్లాడామని చెప్పారు.

సీఎం రేవంత్, బీజేపీ, ఆంధ్రజ్యోతిపై చర్యలు తీసుకోండి

ఎన్నికల కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నియమావళి ఉల్లంఘించి తమ పార్టీ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్‌పై నిరాధార ఆరోపణలు, అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భారత్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లతోపాటు డీజీపీకి కూడా బీఆర్ఎస్ బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొంది. రేవంత్ చేసిన వ్యాఖ్యలను అన్ని పత్రికలు చానళ్లతో పాటు, యూట్యూబ్ చానళ్లు కూడా ప్రసారం చేశాయని, ముఖ్యమంత్రి రేవంత్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయన్ను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నిషేధించాలని బీఆర్ఎస్ తన ఫిర్యాదులో పేర్కొంది.

- బీజేపీ కూడా తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అనేక అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు చేసిందని ఎన్నికలకు కమిషన్‌కు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొంది.
- ఆంధ్రజ్యోతి దినపత్రిక కూడా బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొని అసత్య ప్రచారాలు చేస్తుందని మరో ఫిర్యాదు లేఖను అందజేసింది. 'ఫోన్‌ట్యాపింగ్ కేసులో మరో పదిమందికి పైగా బీఆర్ఎస్ నేతలు'అంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎలాంటి ఆధారాలు లేకుండా వార్తను ప్రచురించిందని బీఆర్ఎస్ తన ఫిర్యాదులో పేర్కొంది. తమ పార్టీపై అసత్య వార్తలు రాస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, ప్రచురణకర్త కోగంటి వెంకట శేషగిరిరావుతో పాటు పత్రిక ఎడిటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌తోపాటు డీజీపీని బీఆర్ఎస్ కోరింది.

కిడ్నాప్ చేసి.. బెదిరించి

మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావుపై కిడ్నాప్ కేసు



- సహ నిందితులుగా ఇన్‌స్పెక్టర్లు గట్టుమల్లు, మల్లికార్జున్
- క్రియా హెల్త్‌కేర్ అధినేత వేణుమాధవ్‌ను నిర్బంధించి, రూ. 10 లక్షలు వసూలు చేశారని ఆరోపణ
- వేణు నుంచి సంస్థ షేర్లు లాక్కుని యాజమాన్య మార్పిడి
- అయిదేళ్ల క్రితమే జరిగినా.. తాజా పరిణామాలతో ధైర్యం తెచ్చుకుని ఫిర్యాదు
- పీటీ వారెంట్ దాఖలు చేయాలని అధికారుల నిర్ణయం
- ట్యాపింగ్ కేసులో రాధాకిషన్‌రావు పోలీసు కస్టడీ పూర్తి

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: అక్రమ ఫోన్ ట్యాపింగ్, బెదిరింపు వసూళ్ల ఆరోపణలపై అరెస్టయిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) పి.రాధాకిషన్‌రావుపై జూబ్లీహిల్స్ ఠాణాలో కిడ్నాప్ కేసు నమోదైంది. క్రియా హెల్త్‌కేర్ వివాదంలో తలదూర్చి దాని డైరెక్టర్ వేణుమాధవ్ చెన్నుపాటిని కిడ్నాప్ చేసి, షేర్లు, యాజమాన్య బదిలీ చేయించడంతో పాటు రూ.10 లక్షలు వసూలు చేసిన ఆరోపణలపై దీన్ని రిజిస్టర్ చేశారు. ఈ కేసులో ఇన్‌స్పెక్టర్లు బి.గట్టుమల్లు, ఎస్.మల్లికార్జున్ సైతం నిందితులుగా ఉన్నారు. ఇది సోమవారమే రిజిస్టర్ కాగా... బుధ వారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే రాధాకిషన్‌రావుపై కూకట్‌పల్లి ఠాణాలో బెదిరింపుల కేసు నమోదైన విషయం విదితమే. మరోపక్క అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన పోలీసు కస్టడీ బుధవారంతో ముగిసింది. వారం రోజుల పాటు ఆయన్ను వివిధ కోణాల్లో ప్రశ్నించిన సిట్ అధికారులు కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది.

వ్యాపారవేత్త వేణును ఎలా ట్రాప్ చేశారంటే..

నగరానికి చెందిన వేణుమాధవ్ చెన్నుపాటి ప్రపంచ బ్యాంక్‌లో కొన్నాళ్లు పని చేసిన తర్వాత 2008లో తిరిగి వచ్చి 2011లో క్రియా హెల్త్‌కేర్ సంస్థను స్థాపించారు. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో 165 పట్టణ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, టెలి మెడిసిన్ సౌకర్యాలు, అత్యవసర వాహనాలతో సహా ప్రధాన ప్రాజెక్టులను ఈ సంస్థ నిర్వహించేది. 2016 నాటికి క్రియా హెల్త్‌కేర్ మూడు ప్రధాన ప్రాజెక్ట్‌లను చేజిక్కించుకుని ఐదేళ్లల్లో తమ ప్రాజెక్టు విలువను రూ.250 కోట్లకు పెంచుకుంది. ఇది జరిగిన కొన్నాళ్లకు గోపాల్, రాజ్, నవీన్, రవి క్రియాలో పార్ట్ టైమ్ డైరెక్టర్లుగా చేరారు. 2015లో బాలాజీ ఈ సంస్థకు సీఈఓగా నియమితులయ్యారు. 2016–17 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి క్రియా హెల్త్‌కేర్‌లో ఆరుగురు డైరెక్టర్లు ఉండగా... వేణు 60, బాలాజీ 20, గోపాల్ 10, రాజ్ 10 శాతం చొప్పున షేర్లు కలిగి ఉన్నారు. వీరిలో వేణు, బాలాజీ మాత్రమే ఫుల్‌టైమ్ డైరెక్టర్లు. 2018లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నాన్ ఎమర్జెన్సీ మొబైల్ హెల్త్‌కేర్ క్లినిక్‌ల ఏర్పాటుకు బిడ్డింగ్‌కు పిలిచింది. అందులో పాల్గొన్న క్రియా హెల్త్‌కేర్ 1500 మొబైల్ అంబులెన్స్ హెల్త్ క్లినిక్‌లను నడిపే ప్రాజెక్టును తీసుకునే ముందు కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సంస్థ పార్ట్‌టైమ్ డైరెక్టర్లు నలుగురూ వేణుకు ఉన్న 60 శాతం షేర్లను తక్కువ విలువకు విక్రయించాలని పట్టుబట్టారు. సీఈఓ బాలాజీని కూడా వారి వైపు తిప్పుకున్నారు.

రాధాకిషన్‌రావు తనదైన శైలిలో బెదిరించి..

అక్కడ రాధాకిషన్‌రావు ప్రోద్బలంతో అప్పటి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు తీవ్రస్థాయిలో వేణును బెదిరించారు. దాదాపు రూ.100 కోట్ల విలువైన క్రియా హెల్త్‌కేర్ కంపెనీలోని షేర్లు, యాజమాన్యం వదులుకోవాలని హెచ్చరించారు. రాధాకిషన్‌రావుతో పాటు ఇతర నిందితుల సమక్షంలో నాటకీయ పరిణామాల మధ్య తుపాకులు, కర్రలతో బెదిరించడంతో గత్యంతరం లేక వేణు సెటిల్‌మెంట్ అగ్రిమెంట్‌పై సంతకం చేయాల్సి వచ్చింది. వేణు నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి గట్టుమల్లు, మల్లికార్జున్‌తో కూడిన బృందం ఈ విషయాన్ని పోలీసులు, మీడియా, కోర్టుల్లో ఎవరి దృష్టికి తీసుకువెళ్లినా ప్రాణహాని ఉంటుందని హెచ్చరించి పంపింది.

తాజా పరిణామాలతో ధైర్యం తెచ్చుకుని ఫిర్యాదు

ప్రాణభయంతో ఇన్నాళ్లు మిన్నకుండిపోయిన వేణుమాధవ్‌కు ఇటీవల రాధాకిషన్‌రావు అరెస్టు విషయం తెలిసి ధైర్యంగా ముందుకు వచ్చి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అధికారులు రాధాకిషన్‌రావు, చంద్రశేఖర్ వేగే, గట్టుమల్లు, మల్లికార్జున్, కృష్ణ, గోపాల్, రాజ్, రవి, బాలాజీ తదితరులపై ఐపీసీలోని 386, 365, 341, 120 (బీ), రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో రాధాకిషన్‌రావుపై కోర్టు ద్వారా పీటీ వారెంట్ తీసుకుని అరెస్టు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం గట్టుమల్లు రాచకొండ ఐటీ సెల్‌లో, మల్లికార్జున్ ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తున్నారు. మల్లికార్జున్ సుదీర్ఘకాలం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌లో ఎస్సైగా పని చేశారు. పదోన్నతి తర్వాత రాధాకిషన్‌రావు సిఫార్సుతోనే ప్రభాకర్‌రావు ఎస్ఐబీలోకి తీసుకున్నారు.

రూ.40కోట్ల షేర్లను రూ.40 లక్షలకే బదిలీ చేయించుకుని ..

- ఇదిలా ఉండగా.. గోల్డ్ ఫిష్ అబోడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేగే చంద్రశేఖర్ తన కంపెనీలో పెట్టుబడి కోసం 2018 మార్చిలో వేణుమాధవ్‌ను సంప్రదించారు. ఆ సందర్భంలోనే క్రియా హెల్త్‌కేర్ వివాదాలు తెలుసుకుని, పార్ట్‌టైమ్ డైరెక్టర్లతో మాట్లాడి విషయం సెటిల్ చేస్తానని చెప్పారు. ఇలా మార్కెట్‌లో రూ.40 కోట్ల విలువైన షేర్లను కేవలం రూ.40 లక్షలకే వేణు నుంచి బదిలీ చేయించుకున్నారు. నలుగురు పార్ట్‌టైమ్ డైరెక్టర్లతో అతడు మరో రహస్య ఒప్పందం కేసుకుని తనను మోసం చేసినట్లు వేణుకు తర్వాత తెలిసింది. వేణు మాధవ్ తన నలుగురు పార్ట్‌టైమ్ డైరెక్టర్ల వేధింపులపై 2018 అక్టోబర్ 3న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే నెల 12 నుంచి నలుగురి నుంచి వేణుకు వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో ప్రాజెక్టు ప్రారంభించడానికి గడువు సమీపిస్తుండటంతో 2018 నవంబర్‌లో చంద్రశేఖర్ వేగే, గోపాల్, రాజ్ తలసిల, నవీన్, రవి అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ పి.రాధా కిషన్‌రావును ఆశ్రయించారు. కంపెనీకి సంబంధించిన మిగిలిన షేర్లనూ తమకు ఇప్పించమని వీళ్లు కోరా రు. దీంతో రాధాకిషన్‌రావు, అప్పటి టాస్క్ ఫోర్స్ ఎస్సై మల్లికార్జున్ అదే నెల 22న ఉద యం 5.30 గంటలకు వేణును తమ సిబ్బందితో కలిసి కిడ్నాప్ చేసి సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారు.

దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరు తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ బీ ఫాంపై గెలుపొంది.. పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని పేర్కొన్నారు. ఆయనపై ఇప్పటికే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కాగా, హైకోర్టులో వేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుండటంతో దానం కేడర్‌లో టెన్షన్ మొదలైంది. కోర్టు పిటిషన్ నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించక పోవొచ్చనే ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

టీపీసీసీ లీగల్ చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్టీఐ విభాగం చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ లీగల్ సెల్ కార్యదర్శి విపుల్ మహేశ్వరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను లీగల్ సెల్ చైర్మన్‌గా నియమించినందుకు పార్టీ అధిష్టానానికి అశోక్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఏఐసీసీ కార్యదర్శులు, లీగల్ సెల్ నేతలకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. తనపై అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో లీగల్ సెల్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

క్లుప్తంగా...


రాష్ట్రంలో ప్రజాపాలన సాగడంలేదు: బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాపాలన సాగడం లేదని, నయవంచన పాలన నడుస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ విమర్శించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ సంపదనంతా ముఖ్యమంత్రి ఢిల్లీకి చేరవేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డి మీడియాకు నేరుగా చెప్పకుండా.. ప్రతి రోజూ ఏదో ఒక లీక్ చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారని మండిపడ్డారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రజలు నీళ్ల లేక అవస్థలు పడుతున్నారని, వీటినుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ముఖ్యమంత్రి ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎంపీ అభ్యర్థులంతా డమ్మీలని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి గెలుపు కోసం దానం నాగేందర్ ను బీఆర్ఎస్ నుంచి తీసుకుని సికింద్రాబాద్ అభ్యర్థిగా ప్రకటించారని విమర్శించారు. తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో పచ్చి అబద్ధాలు మాట్లాడించారని, రేవంత్ రెడ్డి ఏం చెప్పితే అది మాట్లాడి వెళ్లిపోయారని అన్నారు.

కాంగ్రెస్, ఎంఐఎం దోస్తీ బయటపడింది

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల అసలు రంగు బయటపడిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీ గెలవాలని కాంగ్రెస్ కోరుకుంటోందని.. అంతర్గతంగా కాంగ్రెస్, ఎంఐఎంలు జతకట్టాయన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్ ఖాన్ బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రకాశ్‌రెడ్డి ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ కు తొలి మేయర్‌గా ఎంఐఎం అభ్యర్థికి మద్దతిచ్చి హైదరాబాద్ పతనానికి కాంగ్రెస్ నాంది పలికిందన్నారు. ఎంఐఎం బీజేపీకి బీటీమ్ అని రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేశారని, కానీ ఇప్పుడు వారి అసలు రంగు బయటపడిందని అన్నారు. దాదాపు నాలుగైదు దశాబ్దాలుగా ఈ రెండు పార్టీలు హైదరాబాద్‌ను, రాష్ట్రాన్ని నాశనం చేశాయని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రత్యక్షంగా ఎంఐఎంను పెంచిపోషించాయని ధ్వజమెత్తారు.

బీసీల వ్యతిరేక ప్రభుత్వం ఇది: దూదిమెట్ల బాలరాజు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీల వ్యతిరేక ప్రభుత్వం పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజు యాదవ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గొల్ల కురుమలు బీఆర్ఎస్ హయాంలో కట్టిన డీడీలకు సంబంధించిన డబ్బులు విడుదల చేయకుండా కుట్ర చేస్తున్నారన్నారు. గొల్ల కురుమల నుంచి గెలిచిన బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మున్నూరు కాపులకు, మైనారిటీలకు మంత్రి మండలిలో స్థానం లేదని, బీసీల వ్యతిరేక ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని దూదిమెట్ల కోరారు.

ముప్పేట దాడి చేయాల్సిందే!

బీఆర్ఎస్, బీజేపీలను ప్రజల్లో ఎండగట్టాల్సిందే..

- భువనగిరి లోక్‌సభ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ మార్గనిర్దేశం
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో భేటీ.. హాజరైన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు
- రాష్ట్రమంతటా నిర్వహించాల్సిన ప్రచారశైలిపైనా చర్చ
- ప్రియాంకా గాంధీ ఫోకస్‌గా ఈసారి ప్రచార వ్యూహం రూపొందించాలని నిర్ణయం
- మే నెల తొలివారంలో మిర్యాలగూడ, చౌటుప్పల్‌లలో ప్రియాంక ప్రచారం
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు
- ఆరు వేల మంది కార్యకర్తలతో భేటీలు.. విస్తృతంగా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై ముప్పేట దాడి చేయాల్సిందేనని కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. ఆ రెండు పార్టీలు, వాటి పాలన తీరును ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధతలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో ఆ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామ్యేల్, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి, నల్లగొండ లోక్‌సభ అభ్యర్థులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, చెవిటి వెంకన్న యాదవ్, అండెం సంజీవరెడ్డితోపాటు పార్లమెంటు నియోజక వర్గానికి చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు.

వీలైనంత మేర 'గాంధీ'ల ప్రచారం

ఈ సమావేశంలో భాగంగా భువనగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఎన్నికల ప్రచార సరళిపై చర్చించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. ఈసారి ఎన్నికల్లో ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకా గాంధీ ఫోకస్‌గా ప్రచార షెడ్యూల్ ఖరారు చేయాలని కోరినట్టు దీనిపై రేవంత్ స్పందిస్తూ.. ఏఐసీసీ నేతల ప్రచారాన్ని వీలైనంత మేర సద్వినియోగం చేసుకునేలా షెడ్యూల్ రూపొందించుకోవాలని సూచించినట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా రాహుల్, ప్రియాంక, ఖర్గేతోపాటు వీలును బట్టి సోనియాగాంధీ పాల్గొనేలా ఏఐసీసీని కోరుతానని చెప్పినట్టు సమాచారం.

భువనగిరి కీలకం!

భువనగిరి లోక్‌సభ స్థానంలో పార్టీ గెలుపు కీలకమని, కోమటిరెడ్డి బ్రదర్స్ సహకారంతో ఈ స్థానాన్ని తప్పకుండా మంచి మెజార్టీతో గెలిపించుకునేలా స్థానిక నేతలు ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ సమావేశంలో సూచించారు. ఈనెల 12వ తేదీ నుంచి 18 వరకు భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సెగ్మెంట్‌లో దాదాపు 300 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్ నుంచి 20 మంది చొప్పున 6 వేల మంది ప్రతి సమావేశంలో పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ సమావేశాల నిర్వహణ బాధ్యతలను లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అప్పగించారు. ఇక ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 16 మున్సిపాలిటీలు, 45 మండలాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా రూట్‌మ్యాప్ తయారు చేయాలని చెప్పారు. మే మొదటి వారంలో (3, 4, 5 తేదీల్లో) చౌటుప్పల్, మిర్యాలగూడలో ప్రియాంకా గాంధీ సభలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇదే ప్రచార సరళిని రాష్ట్రమంతటా వర్తింపజేద్దామని, అన్ని చోట్లా అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల స్థాయి సమావేశాలతోపాటు రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఏఐసీసీ నేతల ప్రచార షెడ్యూల్‌ను సిద్ధం చేద్దామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ, బీఆర్ఎస్‌ల తీరును ఎండగట్టడంతోపాటు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు.

బీఆర్ఎస్ కథ సమాప్తం

సమీక్ష సమావేశానంతరం భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి లోక్‌సభ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. భువనగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా కూడా బీఆర్ఎస్ కథ సమాప్తమైందన్నారు. సమీక్షలో అనుసరించాల్సిన ప్రచార సరళిపైనా చర్చించామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని.. పార్టీ కార్యకర్తలు, స్థానిక నేతలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న భువనగిరి అభ్యర్థిగా చామల కిరణ్ నామినేషన్ వేస్తారన్నారు. మే తొలివారంలో చౌటుప్పల్‌లో జరిగే బహిరంగసభకు ప్రియాంకా గాంధీ హాజరవుతారని చెప్పారు. తనకు పోటీ అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్, కోమటిరెడ్డి బ్రదర్స్‌కు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

సాక్షి, హైదరాబాద్: కంటోన్మెంట్, తుంగతుర్తి, మేడ్చల్ నియోజకవర్గాల నుంచి పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేశ్, 11 మంది కౌన్సిలర్లు, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, తుంగతుర్తి బీఆర్ఎస్ నేతలకు కండువా కప్పి పార్టీలోకి సీఎం ఆహ్వానించారు.



జేబులో కత్తెర పెట్టుకొని సీఎం తిరుగుతాడా!

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటాయని అనుకొని వచ్చినా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడు..అసలు లంకెబిందెల కోసం దొంగలు కదా తిరిగేది అని అన్నారు. రేవంత్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేరని ఆయనకు తెలుసు..అందుకే ఈ స్కామ్‌లు, ఆ స్కామ్‌లు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌లపై పెట్టే శ్రద్ధ వాటర్‌ట్యాప్‌లపై పెట్టాలని, ఇచ్చిన హామీల గురించి అడిగితే మానవబాంబు అవుతానంటున్నాడు అని అన్నారు. ఎనిమిది రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలను బీజేపీ పడగొట్టిందని, ఇక్కడ ప్రభుత్వాన్ని పడకొట్టక ముందే రేవంత్‌రెడ్డి నేను రెడీ అంటూ..ఎన్నికల తర్వాత కొంత మంది ఎమ్మెల్యేలతో బీజేపీలోకి జంప్ అవుతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలంటే ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిని ఓడించాలన్నారు. రేవంత్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిని గెలిపించడానికి డమ్మీ అభ్యర్థిని పెట్టారని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదంటున్నావు.. నీవు కొడంగల్‌లో రాజీనామా చేయి, నేను సిరిసిల్లలో రాజీనామా చేసి ఎన్నికల్లో తేల్చుకుందాం అని సవాల్ విసిరారు. బీజేపీ అభ్యర్థి హుజూరాబాద్, గజ్వేల్‌లో ఓడారు, తర్వాత ఇక్కడ పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఓడితే ఆయన ఎక్కడ ఉంటాడని, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ నాన్‌లోకల్ అని, మన అభ్యర్థి లోకల్ నాయకుడని చెప్పారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత

- అధికారికంగా ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్
- దివంగత లాస్య నందిత కుటుంబానికే అవకాశం

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గైని నివేదిత పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందిత కుటుంబసభ్యులకే పోటీ చేసే అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో నివేదితను అభ్యర్థిగా ప్రకటించారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్ నుంచి దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన రెండున్నర నెలలకే ఈ ఏడాది ఫిబ్రవరి 24న పటాన్‌చెరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మరణించారు. తాజాగా లోక్‌సభ ఎన్నికలతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ నేపథ్యంలో దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి నివేదితను ఉప ఎన్నిక బరిలోకి దించాలని కేసీఆర్ నిర్ణయించారు. బీఆర్ఎస్ నుంచి మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ టికెట్ అడిగినా, ప్రస్తుత టర్మ్ సాయన్న కుటుంబానికే అవకాశం ఇస్తున్నట్టు కేసీఆర్ నచ్చజెప్పారు. నివేదిత గెలుపు బాధ్యతను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి అప్పగించారు.

మళ్లీ 'టీఆర్ఎస్'గా మారుద్దాం

- పార్టీ నేతల నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వినతులు, ఒత్తిళ్లు
- ఈనెల 27న పార్టీ పేరు మార్పుపై కేసీఆర్ కీలక ప్రకటన చేసే చాన్స్?

సాక్షి, హైదరాబాద్: జాతీయ రాజకీయాల్లో అడుగు పెట్టడం లక్ష్యంగా పేరు మార్చుకున్న భారత్ రాష్ట్ర సమితి పేరును తిరిగి పూర్వ రూపానికి మార్చాలని పార్టీ నేతలు, శ్రేణులు అధినేత కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలకే పరిమితమైన నాటి నుంచి పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా నామకరణం చేయాలని పార్టీ నేతలు కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న బీఆర్ఎస్ పేరు మార్పుపై కేసీఆర్ కీలక ప్రకటన చేసే అవకాశముందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఆర్ఎస్‌గా పేరు మార్చే అంశాన్ని పరిశీలించాలంటూ పార్టీ నేతలు కోరుతున్నా కేసీఆర్ విముఖత వ్యక్తం చేస్తూ వస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. అయితే టీఆర్ఎస్‌గా మారిస్తే పార్టీ కేడర్‌లో కొత్త ఊపు వస్తుందని కొందరు ముఖ్య నేతలు కేసీఆర్‌కు విన్నవించినట్లు సమాచారం.

ప్రజల గుండెలకు చేరువయ్యేలా...

తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీతో ప్రజలకు గాఢ అనుబంధం ఏర్పడిందని పార్టీ నేతలు కేసీఆర్‌కు తమ వాదన వినిపించారు. బీఆర్ఎస్‌గా పేరు మార్చడంతో ఉద్యమ కాలం నుంచి పార్టీ పట్ల అభిమానం ఉన్న కొన్ని వర్గాలు పార్టీకి దూరమైనట్లుగా కేసీఆర్‌కు వివరించాయి. దీంతో పార్టీ పేరును తిరిగి తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చడానికి అవసరమైన న్యాయ, చట్టపరమైన అంశాలపై అధ్యయనం చేయాల్సిందిగా కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు పార్టీ లీగల్ సెల్ ఓ నివేదిక అందజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ పేరు మార్పుపై మరింత లోతుగా మథింపు, నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారు. అయితే పార్టీ వర్గాలు మాత్రం ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీఆర్ఎస్‌గా పేరు మార్పుపై కీలక ప్రకటన చేస్తారని చెబుతున్నాయి.



హన్మంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు కేసీఆర్ పరామర్శ

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తండ్రి, సీనియర్ న్యాయవాది హన్మంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. 13వ రోజు కార్యక్రమంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్.. సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో జగిత్యాలకు చేరుకున్నారు. విరూపాక్షి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై హన్మంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భోజనం చేసిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఆయన వెంట హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి ఉన్నారు.

జూన్‌లో లోకల్ వార్

▶ మొదటి పేజీ తరువాయి

వారం నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి, ఒకే దఫాలో పూర్తిచేయాలని సీఎం రేవంత్ యోచిస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని, స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా పూర్తిచేయడం ద్వారా గ్రామ స్థాయిలోనూ రాజకీయంగా పట్టు సాధించడానికి, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇబ్బందులు ఉండవని కాంగ్రెస్ నేతలతో సీఎం పేర్కొన్నట్టు సమాచారం. మధ్యమధ్యలో ఎన్నికలు వస్తూ ఉంటే ఇబ్బందులు వస్తుంటాయని చెప్పినట్టు తెలిసింది. రేవంత్ ఇచ్చిన సంకేతాల ప్రకారం.. జూన్ చివరి వారంలో లేదా జూలై తొలివారంలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

పనితీరు ఆధారంగా చాన్స్

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీపరంగా చూపిన పనితీరు ప్రాతిపదికనే.. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ అభ్యర్థిత్వాలతోపాటు ఇందిరమ్మ కమిటీల్లో సభ్యుల నియామకం చేపడతామని పార్టీ నేతలతో సీఎం రేవంత్ పేర్కొన్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని.. ఇప్పటికే నామినేటెడ్ పదవుల నియామకాలు జరుగుతున్నాయని చెప్పినట్టు సమాచారం. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా స్థానిక నేతలకు ఎన్నికల్లో పోటీ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నట్టు తెలిసింది.

ముఖ్యమంత్రా.. చెడ్డీగ్యాంగ్ లీడరా?

రేవంత్‌రెడ్డివి దిగజారుడు మాటలు: ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం

పటాన్‌చెరుటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాటతీరు చూస్తుంటే ముఖ్యమంత్రా..? లేక చడ్డీగ్యాంగ్ లీడరా అనే అనుమానం కలుగుతోందని చెప్పారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో గణేశ్‌గడ్డ దేవస్థానం వద్ద ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారరథాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రైతుల దగ్గరకు వెళ్లి పరామర్శిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరితే.. 'చడ్డీ విప్పుతా.. డ్రాయర్ విప్పుతా' అని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని ఇదేం భాషో అర్థం కావడం లేదన్నారు. రేవంత్ భాషను ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఫేక్ వార్తలు, లీక్ వార్తలతో పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని, కానీ, ఆ ఆటలు సాగవని..మెదక్ గడ్డ బీఆర్ఎస్‌కు అడ్డా అని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

అనుచిత వ్యాఖ్యలు సహించం

చెడ్డీ గ్యాంగ్ అర్ధరాత్రి దొంగతనాలు చేస్తే బీఆర్ఎస్ పట్టపగలే దోచుకుంది: టీఆర్ఆర్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, తాట తీస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావును ప్రభుత్వ విప్ టి.రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సీఎంను చెడ్డీగ్యాంగ్ సభ్యుడని హరీశ్‌రావు వ్యాఖ్యానించడం సిగ్గుచేటని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు చరణ్‌కౌశిక్ యాదవ్, కమల్, లింగం యాదవ్, వెదిరె యోగేశ్వర్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడుతూ, పదేళ్లు తెలంగాణను దోచుకున్న కేసీఆర్ కుటుంబమే చెడ్డీ గ్యాంగ్ అని విమర్శించారు. చెడ్డీగ్యాంగ్ అర్ధరాత్రి సమయాల్లో ఇళ్లలో దొంగతనాలు చేస్తుందని, కానీ బీఆర్ఎస్ చెడ్డీ గ్యాంగ్ మాత్రం పట్టపగలే తెలంగాణను దోచుకుందని ఆరోపించారు. త్వరలోనే హరీశ్‌రావుతో పాటు కేసీఆర్ కుటుంబ సభ్యులందరి ఫామ్‌హౌస్ వ్యవహారాలు బయటకు వస్తాయని, మెదక్‌లో బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీలో కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా ఎలాంటి పొత్తు లేదని చెప్పారు. కానీ, పరిస్థితులకు అనుగుణంగా ఎంఐఎం తన స్టాండ్ మార్చుకుంటూ ఉంటుందని, ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని ఆ పార్టీ నిర్ణయించి ఉంటుందని చెప్పారు. ఎంఐఎం అభ్యర్థులు లేని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు ఆ పార్టీ మద్దతు ఇస్తే ఇవ్వొచ్చని టీఆర్ఆర్ వ్యాఖ్యానించారు.


కరువుకు పర్యాయపదం కాంగ్రెస్

బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్

సాక్షి, హైదరాబాద్: కరువుకు కాంగ్రెస్ పర్యాయపదమని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ఎద్దేవా చేశారు. 'మార్పు కోసం కాంగ్రెస్ అంటే.... ఆరు గ్యారంటీల మార్పు, కరెంటు కోతలు, కరువు, రైతుల ఆత్మహత్యలు, అధికారులకు బెదిరింపులు, ఎమ్మెల్యేలు పార్టీ మారడం'అని విమర్శించారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం, మిషన్ కాకతీయతో బోర్లు రీచార్జి అయ్యాయని బీఆర్ఎస్ గొప్పలు చెబితే, మిషన్ కాకతీయ, భగీరథ విఫలమయ్యాయని, కాళేశ్వరం కుంగిపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు చేస్తోందన్నారు. దీనికి సంబంధించి పూర్తి అవగాహన ఉన్నప్పుడు కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సర్కార్ ప్రత్యామ్నాయ చర్యలను ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

చంద్రబాబు మాదిరిగా వెన్నుపోటు పొడుస్తారని..

- అందుకే కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి అంటే భయపడుతున్నారు..
- రేవంత్‌ది బాబు స్కూలే కావడంతో కలవరపడుతున్నారు
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్లు ఆయన ఎప్పుడేం చేస్తారో తెలియని పరిస్థితి ఉంది..
- రేవంత్ కాంగ్రెస్‌లో కంఫర్టబుల్‌గా లేరు.. అభద్రతాభావంతో ఉన్నారు
- ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌తో చేతులు కలుపుతారు... లేదంటే 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సొంత దుకాణం పెట్టుకునేందుకు రెడీగా ఉన్నారు
- బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారబోతున్నాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్‌రెడ్డి కంఫర్టబుల్‌గా లేరని, నేతల తీరుతో అభద్రతా భావంతో ఉన్నారని, దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సొంత దుకాణం పెట్టుకోవటానికి రేవంత్ రెడీగా ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం సీటు కోసం కుట్ర జరుగుతోందని రేవంత్‌కు ఇంటెలిజెన్స్ నివేదికలు అందినట్లు తమకు తెలుస్తోందని మహేశ్వర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తనతో వచ్చే 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్‌తో చేతులు కలుపబోతున్నారని ఆరోపించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో మీడియాతో మహేశ్వరరెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ చంద్రబాబుకు సీఎం రేవంత్‌కు చాలా దగ్గర పోలికలున్నాయనీ, రేవంత్ కూడా బాబు స్కూలే కావడంతో కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారన్నారు. బాబు తన మామను వెన్నుపోటు పొడిచినట్టు రేవంత్ కూడా కాంగ్రెస్ కు ఎప్పుడేం చేస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు.


ప్లాన్ ఏ.. ప్లాన్ బీతో రేవంత్

లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు యత్నిస్తున్నారని స్వయంగా సీఎం రేవంత్ చెప్పడం చూస్తుంటే కాంగ్రెస్‌లో వెన్నుపోటు రాజకీయాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. రేవంత్ దగ్గరున్న రెండు ప్లాన్‌లలో...ప్లాన్ ఏలో తనతో పాటు ఎంత మంది వస్తారు అని, ప్లాన్ బీలో.. సొంత దుకాణం పెట్టుకుంటే.. ఎంతమంది వస్తారు అనే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే నాటికి ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉందన్నారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే బీఆర్ఎస్ లో 20 మంది ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి ప్రతిపక్ష నేతను మార్చాల్సిందిగా ఫిర్యాదు చేయించేందుకు కార్యాచరణను సిద్ధమైందన్నారు.

సీఎం పదవి కోసం అందరూ ఎదురు చూస్తున్నారు: సీఎం పదవి కోసం పది మంది కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రెండేళ్ల పదవి పూర్తయ్యాక దిగుతారా, ఏదైనా కేసులో ఇరుక్కుని పదవి నుంచి దిగిపోతారా అని అందరూ ఎదురుచూస్తున్నారన్నారు. కేబినెట్‌లో నంబర్ టు స్థానం తనదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భావించారని, అయితే ఆయన స్థానాన్ని దిగజార్చి సైడ్ చేసే కుట్ర కాంగ్రెస్‌లో జరుగుతోందన్నారు. ఇటీవల యాదాద్రిలో భట్టిని కింద కూర్చోపెట్టారని, తుక్కుగూడ సభ సమయంలో ఆయన డ్రైవర్ ను కొట్టారని దీంతో ఆయనకు ఇప్పుడు అర్థమైందన్నారు. భట్టి 9 శాతం బీ టాక్స్ అంటూ లీక్ చేస్తోంది కాంగ్రెస్ వాళ్లేనని చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి వారు సైతం పది మంది ఎమ్మెల్యేలతో తమ సొంత సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో 25 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పది మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెబుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో సైకిల్ కాంగ్రెస్, పింక్ కాంగ్రెస్, గాంధీ కాంగ్రెస్ అనే మూడు రకాలున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీకి 12 ఎంపీ సీట్లు వస్తే రాష్ట్రంలో ఇక అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ఉప ఎన్నికలంటూ వస్తే ప్రజలు బీజేపీ వైపే ఉంటారని చెప్పారు.

ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేరేందుకే కేటీఆర్ యాక్షన్

తాము చేసిన తప్పులకు జైలుకెళ్లే అవకాశం ఉండడంతో కేటీఆర్ పిచ్చిపట్టినట్టు మాట్లాడుతున్నారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. లిక్కర్ కేసులో తీహార్ జైల్లో ఉన్న చెల్లెలు.. అక్కడ ఎండలు మండుతున్నాయనీ కనీసం ఫ్యాన్ కూడా లేనందున అన్నను ఇక్కడ ఉండే ప్రయత్నం చేయమని చెప్పినట్లు తెలుస్తోందన్నారు. అందుకే కేటీఆర్ ఇక్కడే ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేరేందుకు పిచ్చి ఎక్కినట్టు నటిస్తున్నారని మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు.



నీకు ఏమీ తెలియదని తెలుసుకోవడంలోనే నిజమైన వివేకం దాగి వుంది.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 11 ఏప్రిల్ 2024

అమెరికా-చైనా చర్చలపర్వం

ఎడతెగని చర్చలు జరుగుతున్నాయంటే, అయినా కనుచూపుమేరలో పరిష్కారం కానరాలేదంటే... కనబడని కారణాలేవో అడ్డుపడుతున్నాయని అర్థం. సమస్య తీవ్రంగా ఉన్నదని తాత్పర్యం. ఈనెల ప్రారంభంనుంచి అమెరికా-చైనాలమధ్య భిన్న అంశాలపై చర్చోపచర్చలు సాగుతూనే వున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లు నేరుగా ఫోన్‌లో సంభాషించుకున్నారు. నాలుగు నెలలక్రితం తొలిసారి మాట్లాడుకున్న ఈ నేతలిద్దరూ మళ్లీ మాట్లాడుకోవాల్సిన పనిబడటం గమనించదగిందే. వారం తిరగకుండానే అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ ఎలెన్ చైనా సందర్శనకొచ్చి ప్రధాని లీ కియాంగ్‌తోపాటు చైనా ఉన్నత స్థాయి అధికారులను కలిసి మాట్లాడారు. అంతకుమునుపే ఇరు దేశాల ఉన్నతాధికారులు నాలుగు రోజులపాటు చర్చించుకున్నారు. త్వరలోనే అమెరికా విదేశాంగమంత్రి ఆంథోనీ బ్లింకెన్ చైనా వెళ్లబోతున్నారు. ఇలా సంభాషణల పరంపర కొనసాగుతున్నది గానీ పరిష్కారం కానరావటం లేదు. వీటికి సమాంతరంగా చైనాను కట్టడి చేసే ఇండో-పసిఫిక్ వ్యూహంలో భాగంగా 2021లో రూపుదిద్దుకున్న సైనిక సహకార సంస్థ 'ఆకస్' కార్యకలాపాలు చురుకందుకున్నాయి. ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్ రక్షణమంత్రులు ఇటీవల భేటీ అయ్యారు. ఇందులో మనదేశాన్ని కూడా చేర్చు కోవాలని అమెరికా తహతహలాడుతున్నా ఎలాంటి సైనిక ఒడంబడికల్లోనూ భాగం కారాదన్న విధానానికే ఇంతవరకూ మన దేశం కట్టుబడివుంది. మొదట్లో పెద్దగా ఆసక్తి చూపని జపాన్ మాత్రం చేరే అవకాశం ఉందంటున్నారు. అలాగని మన దేశం మౌనంగా ఏమీ లేదు. దక్షిణ చైనా సముద్రంలో చైనానుంచి తరచు బెదిరింపులు ఎదుర్కొంటున్న ఆగ్నేయాసియా దేశాలకు మద్దతుగా నిలుస్తామని చాటుతూనేవుంది. ఇటీవల చైనా గస్తీ నౌకలు చేసిన దాడుల్లో ఫిలిప్పీన్స్ వాణిజ్య నౌకలు రెండు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవలే ఆ దేశాన్ని సందర్శించి అండగా వుంటామని ప్రకటించారు. దక్షిణ చైనా సముద్రంలో 90 శాతం తన సొంతమని చైనా చెప్పుకుంటోంది. నిరంతర గస్తీ కాస్తోంది. సమస్యేమంటే ప్రపంచ సముద్ర ఉత్పత్తుల వాణిజ్యంలో 60 శాతం దక్షిణ చైనా సముద్రం వైపే సాగుతోంది.

అంతర్జాతీయంగా చైనాను కట్టడి చేయటమే అత్యవసరమని భావిస్తున్న అమెరికాకు రష్యా దూకుడు ఊహించని పరిణామం. రెండేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం ప్రారంభించాక దృష్టి అటువైపు మళ్లింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలందించటం ద్వారా రష్యాను దారికి తేవొచ్చని భావించిన అమెరికాకు నిరాశే ఎదురైంది. రష్యాపై విధించిన ఆర్థిక ఆంక్షలు సైతం ఆశించినంత ఫలితాన్నివ్వలేదు. రష్యాకు ఇరాన్ నుంచి డ్రోన్‌లు అందుతున్నాయి. ఎడాపెడా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవటం ద్వారా రష్యాకు చైనా అండగా నిలుస్తోంది. ఉత్తర కొరియా సైతం చైనా ద్వారా రష్యాకు సహాయసహకారాలందిస్తోందని అమెరికా భావిస్తోంది. ఇటు ఇజ్రాయెల్ దుందుడుకుతనంతో గాజా మండుతోంది. ఇజ్రాయెల్‌ను ఎలాగైనా దారికి తేవాలన్న బైడెన్ ఎత్తుగడలు ఫలించటం లేదు. కనుకనే దౌత్యరంగంలో వున్నంత దూకుడు రక్షణరంగంలో కనబడటం లేదన్నది బైడెన్‌పై వున్న ప్రధాన విమర్శ. ఈ ఏడాది చివర అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నందున ఈ విమర్శలు బైడెన్‌ను కలవరపెడుతున్నాయి. పర్యవసానంగా చైనాతో చర్చోప చర్చలు సాగుతున్నాయి. వాణిజ్యపరంగా అమెరికాకు మరో ప్రత్యేక సమస్య కూడా వుంది. అంతర్జాతీయ మార్కెట్‌లోకి అపరిమితంగా వచ్చిపడుతున్న చైనా ఎలక్ట్రిక్ కార్లు, సౌరశక్తి ప్యానెళ్లు, ఇతర ఉపకరణాలు అమెరికాకు తలనొప్పి తెస్తున్నాయి. వాటివల్ల అమెరికా ఉత్పత్తులు అమ్ముడుకావటం కష్టమవుతోంది. అమెరికా పరిశ్రమలు సంక్షోభంలో పడుతున్నాయి. ఈ నెల మొదట్లో జో బైడెన్, షి జిన్‌పింగ్ మధ్య ప్రధానంగా తైవాన్, దక్షిణ చైనా సముద్రం అంశాలపై చర్చలు నడిస్తే... చైనా తమ వాణిజ్య దూకుడుకు కళ్లెం వేయటంపై జానెట్ ఎలెన్ ప్రధాని లీ కియాంగ్‌తో చర్చించారు. దీన్ని ఆపకపోతే మరో మూడేళ్లలో అవసరానికి మించి ఏటా 50 లక్షల నుంచి కోటి ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌కొస్తాయన్నది అమెరికా అంచనా. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ తదితర అంశాల్లో తమ ఎదుగుదలను నిరోధించేలా అమెరికా వ్యవహరిస్తున్నదని చైనా ఆరోపణ. కనుకనే ఇరుదేశాల ఉన్నతాధికారులమధ్యా వరసగా నాలుగురోజులపాటు చర్చలు సాగినా... నేరుగా ఎలెన్, లీ కియాంగ్‌లు సంభాషించుకున్నా పరిష్కారం దొరకలేదు.

చిత్రమేమంటే అమెరికా, చైనాల మధ్య అనేక అంశాల్లో తీవ్ర విభేదాలున్నా వాణిజ్యపరంగా ఆ రెండు దేశాలూ పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పని స్థితి. అందుకే ఇండో-పసిఫిక్ అంశంలో దూకుడుగా వున్నట్టు కనిపిస్తున్నా వాణిజ్య సమస్యలపై ఏదోవిధంగా చైనాను దారికి తెచ్చుకోవాలని అమెరికా తాపత్రయపడుతోంది. ట్రంప్ హయాంలో చైనాపై విధించిన ఆంక్షల్లో చాలా భాగం బైడెన్ కొనసాగించారు. వీటికి మరిన్ని జోడిస్తానన్న బైడెన్ హెచ్చరికలు ఆచరణలోకి రాకపోయినా అవసరాన్నిబట్టి అప్పుడప్పుడు సడలింపు వైఖరితో ఉన్నామన్న సంకేతాలు రెండు దేశాలూ ఇస్తున్నాయి. ఎలాంటి సమస్యలకైనా ఓర్పుగా సాగించే సంభాషణలు పరిష్కారాన్ని చూపుతాయి. ఘర్షణల నివారణ ఎప్పుడూ మంచిదే. ఎందుకంటే ఘర్షణలవల్ల అంతిమంగా విధ్వంసం తప్ప మరేమీ మిగలదు. అయితే ఏ చర్చలైనా నిర్మాణాత్మకంగా వుండాలి. చిత్తశుద్ధితో సాగాలి. లేనట్టయితే నిష్ఫలమవుతాయి.

టీ కప్పులో తుపాను వివాదం

విశ్లేషణ



కేపీ నాయర్

తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా కచ్చతీవు వివాదం వార్తల్లో ఉంటుంది. పరిమిత రాజకీయ జీవితకాలం ఉన్న ఈ అంశాన్ని భారత్–శ్రీలంక ద్వైపాక్షిక సమస్యగా పొడిగించాలని కోరుకునేవారు గమనించాల్సింది, నాయకుల మధ్య వ్యక్తిగత సమీకరణాలు విధాన మార్గదర్శకాలుగా పనిచేశాయి. దానివల్ల వివాదాలు సామరస్యంగా పరిష్కారమయ్యాయి. కాబట్టి గత నిర్ణయాల పట్ల అర్థంలేని వివాదాలు ప్రయోజనం చేకూర్చవు. ఇంకా ముఖ్యంగా, 'వియన్నా కన్వెన్షన్ ప్రకారం భారతదేశం ఏకపక్షంగా (కచ్చతీవు) ఒప్పందాన్ని రద్దు చేయలేదు. దేశం ఎదుగుతున్న శక్తిగా తనను తాను ప్రకటించుకుంటున్నప్పుడు ఒడంబడిక రద్దు అనేది అంతర్జాతీయ రాజకీయాల్లో తన ప్రతిష్ఠను కోల్పోయేలా చేస్తుంది.'

ఒక వారం క్రితం భారత ఎన్నికల వేదికపై కచ్చతీవు వివాదం విరుచుకుపడినప్పుడు, 1994 జనవరిలో విదేశాంగ కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన జేఎన్ దీక్షిత్‌తో మూడు దశాబ్దాల క్రితం గడిపిన సాయంత్రాల వైపు నా మనస్సు మళ్లింది. కొలంబోలో ఉన్న సమయంలో 'వైస్రాయ్' నామకరణం పొందిన దీక్షిత్ 1985 నుండి 1989 వరకు భారత హైకమిషనర్‌గా, ఒక రకంగా మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఆయన సహచరులు చాలామంది, విదేశీ వ్యవహారాల రహస్యాలను తాము చనిపోయేంతవరకు దాచిపెడుతున్న సమయంలో, దౌత్యంపై జాతీయ మీడియాలో రాజకీయ కాలమ్‌ను ప్రారంభించిన మొదటి భారతీయ విదేశాంగ కార్యదర్శి జేఎన్ దీక్షిత్.

నేను దీక్షిత్‌తో గురుగావ్‌లో గడిపాను. శ్రీలంకలో తాను పనిచేసిన సంవత్సరాల గురించి ఆయన ఒక పుస్తకం రాయాలనుకున్నారు. ఆయన పదవీకాలం భారత్, శ్రీలంక సంబంధాలలో అక్షరాలా అత్యంత విస్ఫోటనా కాలం. ఇది జనావాసాలు లేని కచ్చతీవు ద్వీపంపై ప్రస్తుత టీకప్పులో తుపాను లాంటిది కాదు.

అవి ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలలో వేగవంతమైన హెచ్చుతగ్గులతో కూడి, శ్రీలంకలో ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ ఎదుర్కొంటున్న దురదృష్టకరమైన సంవత్సరాలు. విదేశీ సంబంధాలలో ఇటువంటి అస్థిరత చివరికి రెండేళ్ల వ్యవధిలోనే భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, అప్పటి శ్రీలంక అధ్యక్షుడు రణసింఘే ప్రేమదాస విషాద హత్యలకు దారితీసింది. దీక్షిత్‌కు జనాల కోసం రాయడం గురించి సందేహాలున్నాయి. రచయితగా మారే క్రమంలో నాలాంటి చాలామంది జర్నలిస్టులను ఆయన రప్పించుకున్నారు. 'అసైన్‌మెంట్ కొలంబో' శీర్షికతో శ్రీలంకపై రాస్తున్నానంటూ దీక్షిత్ వెల్లడించిన పుస్తకం పూర్తి కావడానికి నాలుగేళ్లు పట్టింది. అధికారిక రహస్యాల చట్టంలోని నిబంధనలలో చిక్కుకోకుండా ఉండేందుకు ఆయన దానిని జ్ఞాపకాల నుండి మాత్రమే రాయాలనుకున్నారు. ఈలోగా, అంతగా వివాదాస్పదం కాని మరో మూడు పుస్తకాలను ప్రచురించారు.

ఒక సాయంత్రం, శ్రీలంక సందర్శనకు విచ్చేసిన ఉన్నత స్థాయి భారతీయ ప్రతినిధి బృందానికి తాను ఏర్పాటు చేసిన రిసెప్షన్ గురించి ఆయన నాకు చెప్పారు. హైకమిషనర్ ప్రత్యేక అతిథిగా ప్రపంచంలోనే మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి సిరిమావో బండారునాయకే ఆ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఆ సమావేశానికి హాజరైన వారి మానసిక స్థితి ఉల్లాసంగా ఉంది. కొంచెం మత్తులో ఉన్న భారతీయ సందర్శకులలో ఒకరు, సిరిమావో బండారునాయకే అధికారంలో ఉన్నప్పుడు ద్వీపంలో అంతర్యుద్ధం చెలరేగి ఉండినట్లయితే, ఎల్టీటీఈ అగ్రనేత వేలుపిళ్లై ప్రభాకరన్ విషయంలో ఆమె ఏమి చేసి ఉండేవారంటూ చికాకు కలిగించే ప్రశ్నను అడిగారు. ఒక్క క్షణం కూడా సంకోచించకుండా, బండారునాయకే ఇలా తిప్పికొట్టారు: 'నేను న్యూఢిల్లీలో ఉన్న మా సోదరికి ఫోన్‌చేసి, ఈ ప్రభాకరన్ అనే వ్యక్తినీ, లంక తమిళ సమస్యకు అతని రకమైన పరిష్కారాన్నీ నేను క్రమబద్ధీకరించేటప్పుడు ఈ అంశంపై దృష్టిసారించకుండా వేరే వైపు చూడమని అడిగి ఉంటాను.' ఆ 'సోదరి' మరెవరో కాదు, ఇందిరా గాంధీ.



భారత ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే (ఫైల్ ఫొటో)

అనూహ్యంగా, శ్రీలంక జాతి కలహాల సమయంలో కొలంబోలో భారతదేశ మొదటి కార్యదర్శిగా ఉన్న నిరుపమారావు ఆ సమయంలో తన ప్రాణాలకు ముప్పు కలిగే స్థితిలో ఉన్నారు. ఏప్రిల్ 1న కచ్చతీవు వివాదం చెలరేగిన కొన్ని గంటల్లోనే తన ఎక్స్ (గతంలో ట్విట్టర్) అకౌంటులో నిరుపమ వ్యాఖ్యానిస్తూ, తనను 1983లో ఉన్నట్లుండి శ్రీలంక నుండి స్వదేశం పంపించి వేశారని రాశారు. '1974 ఒప్పందం ముగింపులో ఇందిరా గాంధీ, సిరిమావో బండారునాయకే మధ్య వ్యక్తిగత సమీకరణం నిర్ణయాత్మక పాత్ర పోషించింది' అని రాశారు. కచ్చతీవు చర్చల విషయంలో తనను రక్షించాల్సిందిగా ఇందిరకు బండారునాయకే వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశారనీ, లేకుంటే ఆమెకు రాజకీయంగా విపత్తు తప్పేది కాదనీ నిరుపమ చెప్పారు. దశాబ్దాల తర్వాత పూర్తిగా భిన్నమైన నేపథ్యంలో దీక్షిత్ దీన్నే చెప్పారు. తరువాత నిరుపమారావు 2004 నుండి 2006 వరకు కొలంబోలో హైకమిషనర్‌గా పనిచేశారు.

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ పార్థ ఘోష్ ఇలా రాశారు: 'బండారునాయకే దుఃస్థితిని ఇందిరా గాంధీ స్పష్టంగా గ్రహించారు. భారత ప్రతినిధి బృందం ప్రతిస్పందించకముందే పరిస్థితిని తారుమారు చేశారు. ఇందిర ప్రదర్శించిన ఈ ఔదార్యపు సంకేతాన్ని బండారునాయకే 1990 చివరిలో ఎంతో కృతజ్ఞతతో గుర్తు చేసుకున్నారు.' ఘోష్ ఆ సంవత్సరాన్ని 2000 అని పేర్కొని ఉండాలి, అంటే బండారునాయకే ప్రధానమంత్రిగా తన చివరి పదవీకాలం పూర్తయ్యే వరకు అన్నమాట. ఒక దశాబ్దం పాటు శ్రీలంక ఏకైక మహిళా అధ్యక్షురాలుగా ఉన్న ఆమె కుమార్తె చంద్రికా కుమారతుంగ కూడా భారత్ 1974లో ప్రదర్శించిన ఈ స్నేహపూర్వకమైన సంకేతాన్ని మరచిపోలేదు.

కొలంబోలో తనకంటే ముందే పనిచేసిన దీక్షిత్, నిరుపమా రావు కాలం నుండి కచ్చతీవు విషయంలో పెద్దగా మార్పు రాలేదనే వాస్తవాన్ని అమృత్‌సర్ నుండి బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తరణ్‌జిత్ సింగ్ సంధూ కూడా ధృవీకరించగలరు. సంధూ 2000 నుండి 2004 వరకు శ్రీలంకలో భారత రాయబార కార్యాలయంలో కౌన్సెలర్‌గానూ, హైకమిషనర్‌గానూ పనిచేశారు.

2017లో సంధు భారత హైకమిషన్ లో బాధ్యతలు స్వీకరించినప్పుడు, శ్రీలంక బీజింగ్ అందాలకు పడిపోయింది. భారత ప్రభావ పరిధిలో ఉండటం మానేసింది. అధ్యక్షుడిగా మహింద రాజపక్స చైనా అనుకూల విధానాలను కలిగి ఉన్నప్పటికీ, తరణ్‌జీత్ సింగ్ సంధూ, ప్రతిపక్ష నాయకుడిగా రాజపక్సను ఒకసారి కాదు రెండుసార్లు భారత్‌ను సందర్శించేలా చేసే ఆహ్వానం కోసం పట్టుబట్టారు. ఆ రెండు సార్లలో మొదటి సందర్శన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, మహింద రాజపక్స మధ్య ఏర్పడిన బంధం... శ్రీలంక కీలకమైన రాజకీయవేత్తను భారత మద్దతుదారుగా మార్చింది. రెండేళ్ల తర్వాత, మహింద ప్రధాని అయినప్పుడు, భారత్ లెక్కించినట్లుగానే, ఆయన తొలి బాహ్య సదస్సు మోదీతోనే వర్చువల్‌గా జరిగింది. మహింద సోదరుడు గొటబయ రాజపక్స అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తన మొదటి పర్యటన కోసం భారత్‌నే ఎంచుకున్నారు.

ఏప్రిల్ 19న తమిళనాడులో ఓటింగ్ జరిగేదాకా పరిమిత రాజకీయ జీవితకాలమే ఉన్నప్పటికీ, కచ్చతీవు వివాదాన్ని ద్వైపాక్షిక సమస్యగా పొడిగించాలని కోరుకునే వారందరూ నేర్చుకోవలసిన ఒక పాఠం ఉంది. రాజపక్స కుటుంబం రాజకీయ అరణ్యంలో ఉన్నప్పటికీ భారత్–శ్రీలంక సంబంధాలు ఇప్పుడు అద్భుతంగా ఉన్నాయి. ప్రస్తుత శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే కంటే మెరుగైన మిత్రుడు భారత్‌కు దొరకరు. ప్రస్తుత ప్రధాని దినేశ్ గుణవర్ధన విషయంలోనూ ఇది నిజం. యూఎస్‌లో తన క్లాస్‌మేట్ అయిన జయప్రకాశ్ నారాయణ్ ప్రభావంతో భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు దినేశ్ తండ్రి ఫిలిప్ గుణవర్ధనను బ్రిటిష్‌వాళ్లు బొంబాయిలో బంధించారని కొద్దిమంది భారతీయులకే తెలుసు.

విదేశాంగ కార్యదర్శిగానూ పనిచేసిన నిరుపమారావు ప్రకారం, 'వియన్నా కన్వెన్షన్ ప్రకారం భారతదేశం ఏకపక్షంగా (కచ్చతీవు) ఒప్పందాన్ని రద్దు చేయలేదు. దేశం ఎదుగుతున్న శక్తిగా తనను తాను ప్రకటించుకుంటున్నప్పుడు ఒడంబడిక రద్దు అనేది అంతర్జాతీయ రాజకీయాల్లో తన ప్రతిష్ఠను కోల్పోయేలా చేస్తుంది.'

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శుభాకాంక్షలు



అందరికీ అస్సలామ్ అలైకుమ్. మా కుటుంబం నుంచి మీ కుటుంబానికి ఈద్ ముబారక్! సంపద, శాంతి, ఆశీర్వాదాలు మీ ఇంట్లో సమృద్ధిగా ఉండాలి. నిన్నంతా అమ్మతో వంటలు చేస్తూనే గడిపాను. తజిక్ సంబూసా, ఓర్మక్, చాగల్‌దాక్, ఇంకా కుకీలు చేశాం.

– నిగోరా ఫజ్లుద్దీన్, తజికిస్తాన్ ఫిలింమేకర్

వారికే సరి



పాశ్చాత్య సంస్కృతి, అబ్రహామిక్ ఆలోచనా మార్గం ప్రభావాలతో పెరిగిన విదేశీ సిక్కు పిల్లలకు సనాతన జీవన విధానంతో పూర్తిగా సంబంధం తెగిపోయింది. కాబట్టే, ఖలిస్తాన్ భావజాలం వారికి సరిగ్గా సరిపోతోంది. నా అంచనాలో, విదేశాల్లోని సిక్కులు ఈ ఖలిస్తాన్ వాదాన్ని చాలా చాలా కాలం మోస్తూనే ఉంటారు.

– అర్శదీప్ సింగ్, జాతీయవాది

శిక్ష పడాల్సిందే!



సిరియాలోని ఇరానియన్ దౌత్య కార్యాలయం మీద జియోనిస్టు ప్రభుత్వం (ఇజ్రాయెల్) ఎప్పుడైతే దాడి చేసిందో, అది ఇరాన్ నేల మీద దాడి చేసినట్టే. ద్వేషపూరిత ప్రభుత్వం తప్పుడు ఎత్తు వేసింది. దానికి శిక్ష పడాలి, శిక్ష పడుతుంది.

– అలీ ఖొమేనీ, ఇరాన్ సుప్రీం లీడర్

రుణపడ్డాం!



జొరాస్ట్రియన్ పెర్షియన్లు (పార్శీలు) గ్రేటర్ ఇరాన్ నుంచి 8, 10 శతాబ్దాల మధ్య భారత ఉపఖండానికి వలస వస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు, స్థానిక హిందూ రాజు జైదీ రాణా ఆశ్రయం ఇవ్వడంతో ప్రస్తుత గుజరాత్‌లో స్థిరపడ్డారు. మా పూర్తి విధేయత, ప్రేమ, జీవితాలను ఇండియాకు రుణపడి ఉన్నాం.

– అర్నాజ్ హాథీరామ్, యాక్టివిస్ట్

తేలిన గెలుపు




ఈ పోస్టు పెట్టినందుకు నన్ను చంపొద్దు... కానీ టీవీ ఛానళ్లు అదేపనిగా 'ఇండియా నిర్ణయిస్తుంది' అని హెడ్‌లైన్లు పెడుతున్నాయి. నేను గమనిస్తున్నంతవరకూ ఇండియా ఇప్పటికే నిర్ణయించేసుకుంది.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ఇన్ బాక్స్

బడుగుల ఆశాజ్యోతి

గాంధీజీని 'మహాత్మ' అని భారతీయులు గౌరవించడానికి వందేళ్ళ ముందే... బడుగు బలహీన వర్గాలచే 'మహాత్ముడి'గా జన నీరాజనాలు అందుకున్న సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు జ్యోతిరావ్ గోవింద్ రావు పూలే. వారి తండ్రి గోవిందరావు మొదట్లో కూరగాయలు అమ్మేవారు. కాలక్రమేణా పీష్వా పరిపాలనా కాలంలో పూల వ్యాపారం చేయడంవల్ల వారి ఇంటి పేరు పూలేగా మార్పు చెందింది.



జ్యోతిబా పూలే

సంవత్సరం వయస్సులోపే తల్లిని కోల్పోయారు. అనేక ఇబ్బందులతో విద్యాభ్యాసం పూర్తి చేశారు. థామస్ పైన్ రచించిన 'మానవ హక్కులు' పుస్తకం ఆయన ఆలోచనలను ప్రభావితం చేసింది. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించి ముందు తన భార్య సావిత్రి బాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అంతేగాక అన్నికులాలవారు చదువుకునేలా పాఠశాలలను స్థాపించి, విద్యాభివృద్ధికి కృషి చేశారు. దేశంలోనే మొదటిసారిగా 'బాలహత్య ప్రతిబంధక్ గృహ' కేంద్రాన్ని స్థాపించి, వితంతు గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. 1848లో జరిగిన తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో పూలే కులవివక్షకు గురయ్యారు. ఆ క్షణం నుండి కుల వివక్షపై పోరాటం మొదలు పెట్టి సత్యాన్ని నిగ్గుతేల్చారు. కుల విధానంలో ఆయన బ్రాహ్మణులను విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు.

స్త్రీ-పురుష లింగ వివక్ష, కుల బానిసత్వాలపై అలుపెరుగని పోరాటం చేశారు. సామాజిక రుగ్మతల్ని నిర్మూలించడానికి 'గులాంగిరి', 'పూణే సత్య సోధక సమాజ నివేదిక', 'తృతీయ రత్న', 'ఛత్రపతి శివాజీ' వంటి రచనలు చేశారు. వితంతు మహిళలు, అనాథ శిశువుల కోసం 'సేవాసదనం' స్థాపించారు. భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికులు పూలే. రైతుల, కార్మికుల సమస్యలు బాధలు వివరించేందుకు 'దీనబంధు' వారపత్రికను స్థాపించారు.

సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా॥ బీఆర్ అంబేడ్కర్ ప్రకటించారు. సమసమాజ స్థాపనకై అనునిత్యం శ్రమించిన జ్యోతిబా పూలే 1890 నవంబర్ 28న కన్నుమూశారు. బహుజనుల స్వాతంత్ర్యానికై సమరం సలిపిన ఆ మహనీయుడి జన్మదినాన వారిని స్మరించుకుందాం.

– డా॥ కమలేకర్ నాగేశ్వర్ రావు; అచ్చంపేట, నాగర్ కర్నూల్ జిల్లా
(నేడు జ్యోతిబా పూలే జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఫోన్ ట్యాపింగ్‌పై చట్టం ఏం చెబుతోంది?

అభిప్రాయం



మన్నారం నాగరాజు

రాష్ట్రంలో సంచలనం రేపిన ఎస్ఐబీ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్న నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ ఎప్పుడు మొదలయ్యింది? ఎలా మొదలయ్యింది? అనే అంశంపై సర్వత్రా చర్చ మొదలయ్యింది. దేశంలో ఫోన్ ట్యాపింగ్ అనేది బ్రిటిష్ కాలం నుంచే అమల్లో వుండగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా దీనిని పరిమితంగా అమలు చేయసాగారు. ఇక ఉమ్మడి ఏపీ విషయానికి వస్తే 1980 దశకంలో మావోయిస్టు కార్యకలాపాలు ఎక్కువగా సాగుతున్న వేళ అనంతర కాలంలో ఏర్పాటైన గ్రే హౌండ్స్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) విభాగాలకు తోడుగా ఉండేందుకు ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌ను ఎస్ఐబీకి అనుబంధంగా ఏర్పాటు చేశారు. మొదట్లో చిన్నపాటి యూనిట్‌గా ఉన్న ఈ విభాగం 1990 దశకంలో పటిష్ఠమై వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యాక మరింత ఆధునికీకరించబడి నక్సలిజం ఏరివేతకు, అసాంఘిక కార్యకలాపాలను అణచివేసేందుకు తనవంతు సహాయాన్ని అందించింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఫోన్ ట్యాపింగ్ యూనిట్ గడచిన కొన్నేళ్లుగా పాలకుల ఇష్టానుసార చర్యలు, పోలీసు బాస్ దుందుడుకు వ్యవహారాల కారణంగా పూర్తిగా భ్రష్టుపట్టిపోయింది.

ఇజ్రాయెల్ దేశం నుంచి కేంద్రం పెగసస్ అనే టెక్నాలజీని వాడుతూ ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేస్తుందని కొన్నేళ్ల క్రితం పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు సాగించిన ఆందోళన దేశ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. రాష్ట్రంలో నెల రోజులుగా కొనసాగుతున్న ఎస్ఐబీ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమూ మరింత ముదురుతోంది.

మావోయిస్టులతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు, దేశ ద్రోహులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయాల్సి ఉంది. దీనిపై ఆ యా జిల్లాల ఎస్పీలు లేదా ఆస్థాయి అధికారులు ఎవరి ఫోన్లయితే ట్యాపింగ్ చేయాలో వారి నంబర్లను తెలుపుతూ డీఐజీ ద్వారా డీజీపీకి లేఖ రాయాల్సి వుంది. ఆ తరువాత దీనిని పూర్తిగా పరిశీలించి, ఇదంతా నిజమని నిర్ధారణ అయిన తరువాత డీజీపీ ఈ నంబర్లను హోం శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలపాల్సి వుంటుంది. అనంతరం దీనిపై హోం శాఖ ముఖ్య కార్యదర్శి హోం మంత్రికి సమాచారం ఇచ్చి ఆయన అనుమతితో బీఎస్ఎన్ఎల్ అయితే టెలికాం శాఖ స్థానిక జనరల్ మేనేజర్‌కూ, ప్రైవేటు కంపెనీలు అయితే వాటి సర్వీస్ ప్రొవైడర్ల అధికారుకూ లేఖ రాయాల్సి ఉంటుంది. తరువాత ఈ లేఖను పరిశీలించిన టెలికాం లేదా ప్రైవేటు కంపెనీలు ఫోన్ ట్యాపింగ్ విషయాన్ని తమ పై అధికారులకు అధికారికంగా సమాచారం ఇచ్చి ట్యాపింగ్ చేయడానికి పరికరాలను సమకూరుస్తారు. టెలిగ్రాఫ్ చట్టంలో ట్యాపింగ్ విషయంలో పేర్కొన్న విధి విధానాలు ఇవి. వీటిని ఎవరూ ఉల్లంఘించేందుకు వీల్లేదు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన కొంత కాలం వరకు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి టెలిగ్రాఫ్ చట్టం సక్రమంగానే అమలయ్యిందని అధికారులు చెబుతున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, జాతీయ దర్యాప్తు సంస్థ, రా (ఆర్ఏడబ్ల్యూ), డైరెక్టరేట్ ఆఫ్ సిగ్నల్ ఇంటెలిజెన్స్, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌లకు మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేసే అధికారం ఉంది. ట్యాపింగ్‌కు సంబంధిత అధికారి తప్పనిసరిగా రాతపూర్వకంగా ట్యాప్ చేయడానికి కారణాలను నమోదు చేయాలి.



టెలిఫోన్ ట్యాపింగ్ అనేది ఒక వ్యక్తి గోప్యతపై తీవ్రమైన దాడిగా పరిగణించవచ్చు. తగిన రక్షణలు లేకుండా, చట్టపరమైన ప్రక్రియను అనుసరించకుండా ఫోన్ ట్యాపింగ్ చేయడం వ్యక్తిగత గోప్యత యొక్క ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. గోప్యత హక్కు రాజ్యాంగంలోని 19(1), 21 అధికరణల ప్రకారం రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కు. నేరాలకు పాల్పడితే ఎంతటి పెద్దవారు అయినా తప్పించుకోలేరనే పరిస్థితి నెలకొల్పాలి. అటు డబ్బు కానీ, ఇటు పలుకుబడి కానీ తమను రక్షించలేవనే భయం నేరస్థుల్లో కలిగిన నాడు ఈ అరాచకాలు తగ్గుముఖం పడతాయే తప్ప మాటలతో కాదనే సత్యాన్ని పాలక పెద్దలు ఎంత తొందరగా గ్రహిస్తే అంత మంచిది.

వ్యాసకర్త తెలంగాణ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు । 95508 44433

మానవ హితమే ఆశయం

సమాజంలో అందరూ ఒకేలా ఉండరు. ఒకే చేతికున్న ఐదు వేళ్ళూ సమానంగా లేనట్లే, మానవ జాతికి చెందిన మనుషులంతా ఒకేలా ఉండరు. కొందరు సంపన్నులు, కొందరు నిరుపేదలు, కొందరు దాతృస్వభావులు, కొందరు పిసినారులు, కొందరు బుద్ధిమంతులు, కొందరు బుద్ధిహీనులు ఉంటారు. ఇదేవిధంగా కొందరు సమ ఉజ్జీలు కూడా ఉంటారు. అందరినీ దేవుడు పరీక్షిస్తున్నాడు. ఎవరికి ఏ స్థితి ప్రాప్తమైనా, వారు అదే స్థితిలో పరీక్షించ బడుతున్నారు. ఇదేవిధంగా దైవం వారికి బాధ్యతలు కూడా పంచాడు. విధులనూ నిర్ణయించాడు. అందులో భాగంగానే సదఖ, ఫిత్రా, ఖైరాత్, జకాత్ లాంటి వివిధ రూపాల్లో సమాజంలోని పేదసాదల చేయూతకు ఏర్పాట్లు చేశాడు.



సమాజంలో అందరూ నిండు సంతోషంతో జీవితం గడపాలంటే, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి. దానికో క్రమబద్ధమైన నియమం, నిబంధనావళి ఉండాలి. అందుకే దైవం సంవత్సరానికొకసారి ఒక నెలరోజుల పాటు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశాడు. రమజాన్ నెల రోజులూ మనిషి పగలంతా ఉపవాసం పాటిస్తాడు. దీనివల్ల ఆకలిదప్పుల బాధ ఎలా ఉంటుందో తెలుస్తుంది. ఫలితంగా ఒక్కపూట అన్నానికి సైతం నోచుకోని అసంఖ్యాక నిరుపేదల పట్ల మనసులో సానుభూతి భావాలు వికసిస్తాయి. ఏదో ఒకరూపంలో అలాంటి వారిని ఆదుకోవాలన్న బలమైన ఆలోచన మనసులో జనిస్తుంది. రమజాన్ నెలలో స్వీయ సంస్కరణతోపాటు, సమాజ సంస్కరణ, మానవ హితం కోసం కొన్ని నియమాలు నిర్దేశించబడ్డాయి. రోజా, తరావీహ్, ఫిత్రా, జకాత్ తదితర నియమాలు అందులో భాగమే. రమజాన్ నెల చివరి రోజుల్లో, పండుగ నమాజుకు ముందు కుటుంబ సభ్యులందరి తరఫున ఒక నిర్ణీత కొలతలో ధాన్యంగాని, రొక్కంగాని చెల్లించడాన్ని 'ఫిత్రా' అని అంటారు. సంవత్సరానికొకసారి తమ నిల్వ ఆదాయంలో నుండి నూటికి రెండున్నర శాతం చొప్పున తీసి పేదసాదల కోసం ఖర్చు చేయడాన్ని 'జకాత్' అంటారు. సమాజంలో అందరూ సుఖసంతోషాలతో జీవితం గడపాలన్నది ఈ ఫిత్రా, జకాత్, సదఖ, ఖైరాత్ తదితర దానాల అసలు ఉద్దేశ్యం. నెలరోజులపాటు పొందిన శిక్షణ పండుగ తరువాతి జీవితంలోనూ కొనసాగాలి. అందుకని దేవుడు మనకు కల్పించిన అవకాశాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటూ, సమాజంలోని సాటి మానవ సమూహం పట్ల, ముఖ్యంగా పేదసాదలు, బడుగు బలహీన వర్గాల పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అదే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినం మనకిస్తున్న సందేశం.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్
(నేడు ఈదుల్ ఫిత్ర్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.తదియ సా.6.31 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** భరణి ఉ.6.05 వరకు, తదుపరి కృత్తిక తె.5.16 వరకు (తెల్లవారితే శుక్రవారం), **వర్జ్యం:** సా.5.40 నుండి 7.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.52 నుండి 3.42 వరకు, **అమృత ఘడియలు:** రా.2.55 నుండి 4.28 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర

● ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర (ప్రెజర్ బాంబు) పేలడంతో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి పిడియా గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో బుధవారం పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. మావోలు అమర్చిన ప్రెజర్ బాంబును గమనించకుండా జవాన్లు తొక్కడంతో అది పేలింది. ఈ ఘటనలో శివలాల్ మడకం, మితిలేశ్‌కు తీవ్ర గాయాలు కాగా బీజాపూర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు.

ఎఫ్‌బీఓపై పోడు రైతుల దాడి


చేతిపై గాయంతో ఎఫ్‌బీఓ వెంకన్న

ములకలపల్లి: అటవీ శాఖ అధికారిపై మరోసారి పోడు సాగుదారులు దాడికి పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్ కథనం మేరకు.. మండలంలోని కొత్త గుండాల పాడు (వెస్ట్) ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) భూక్యా వెంకన్న 370 కంపార్ట్‌మెంట్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి కోసం కుంట నిర్మాణ పనులు చేయిస్తున్నారు. జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో పనులు చేస్తుండగా, బుధవారం చలమన్ననగర్ గ్రామానికి చెందిన వలస ఆదివాసీలైన తండ్రీకొడుకులు సోడె కన్నయ్య, సురేశ్, మరో 10 మంది వచ్చి పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ పోడుభూముల్లో కుంట నిర్మించొద్దని వాదనకు దిగారు. కర్రలతో దాడికి యత్నించగా వెంకన్న చేతులు అడ్డుపెట్టారు. దీంతో చేతికి గాయాలయ్యాయి. వీపుపైనా వాతలు పడ్డాయి. అక్కడి నుంచి తప్పించుకున్న వెంకన్న ఫోన్‌లో ఉన్నతాధికారులకు సమాచారం అందించి, పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎఫ్‌బీఓ వెంకన్న ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

● జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిభా పూలే జయంతిని పురస్కరించుకుని గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ఉత్సవాలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సంఘసంస్కర్తగా బడుగుల జీవితాల్లో అక్షరాలతో వెలుగులు నింపిన పూలే 198వ జయంతి సందర్భంగా బీసీ సమాజానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి ఉత్సవాలను ఖైరతాబాద్‌లో ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారని, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మాదిగ ద్రోహి రేవంత్: వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్ (హైదరాబాద్): రాష్ట్ర ఎస్సీ జనాభాలో 75 శాతం ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కూడా ఇవ్వని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ద్రోహిగా మారారని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీలోపు మాదిగలకు ఒక ఎంపీ టికెట్ ప్రకటించకపోతే 16వ తేదీ నుంచి ఆ పార్టీ కార్యాలయాల ముందు చావుడప్పు మోగిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా వరంగల్ పార్లమెంటు టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ మార్చాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరికి మాదిగల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, ముందు కడి యం తన కులంపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీహరి కూతురు ఆంధ్రకు చెందిన ఒక ముస్లిం వ్యక్తిని వారి మత సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకుందని, ఆమె మాదిగ కాదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ తప్పు చేస్తోంది: మోత్కుపల్లి



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ మాదిగల పట్ల చిన్న చూపు చూస్తున్నారని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా మాదిగలకు టికెట్లు ఇవ్వకుండా తప్పు చేస్తోందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి కూడా బరువెక్కిన హృదయంతో ఇలా మాట్లాడాల్సి వస్తోందని ఆయన అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో తన మాది గ కులానికి జరుగుతున్న అన్యాయం కలచివేస్తోందని విచారం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇవ్వకపోవడం చారిత్రక తప్పిదమని, ఈ పాపాన్ని పార్టీలో ఎవరు మూటగట్టుకోవాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని అన్నారు.

9 ఏళ్లలో 75 కాలేజీలు మూత!

తీవ్ర ప్రతికూలతలు ఎదుర్కొంటున్న ఇంజనీరింగ్ కాలేజీలు ● 2014లో 234... ఇప్పుడు 159 మాత్రమే
జిల్లాల్లో అరకొరగా విద్యార్థుల ప్రవేశాలు ● నిశిత పరిశీలనకు ప్రత్యేక కమిటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతోంది. జిల్లాల్లోని కాలేజీల్లో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపకపోవడంతో మూతపడుతున్నాయి. కొన్ని రాజధాని పరిసర ప్రాంతాలకు మారుతున్నాయి. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో ఈ ఏడాది ఎన్ని కాలేజీలు ఉంటాయనేది అధికార వర్గాలే స్పష్టత ఇవ్వడం లేదు. కనీస స్థాయి విద్యార్థుల ప్రవేశాలు లేని కాలేజీలు కౌన్సెలింగ్‌లో నిలబడటం కష్టమనే వాదన వినిపిస్తోంది. ప్రతి ప్రైవేటు కాలేజీకి సంబంధిత విశ్వవిద్యాలయాలు అనుబంధ గుర్తింపు ఇవ్వాలి. ఈ సంవత్సరం ఈ ప్రక్రియ ఇంతవరకూ మొదలవ్వలేదు. ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ద్వారా కాలేజీల తనిఖీలు చేపట్టాలనే యోచనలో ఉంది. దీంతో యూనివర్సిటీలు అఫ్లియేషన్ విధానాన్ని మొదలు పెట్టలేదు. మరోవైపు ఎక్కువ కాలేజీలు డిమాండ్ లేని బ్రాంచీల్లో సెక్షన్లు, సీట్ల తగ్గింపునకు దరఖాస్తు చేసుకున్నాయి. మౌలిక సదుపాయాలు అన్నీ ఉంటేనే గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అసలు ఈ సంవత్సరం రాష్ట్రంలో ఎన్ని ఇంజనీరింగ్ కాలేజీలు, ఎన్ని సీట్లు ఉంటాయనేది ఇప్పటివరకు స్పష్టత కరువైంది.

సంవత్సరం	కాలేజీల సంఖ్య
2014	234
2015	248
2016	210
2017	201
2018	190
2019	183
2020	181
2021	175
2022	168
2023	159



ఏటా తగ్గుతున్న కాలేజీలు...

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కాలేజీలు మినహా, జిల్లాల్లోని కాలేజీలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. దీంతో అనివార్యంగా మూతపడే పరిస్థితి కన్పిస్తోంది. 2014లో రాష్ట్రంలో 234 ఇంజనీరింగ్ కాలేజీలుంటే, 2023 కౌన్సెలింగ్ నాటికి ఈ సంఖ్య 159కి పడిపోయింది. తొమ్మిదేళ్ల కాలంలోనే దాదాపు 75 ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి. 2017 నుంచి కాలేజీలు కనుమరుగవ్వడం ఎక్కువైంది. నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో కంప్యూటర్ సైన్స్ సీట్లల్లో తప్ప, ఇతర బ్రాంచీల్లో పది మంది కూడా చేరే పరిస్థితి కనిపించడం లేదు. పలు జిల్లాలకు చెందిన కాలేజీ యాజమాన్యాలు దాదాపు 15 కాలేజీలను హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మార్చుకునేందుకు దరఖాస్తులు పెట్టాయి. మరో పది కాలేజీలు ఈసారి అఫ్లియేషన్ నిబంధనలకు దూరంగా ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థుల విముఖతే సమస్య..

జిల్లాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడటం లేదు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులపైనే ఆసక్తి చూపుతున్నారు. ఈ సీట్లను పెంచుకునేందుకు జిల్లా కాలేజీలకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవడం, డిమాండ్ ఉన్న కోర్సుల్లో అధ్యాపకుల కొరత సమస్య కాలేజీలను వేధిస్తోంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు రాజధాని పరిసర ప్రాంతాల్లో ఉన్న డిమాండ్ జిల్లాల్లో ఉండటం లేదు. ఈ కారణంగా కాలేజీల నిర్వహణ అతికష్టంగా ఉందని యాజమాన్యాలు అంటున్నాయి. దీనికి తోడు విద్యార్థులు కూడా ఇంజనీరింగ్ తర్వాత తక్షణ ఉపాధి కోరుకుంటున్నారు.

ఆలోచనల్లో మార్పు



విద్యార్థులు ఎక్కువగా కంప్యూటర్ కోర్సులను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం వీటికే మార్కెట్ ఉందని భావిస్తున్నారు. దీంతోపాటు హైదరాబాద్‌లో ఉంటే ఇంజనీరింగ్ తర్వాత ఉద్యోగాలు తెచ్చుకోవడం సులభమనే ఆలోచనలతో ఉన్నారు. ఈ పరిణామాలు గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కాలేజీల నిర్వహణను కష్టంగా మారుస్తున్నాయి. అన్ని బ్రాంచీల్లోనూ సరికొత్త సాంకేతిక బోధన విధానం తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.
–ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్యా మండలి చైర్మన్)

20 వరకు టెట్ దరఖాస్తు గడువు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్ టెట్)కు దరఖాస్తు గడువును పొడిగించారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఎడిట్ ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వాస్తవానికి టెట్ దరఖాస్తుల గడువు బుధవారంతో ముగిసింది. ఇప్పటి వరకు మొత్తం 2,33,243 దరఖాస్తులు అందాయి. పేపర్–1కు 85,625, పేపర్–2కు 1,47,618 దరఖాస్తులు వచ్చాయి. పదోన్నతుల కోసం సర్వీస్ టీచర్లు కూడా టెట్ రాయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే, ప్రైమరీ హెచ్ఎంకు ఎస్జీటీలను తీసుకునేప్పుడు, హైస్కూల్ హెచ్ఎంకు స్కూల్ అసిస్టెంట్లను తీసుకునేటప్పుడు టెట్‌తో పనేంటని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరాయి. ఈ నేపథ్యంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్‌కు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వివరణ ఇవ్వా లని లేఖరాశారు. సమాధానం వచ్చిన తర్వాతే సర్వీస్ టీచర్లు టెట్‌కు దరఖాస్తు చేసుకునే వాతావరణం కన్పించింది. ఈ కారణంగా టెట్ దరఖాస్తు గడువును పొడిగించారు. టెట్ పరీక్ష తేదీల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయడం లేదు. మే 20 నుంచి జూన్ 3 వరకు పరీక్ష జరుగుతుంది.

కొత్తగా బయో మెడికల్ కోర్సు

● ఈ ఏడాది నుంచే అందుబాటులోకి
● అటానమస్ కాలేజీల్లో మొదటిసారిగా..
● కార్పొరేట్ వైద్యరంగ్ల డిమాండ్‌కు తగ్గట్టుగా బోధన

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో కొత్తగా బీఎస్సీ బయో మెడికల్ కోర్సు ఈ విద్యా సంవత్సరం (2024–25) నుంచే అందుబాటులోకి రానుంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి దీనికి సంబంధించిన కసరత్తు చేస్తోంది. తొలిసారిగా ప్రవేశపెట్టబోయే ఈ కోర్సు బోధన ప్రణాళిక, క్లాసుల నిర్వహణ, కార్పొరేట్ ఆస్పత్రుల భాగస్వామ్యంపై ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలుగా చర్చించారు. ముందుగా ప్రయోగాత్మకంగా స్వయంప్రతిపత్తి గల యూనివర్సిటీల పరిధిలో (అటానమస్) దీనిని అందుబాటులోకి తేనున్నారు. 150 సీట్లు మాత్రమే తొలిఏడాది భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ దశలో ఎదురయ్యే సవాళ్లు గుర్తించి, అవసరమైతే మార్పులుచేర్పులతో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఈ కోర్సును అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. శరవేగంగా విస్తరిస్తున్న కార్పొరేట్ వైద్యరంగంలో బయో మెడికల్ సేవలకు మంచి డిమాండ్ ఉందని గుర్తించారు. వివిధరకాల లేబొరేటరీలు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సాంకేతిక వైద్య సేవల్లో మంచి ఉపాధి అవకాశాలున్నాయి. డిమాండ్ తగ్గట్టుగా నిపుణుల కొరత ఉంది. దీనిని భర్తీ చేయడానికి డిగ్రీ స్థాయిలోనే బయో మెడికల్ సబ్జెక్టును తీసుకురానున్నారు. సిరాలజీ, బయాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, డీఎస్‌ఏ, ఫిజియోథెరపీ సహా వైద్య సంబంధమైన అనేక సబ్జెక్టులతో ప్రణాళిక రూపొందించే యోచనలో ఉన్నారు. ఈ కోర్సును ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు కూడా అనుబంధ కోర్సుగా చేసే అవకాశం కల్పించాలని ఆలోచనలో ఉన్నట్టు మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. దీంతోపాటు బీకాం ఫైనాన్స్, బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్సూరెన్స్ వంటి కోర్సులను ఈ ఏడాది పరిచయం చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో ఉన్నా.. ఆదుకోండి

● పద్మశ్రీ సకిని రామచంద్రయ్య వేడుకోలు
● మంత్రి సీతక్కతో గోడు వెళ్లబోసుకున్న కళాకారుడు


మంత్రి సీతక్కకు తన ఆవేదన వివరిస్తున్న రామచంద్రయ్య

మణుగూరు టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న తనకు చికిత్స చేయించుకునేందుకు నగదు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నానని పద్మశ్రీ సకిని రామచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం పద్మశ్రీ అవార్డు స్వీకరించిన సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన నగదు, ఇంటి స్థలం అందలేదంటూ ఆయన బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు వచ్చిన మంత్రి సీతక్క ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. మణుగూరు మండలం కూనవరానికి చెందిన కంచు మేళం కళాకారుడైన రామచంద్రయ్య రెండేళ్ల క్రితం అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి నజరానా, ఇంటి స్థలం ప్రకటించినప్పటికీ నేటికీ అందలేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులను కలిస్తే నిధులు రాలేదని చెబుతున్నారని ఆయన మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన మంత్రి సీతక్క.. సంబంధిత అధికారులతో మాట్లాడతానని, అప్పటి వరకు చికిత్స అందేలా చూస్తానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తనను కలిస్తే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రామచంద్రయ్యను సీతక్క సన్మానించి ఆర్థిక సాయం అందజేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య మంత్రి వెంట ఉన్నారు.

హెచ్‌సీయూకు ప్రపంచ స్థాయి గుర్తింపు

● ఏడు సబ్జెక్టుల్లో అత్యుత్తమ ర్యాంకింగ్స్
● క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024 విడుదల



రాయదుర్గం (హైదరాబాద్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ప్రపంచ స్థాయిలో గుర్తింపు దక్కింది. ఏడు సబ్జెక్టులలో మంచి ర్యాంకింగ్స్ దక్కాయి. అందులో ఆర్ట్స్ విభాగంలో ప్రపంచ స్థాయిలో 101–120 ర్యాంక్ దక్కింది. గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనలిస్ట్ 'క్యూఎస్ క్వాక్వెరెల్లి సైమండ్స్'తాజాగా యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024ను బుధవారం విడుదల చేసింది. ఇందులో హెచ్‌సీయూలో బయోలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్–ఎకనామెట్రిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ లిటరేచర్, లింగ్విస్టిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీలకు ర్యాంకింగ్ లభించింది. ప్రపంచవ్యాప్తంగా 95 దేశాల్లోని 1,500కుపైగా విశ్వవిద్యాలయాలకు చెందిన 16,400 మందికిపైగా విద్యార్థులతో సర్వే చేసి ఈ ర్యాంకులను ఖరారు చేసినట్టు క్యూఎస్ సంస్థ తెలిపింది. కాగా.. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్–2024లో హెచ్‌సీయూకు మంచి గుర్తింపు రావడం సంతోషకరమని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు.

ఈనెల 20న ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: భూగర్భ జలవనరుల శాఖలో గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 20న కమిషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్లకు సంబంధించిన లింకును కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులు ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ మధ్య వెబ్ ఆప్షన్లు సమర్పించాలన్నారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థుల వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఐదు జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు

● 443 కేంద్రాల ద్వారా 31 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
● రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు : పౌర సరఫరాలశాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. గత నెల మూడోవారం నుంచే నల్లగొండ, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో కొనుగోళ్లు ప్రారంభం కాగా, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో కూడా కోతలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే పనిలో పౌరసరఫరాల సంస్థ బిజీగా ఉంది. మార్చి 25వ తేదీ నుంచే అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఈ సీజన్‌లో మొత్తం 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి 75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రారంభించిన 443 కొనుగోలు కేంద్రాల్లో పౌరసరఫరాల సంస్థ ద్వారా 4,345 మంది రైతుల నుంచి 31,215 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఒకటి రెండు రోజుల తర్వాత కోతలు పెరిగి ..ధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల సంస్థ అంచనా వేస్తోంది. ఐకేపీ, పీఏసీఎస్ వంటి సహకార సంఘాల ద్వారా పౌరసరఫరాల సంస్థ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తోంది.

మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడేనా..?

కొన్నేళ్లుగా ధాన్యం సేకరణ ప్రక్రియలో మిల్లర్ల జోక్యం పెరిగింది. కొనుగోలు కేంద్రాలలోనే తరుగు పేరుతో క్వింటాల్‌కు 5 కిలోలకు పైగా ధాన్యాన్ని రైతుల నుంచి అదనంగా తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. తీరా ధాన్యం మిల్లులకు పంపిన తర్వాత కూడా రంగు మారిందని, తాలు, తేమ అధికంగా ఉందని కారణాలు చెబుతూ మిల్లర్లు నేరుగా రైతులకు ఫోన్లు చేయించి వేధించి తరుగు తీయడం పరిపాటిగా మారింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈసారి ఆ పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్లిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవడం తప్ప, కొర్రీలు పెడితే సహించేది లేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ ఇప్పటికే స్పష్టం చేశారు. మిల్లులపై కఠినంగా వ్యవహరించడంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో కూడా తరుగు, హమాలీ పేరుతో కిలోల కొద్దీ ధాన్యం రైతుల నుంచి దోచుకునే విధానానికి స్వస్తి పలకాలని రైతులు కోరుతున్నారు.

అందుబాటులో 14 కోట్ల గన్నీ సంచులు

రాష్ట్రంలో ఈసారి కొనుగోలు కేంద్రాలకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినా, ఈసారి దిగుబడి, ధాన్యం విక్రయాల తీరును బట్టి చూస్తే 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నులలోపే ధాన్యం సేకరణ జరిగే అవకాశముందని పౌరసరఫరా వర్గాలు చెబుతున్నాయి. ముందస్తు అంచనాలకు అనుగుణంగా ఈసారి వడ్ల సేకరణకు 18.85 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయని ప్రభుత్వం భావించింది. అందులో ఇప్పటికే 14 కోట్ల గన్నీ సంచులను పౌరసరఫరాల శాఖ అందుబాటులో ఉంచింది. ఈ గన్నీ బ్యాగులు 56 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లకు ఇవి సరిపోతాయి. మిగతా గన్నీ బ్యాగులను కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినా, వాటి అవసరం ఉండక పోవచ్చని అధికారులు అంటున్నారు.

అశ్రునయనాల మధ్య రాజీవ్‌రతన్ అంత్యక్రియలు

● నివాళులు అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి, డీజీపీ రవిగుప్తా


రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో రాజీవ్‌రతన్‌కు నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాయదుర్గం (హైదరాబాద్): గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ ఐపీఎస్ రాజీవ్‌రతన్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య నిర్వహించారు. రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో బుధవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. రాజీవ్‌రతన్ భౌతికకాయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, మాజీ పోలీసు అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పలువురు ఐపీఎస్ అధికారులు, విశ్రాంత ఐపీఎస్, పోలీసు అధికారులు, స్నేహితులు, కుటుంబసభ్యులు నివాళులు అర్పించారు.

రాజీవ్‌రతన్ ఒక మహోన్నత శక్తి: డీజీపీ రవిగుప్తా

రాజీవ్‌రతన్ తనకు సహోద్యోగి, స్నేహితుడు మాత్రమే కాదని, ఆయన ఒక మహోన్నత శక్తి అని, ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తి అని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా పేర్కొన్నారు. ఆయన ఆకస్మిక నిష్క్రమణ తేలికగా పూరించలేని శూన్యాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ నుంచి నేషనల్ పోలీస్ అకాడమీ వరకు రాజీవ్ ప్రయాణం క్రమశిక్షణతో సాగిందని అన్నారు. ఆయనతో పంచుకున్న క్షణాలు, జ్ఞాపకాలు చిరకాలం నిలిచిపోతాయన్నారు.

తోటి టీచర్లు వేధిస్తున్నారని..

● ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం
● వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలో ఘటన


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హారిక

ఖానాపురం: తోటి టీచర్ల వేధింపులతో మనస్తాపానికి గురైన ఓ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటలో ఈ ఘటన జరిగింది. నర్సంపేటకు చెందిన హారిక బుధరావుపేట మోడల్‌స్కూల్‌లో పదేళ్లుగా సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఇటీవల ఆమె పాఠశాలలో సెల్‌ఫోన్ వాడుతున్న ఫొటోలు బయటకు రావడంతో పలు పత్రికలలో కథనాలు వచ్చాయి. రోజుమాదిరిగానే హారిక బుధవారం పాఠశాలకు రాగా, సెల్‌ఫోన్ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి సంజాయిషీ కోరారు. దీంతో ఆమె సంజాయిషీ ఇస్తానని చెప్పి స్టాఫ్ రూంకు వెళ్లింది. అయితే ఆమె అక్కడ ఆల్‌అవుట్ (దోమల నివారణ మందు)ను తాగింది. ఇది గమనించిన తోటి ఉపాధ్యాయులు ఆమెను చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా హారిక విలేకరులతో మాట్లాడుతూ పాత ప్రిన్సిపాల్ రాజేందర్‌తోపాటు ఉపాధ్యాయులు రాజు, మౌశాల్ మరికొంత మంది ఉపాధ్యాయులు నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని, సెల్‌ఫోన్‌లతో అసభ్యకరమైన రీతిలో ఫొటోలు తీసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సిలబస్ పూర్తి చేయలేదని, అలాగే స్టాఫ్‌రూంలో, వాష్‌రూంకు వెళ్లే సమయంలో వీడియోలు తీసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సోషల్ మీడియాలో ఫొటోలు పెడతామంటూ ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా పాఠశాలలో తనపట్ల ఇబ్బందికరంగా వ్యవహరిస్తుండటంతో మానసిక క్షోభ తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. కాగా ఈ ఘటనపై పోలీసులు పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

ఎవరినీ వేధించలేదు..

హారికను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు రాజేందర్, మౌశాల్, రాజులను వివరణ కోరగా తాము ఎవరినీ వేధింపులకు గురిచేయలేదని, కావాలనే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో ఎవరు సెల్‌ఫోన్‌లు వాడతారనే విషయం తోటి ఉపాధ్యాయులందరికీ తెలుసని అన్నారు.

ఇద్దరి ప్రాణం తీసిన ఈత సరదా

● దేవరకద్ర మండలం కోడూర్‌లో పండుగ పూట విషాదం


గణేష్, శివ

దేవరకద్ర రూరల్: పండుగ పూట కుటుంబ సభ్యులు, స్నేహితులతో అప్పటివరకు సంతోషంగా గడిపిన ఇద్దరు యువకులు.. సరదాగా ఈత కొట్టేందుకు బావికి వెళ్లి విగతజీవులుగా మారారు. ఈ దుర్ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని కోడూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. కోడూర్‌లో ఉగాది పండుగ మరుసటి రోజు హోలీ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి స్నేహితులైన గణేష్ (21), శివ (20), మల్లేష్, చందు, శివ హోలీ ఆడారు. అనంతరం దేవరకద్రలోని స్వీట్స్ కళాశాల సమీపంలో ఉన్న బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరిలో గణేష్‌కు ఈత రాకపోవడంతో దూరంగా కూర్చోగా.. స్నేహితుడు శివ ఈత కొడుతుండటంతో, ఆ తరువాత గణేష్ కూడా నీటిలోకి దిగాడు. బావి గట్టును పట్టుకొని ఈదుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు గణేష్ నీటిలో మునిగిపోతూ, శివ గొంతును గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ బావిలో గల్లంతయ్యారు. అవతలి ఒడ్డువైపు ఉన్న మిగతా స్నేహితులు వారి దగ్గరికి చేరుకునే లోపే నీటిలో పూర్తిగా మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా.. వారి మృతదేహాలు లభించాయి. మృతులిద్దరి తండ్రులు గతంలోనే మృతిచెందగా.. తల్లులే కుటుంబాన్ని పోషిస్తున్నారు. మృతుడు గణేష్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతుండగా.. శివ మూసాపేటలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. పండుగ పూట జరిగిన ఈ దుర్ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

బీజేపీకి ఎదురుందా!

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఎదురీతే

కాలూచేయీ కూడదీసుకునే యత్నం

కదనోత్సాహంతో కమలనాథులు

భౌగోళికంగా భారత్‌కు గుండెకాయ వంటిది మధ్యప్రదేశ్. ఈ హిందీ బెల్టు రాష్ట్రంలో ఎన్నికల పోరు ఎప్పుడూ జాతీయ పార్టీల మధ్యే. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో దుమ్మురేపిన బీజేపీ ఉరిమే ఉత్సాహంతో లోక్‌సభ సంగ్రామంలో దూకగా కాంగ్రెస్ కూడా విపక్ష ఇండియా కూటమి దన్నుతో సత్తా చాటేందుకు పావులు కదుపుతోంది...



శివరాజ్‌సింగ్ | జ్యోతిరాదిత్య | నకుల్‌నాథ్ | దిగ్విజయ్



మధ్యప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే అధికార మార్పిడి జరుగుతూ వస్తోంది. కాకపోతే దాదాపు పాతికేళ్లుగా రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యమే సాగుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 సీట్లతో అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించి బీఎస్పీ, స్వతంత్రుల సాయంతో గద్దెనెక్కినా అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. అసంతృప్త కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా 2020లో తిరుగుబాటు చేయడంతో కమల్‌నాథ్ సర్కారు కుప్పకూలింది. శివరాజ్ సింగ్ చౌహాన్ సారథ్యంలో మళ్లీ బీజేపీ సర్కారే కొలువుదీరింది. మధ్యప్రదేశ్‌లో 29 లోక్‌సభ సీట్లున్నాయి. 10 సీట్లను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 28 సీట్లు కొల్లగొట్టగా కాంగ్రెస్ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. గత డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ జోరే కొనసాగింది. 230 అసెంబ్లీ సీట్లలో ఏకంగా 163 స్థానాలను ఒడిసిపట్టింది.

బీజేపీ ఓబీసీ కార్డు, కాంగ్రెస్ మైనారిటీ జపం

మధ్యప్రదేశ్ ఎన్నికల సమీకరణాల్లో కులాలదీ కీలక పాత్రే. అగ్రవర్ణ ఓటు బ్యాంకును పటిష్ట పరుచుకుంటూనే ఇతర సామాజిక వర్గాలను కూడా తమవైపు తిప్పుకోవడంపై బీజేపీ దృష్టి సారించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కుల గణన హామీని విస్తృతంగా ప్రచారం చేసినా ఓబీసీ ఓట్లను సాధించడంలో విఫలమైంది. 2018తో పోలిస్తే బీజేపీ మరింత మంది ఓబీసీలను, ఆదివాసీలను తమవైపు తిప్పుకోగలిగింది. అనూహ్యంగా యాదవ సామాజికవర్గానికి చెందిన మోహన్ యాదవ్‌ను సీఎం చేయడం ఓబీసీల ఓట్లు సాధించి పెడుతుందని ఆశిస్తోంది. ఇతర హిందీ బెల్ట్ రాష్ట్రాల్లోనూ కీలకమైన యాదవ ఓటు బ్యాంకు తనవైపు మళ్లుతుందని భావిస్తోంది. రాష్ట్రంలో 7 శాతం ఓటు బ్యాంకున్న ముస్లింలతో పాటు ఎస్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గుతున్నారు.

> 'సరికొత్త భారత నిర్మాణమే నా మిషన్. చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఇందుకు ప్రజల దీవెనలు కావాలి. నేను మహాకాలుడి భక్తున్ని. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదు'
>
> - మంగళవారం మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో ఎన్నికల ర్యాలీలో మోదీ

స్టేట్ స్కాన్

కాషాయ దళంలో జోష్

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు జోష్‌లో ఉన్న బీజేపీ ఈసారి మొత్తం 29 స్థానాలనూ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. అయోధ్య రామమందిర నిర్మాణం, మోదీ, అభివృద్ధి, హిందుత్వ నినాదం ఈసారి కమలనాథులు ప్రచా రాస్త్రాలుగా ఉన్నాయి. సీఎంగా దాదాపు పాతికేళ్ల రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన శివరాజ్ సింగ్ ఈసారి విదిశ నుంచి లోక్‌సభ బరిలోకి దిగుతుండటం విశేషం! కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య గుణ నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ సింగిల్‌గా పోటీ చేస్తోంది. నాలుగు విడతల్లో పోలింగ్ జరుగుతుండగా ఇప్పటికే అభ్యర్థులందరినీ ప్రకటించింది. ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌లో సుడిగాలి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. తాజాగా మంగళవారం బాలాఘాట్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో విపక్షాలపై పదునైన వాగ్బాణాలు సంధించారు. తాను అభివృద్ధి చేస్తుంటే దూషిస్తున్నారని, దేశ భద్రతకు గ్యారంటీ ఇస్తుంటే బురద జల్లుతున్నారని, అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తున్నప్పుడూ అనరాని మాటలన్నారని విరుచుకుపడ్డారు. బీజేపీ నేతలు కూడా కాంగ్రెస్‌పై పదునైన విమర్శలతో వేడి పుట్టిస్తున్నారు.

కాంగ్రెస్ కోలుకునేనా...!

అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం చతికిల పడుతోంది. సింధియా వంటి కీలక యువ నేతను చేజార్చుకోవడం ఈసారి హస్తం పార్టీకి మరింత ప్రతికూలంగా మారింది. ఇండియా కూటమి దన్నుతో బీజేపీని ఢీకొట్టి పూర్వ వైభవాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా మలచుకుంటోంది. కులగణన హామీ ద్వారా ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకులపై కన్నేసింది. రాహుల్ ప్రకటించిన యువతకు 30 లక్షల ప్రభుత్వోద్యోగాల హామీపైనా ఆశలు పెట్టుకుంది. 6 న్యాయాలు, 25 గ్యారంటీల మ్యానిఫెస్టోతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. సమాజ్‌వాదీ పార్టీకి ఖజురహో స్థానం కేటాయించి మిగతా 28 చోట్ల పోటీ చేస్తోంది.

బీజేపీకే ఓటేస్తున్న సర్వేలు

సాధారణంగా మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సరళి జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా ఉంటుంది. ఆ లెక్కన మొత్తం 29 సీట్లనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని పలు సర్వేలు అంచనా వేశాయి. మరికొన్ని 27 సీట్లిచ్చాయి. కాంగ్రెస్ గట్టిగా పుంజుకోని పక్షంలో 2 సీట్లకు మించకపోవచ్చన్నది మెజారిటీ ఒపీనియన్ పోల్స్ అంచనా.

- సాక్షి, నేషనల్ డెస్క్





పశ్చిమబెంగాల్‌లోని ఉత్తరపారాలో ఎన్నికల ప్రచారంలో ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దు చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి కళ్యాణ్ బెనర్జీ

బరిలో కుబేరులు

తొలి దశ అభ్యర్థుల్లో 450 మంది కోటీశ్వరులు

రూ.717 కోట్లతో తొలి స్థానంలో కాంగ్రెస్ నేత నకుల్‌నాథ్



లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతున్న వారిలో కోట్లకు పడగలెత్తిన వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. ప్రధాన పార్టీల టికెట్లు దక్కించుకునేందుకు ధనబలం కూడా ప్రాతిపదికగా మారుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో తొలి విడతలో బరిలో ఉన్న 1,625 మంది అభ్యర్థుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు కోటీశ్వరులేనని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (ఏడీఆర్) వెల్లడించింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో 102 లోక్‌సభ స్థానాల్లో ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ జరగనుంది.

బీజేపీ నుంచే ఎక్కువ...



తొలి విడతలో మొత్తం 1,625 మంది అభ్యర్థుల్లో 450 మందికి రూ.కోటి, అంతకంటే ఎక్కువ ఆస్తులున్నాయి. జాబితాలో బీజేపీ నుంచి అత్యధికంగా 69 మంది ఉన్నారు. తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (49 మంది), అన్నాడీఎంకే (35), డీఎంకే (21), బీఎస్పీ (18), టీఎంసీ (4), ఆర్జేడీ (4 మంది) ఉన్నాయి. అభ్యర్థుల సగటు ఆస్తులపరంగా అన్నాడీఎంకే టాప్‌లో ఉంది. ఈ పార్టీ అభ్యర్థులు ఒక్కొక్కరికి సగటున రూ.35.61 కోట్ల ఆస్తులున్నాయి. తొలి దశ అభ్యర్థుల్లో అత్యంత సంపన్నుడిగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్ నిలిచారు. అఫిడవిట్లో వెల్లడించిన ఆయన ఆస్తుల విలువ రూ.717 కోట్లు. ఛింద్వారా సిటింగ్ ఎంపీ అయిన ఆయన ఈసారి కూడా అక్కడినుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. రెండో స్థానంలో తమిళనాడులోని ఈరోడ్ అభ్యర్థి అశోక్ కుమార్ ఉన్నారు. ఈ అన్నాడీఎంకే నేత తనకు రూ.662 కోట్ల ఆస్తులున్నట్టు పేర్కొన్నారు. 10 మంది స్వతంత్ర అభ్యర్థులు తమకు ఎలాంటి ఆస్తులూ లేవని ప్రకటించడం విశేషం!

93 మంది నేరచరితులు

తొలి విడతలో బరిలో ఉన్న అభ్యర్థుల్లో నేరచరిత్ర కలిగిన వారి సంఖ్య కూడా ఎక్కువే. జాబితాలో బీజేపీ నుంచి 28 మంది, కాంగ్రెస్ నుంచి 19 మంది ఉన్నారు. తర్వాతి స్థానాల్లో డీఎంకే (13), అన్నాడీఎంకే (13), బీఎస్పీ (11), ఆర్జేడీ (4), ఎస్పీ (3), టీఎంసీ (2) ఉన్నాయి. వీరిలో బీజేపీ నుంచి 14 మందిపై తీవ్ర నేరపూరిత కేసులున్నాయి. ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (8), బీఎస్పీ (8), డీఎంకే (6), అన్నాడీఎంకే (6), ఆర్జేడీ (2), ఎస్పీ (2), టీఎంసీ (1) ఉన్నాయి.

తొలి విడత ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల్లో టాప్-10 సంపన్నులు

అభ్యర్థి	లోక్‌సభ స్థానం	పార్టీ	ఆస్తుల విలువ (రూ.కోట్లలో)
నకుల్‌నాథ్	ఛింద్వారా	కాంగ్రెస్	716.94
అశోక్‌కుమార్	ఈరోడ్	అన్నాడీఎంకే	662
దేవనాథన్ యాదవ్	శివగంగ	బీజేపీ	304.92
మలా రాజ్యలక్ష్మిషా	తెహ్రీ గఢ్వాల్	బీజేపీ	206.87
మజీద్ అలీ	సహరాన్‌పూర్	బీఎస్పీ	159.59
ఏసీ షణ్ముగం	వెల్లూర్	బీజేపీ	152.77
వి.జయప్రకాశ్	కృష్ణగిరి	అన్నాడీఎంకే	135.78
విన్సెంట్ హెచ్ పాలా	షిల్లాంగ్	కాంగ్రెస్	125.81
జ్యోతి మిర్ధా	నాగ్‌పూర్	బీజేపీ	102.61
కార్తి చిదంబరం	శివగంగ	కాంగ్రెస్	96.27

అత్యంత తక్కువ ఆస్తులున్న అభ్యర్థులు

అభ్యర్థి	లోక్‌సభ స్థానం	పార్టీ	ఆస్తుల విలువ (రూ.లలో)
కె.పొన్‌రాజ్	తూత్తుకుడి	స్వతంత్ర	320
కార్తిక్ జెండ్‌లాల్బిడోక్	రాంటెక్	స్వతంత్ర	500
సూర్యముత్తు	చెన్నై నార్త్	స్వతంత్ర	500
జి.దామోదరన్	అరణి	స్వతంత్ర	1,000
జె.సెబాస్టియన్	చెన్నై నార్త్	ఎస్‌యూసీఐ(సి)	1,500
సతీష్ కుమార్	పుదుచ్చేరి	స్వతంత్ర	2,000
సురేష్ కే	దిండిగల్	స్వతంత్ర	2,000
పళనిస్వామి కే	దిండిగల్	స్వతంత్ర	2,000
పి.గోవిందరాసు	తిరుచ్చిరాపల్లి	స్వతంత్ర	2,000
కృష్ణన్ ఎస్	తూత్తుకుడి	స్వతంత్ర	3,500

- సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీ మంత్రి రాజీనామా

ఆమ్ ఆద్మీ పార్టీకి సైతం గుడ్‌బై



న్యూఢిల్లీ: సారథి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో నాయకత్వ సమస్యతో సతమతమవుతున్న ఆమ్ ఆద్మీ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ సంక్షేమ శాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ బుధవారం రాజీనామా చేశారు. దళిత ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, మంత్రులకు ఆప్ ఏమాత్రం గౌరవం ఇవ్వదని ఆరోపించారు. ''ఆప్‌లో దళిత నేతలు మోసపోయారు. ఇలాంటి పరిస్థితులున్న ఆప్‌లో కొనసాగలేను. అందుకే పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నా'' అని ప్రకటించారు. ''ఆప్‌ను అనవసరంగా లక్ష్యంగా చేసుకున్నారని నిన్నటిదాకా భావించా. కానీ కేజ్రీవాల్ అరెస్ట్‌ను ఢిల్లీ హైకోర్టు సమర్థించడం చూస్తుంటే పార్టీలో తప్పులు జరిగినట్లు అనిపిస్తోంది. అవినీతితో అంటకాగిన పార్టీలో ఉండలేను'' అని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. దర్యాప్తు సంస్థల ఒత్తిడి, తప్పుడు కేసులు, అరెస్ట్ భయంతోనే రాజ్‌కుమార్ పార్టీని వీడారని వ్యాఖ్యానించింది. ఇది తమ ఎమ్మెల్యేలు, ఎంపీలకు అగ్నిపరీక్ష అని ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు.

క్షమించే ఉదారగుణం మాకు లేదు

రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణ క్షమాపణ అఫిడవిట్లపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: తమ సంస్థ ఉత్పత్తుల వాణిజ్య ప్రకటనల విషయంలో మరోసారి ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడబోమంటూ యోగా గురు రామ్‌దేవ్, పతంజలి ఆయుర్వేద మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ తాజాగా సమర్పించిన బేషరతు క్షమాపణల అఫిడవిట్లపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తన అసంతృప్తిని వ్యక్తంచేసింది. మీ క్షమాపణలను అంగీకరించే ఉదారగుణం మాకు లేదని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంలో నాలుగైదేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ ఉద్దేశపూర్వకంగా కళ్లు మూసుకుందని కోర్టు ఆగ్రహంవ్యక్తంచేసింది. తమ క్లయింట్లు ఇద్దరూ బేషరతుగా క్షమాపణలు చెబుతున్నారని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెబుతుండగా.. 'ఆ సారీలను మేం అంగీకరించట్లేము. కోర్టు ఆదేశాలను పాటిస్తామంటూ మీ క్లయింట్లు ఇచ్చిన పాత అఫిడవిట్లకు మీ క్లయింట్లే ఏమాత్రం విలువ ఇవ్వనప్పుడు తాజా అఫిడవిట్లకు మేం మాత్రం ఎందుకు విలువ ఇవ్వాలి?. మేం కూడా అలాగే చేయొచ్చుకదా? అని జస్టిస్ హిమా కోహ్లీ ప్రశ్నించారు. విదేశీప్రయాణం పేరు చెప్పి రామ్‌దేవ్, బాలకృష్ణ ఉద్దేశపూర్వకంగా కోర్టులో వ్యక్తిగత హాజరు నుంచి తప్పించుకున్నారని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీనీ కోర్టు తలంటింది. జిల్లా ఆయుర్వేదిక్, యునానీ అధికారిని ఎందుకు సస్పెండ్ చేయకూడదని అథారిటీ జాయింట్ డైరెక్టర్‌ను ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 16వ తేదీకి వాయిదావేసింది.

అవినీతికి మారుపేరు డీఎంకే

- భాష, కులం, మతం, విశ్వాసం పేరిట ప్రజల్లో విభజనను సృష్టిస్తోంది
- ప్రధాని మోదీ ఆగ్రహం
- తమిళనాడులోని వెల్లూరు, మెట్టుపాళ్యంలో ప్రచారం



వెల్లూరు: తమిళనాడులో అధికార డీఎంకేపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. డీఎంకే అవినీతికి మారుపేరుగా మారిపోయిందని, రాష్ట్రాభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్వేష, విభజన రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. బుధవారం తమిళనాడులోని వెల్లూరు, మెట్టుపాళ్యంలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో డీఎంకే ముమ్మాటికీ కుటుంబ పార్టీలేనని అన్నారు. అవినీతిపై మొదటి పేటెంట్ హక్కు డీఎంకేకు ఉందని ఎద్దేవా చేశారు. ఒక కుటుంబం రాష్ట్రాన్ని విచ్చలవిడిగా లూటీ చేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబంపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ కంపెనీ అయిన డీఎంకే పాతకాలపు ఆలోచనా ధోరణితో రాష్ట్రంలో యువత ఎదుగుదలను అడ్డుకుంటోందని విమర్శించారు. భాష, కులం, మతం, విశ్వాసం పేరిట ప్రజల్లో విభజనను సృష్టిస్తోందని డీఎంకేపై మండిపడ్డారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో దేశం ముందడుగు వేస్తుండగా, పెట్టుబడులను అడ్డుకొనేవారితో డీఎంకే అంటకాగుతోందని ఆరోపించారు.

కచ్చతీవు అప్పగింత వల్ల లాభపడిందెవరు?

తమిళనాడులో డీఎంకే తరహాలోనే దేశంలో కాంగ్రెస్ పార్టీ వివక్ష, విభజన అనే ప్రమాదకరమైన ఆట ఆడుతోందని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. విపక్ష 'ఇండియా' కూటమిలోని బాగస్వామ్యపక్షాలకు బుజ్జగింపు రాజకీయాలు తప్ప అభివృద్ధి అంటే ఏమిటో తెలియని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అవినీతిపరులను కాపాడాలని కాంగ్రెస్, డీఎంకే ఆరాటపడుతున్నాయని విమర్శించారు. వారసత్వ పార్టీలకు సొంత కుటుంబ సభ్యులు, వారసులు తప్ప ఇతరుల సంక్షేమం పట్టదని అన్నారు. గిరిజన బిడ్డ ద్రౌపది ముర్మును తాము రాష్ట్రపతి ఎన్నికల్లో బరిలో దింపితే వారసత్వ పార్టీలు వ్యతిరేకించాయని గుర్తుచేశారు. మన దేశంలో అంతర్భాగమైన కచ్చతీవును 1974లో అన్యాయంగా శ్రీలంకకు అప్పగించారని ప్రధాన మంత్రి ధ్వజమెత్తారు. అప్పట్లో కేంద్రంలో కాంగ్రెస్, తమిళనాడులో డీఎంకే అధికారంలో ఉన్నాయని వివరించారు. కచ్చతీవు అప్పగింతపై ఏ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారో చెప్పాలన్నారు.

అంబేడ్కర్ ఆత్మ ఆశీస్సులు ఉన్నాయి..

నాగపూర్: ఆర్టికల్ 370 రద్దుతో తనకు అంబేడ్కర్ ఆత్మ ఆశీస్సులు లభిస్తున్నాయని మోదీ చెప్పారు. ప్రతిపక్షాల ఆరోపణలు, దూషణలతో తనకు మేలు జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిచే సీట్లు మరిన్ని పెరుగుతాయని అన్నారు. ఆయన బుధవారం మహారాష్ట్రలో నాగపూర్ జిల్లాలోని కన్హాన్ పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. మోదీ మూడోసారి గెలిస్తే దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఉండబోవంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు.

ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ నేత కుమారుల మృతి

టెల్ అవీవ్: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హమాస్ ముఖ్యనేత ఇస్మాయిల్ హనియేహ్ కుమారులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఖతర్ వంటి దేశాలు సంధి ప్రయత్నాలు చేస్తున్న వేళ హమాస్ కీలక నేత కుమారులు మరణించడంతో సయోధ్యపై మరోమారు నీలినీడలు కమ్ముకున్నాయి. ''జెరూసలేం, అల్-అక్సా మసీదుకు విముక్తి కల్పించే పోరాటంలో నా కుమారులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు' అని అల్‌జజీరాకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఇస్మాయిల్ వెల్లడించారు. ఇస్మాయిల్ ప్రస్తుతం ఖతార్‌లో ప్రవాసజీవితం గడుపుతున్నారు. కుమారులు మాత్రం గాజాలోని శరణార్థి శిబిరంలో ఉంటున్నారు. షాటీ శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలోనే ఆయన కుమారులు హజీమ్, అమీర్, మొహమ్మద్‌లు మరణించారని అల్-అక్సా టీవీ ప్రకటించింది. ముగ్గురూ తమ కుటుంబసభ్యులతో కలిసి ఒకే వాహనంలో వెళ్తుండగా ఇజ్రాయెల్ డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురితోపాటు హజీమ్ కుమారులు, కుమార్తె, అమీర్ కుమార్తె సైతం ప్రాణాలు కోల్పోయారు.

సుప్రీంకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బుధవారం సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. సోమవారం లోపు విచారించడం కుదరదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగే అవకాశముంది.

జేమ్స్‌బాండ్ సీక్వెల్సా?

పదేపదే ఒకే తరహా పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలంటూ పదేపదే పిటిషన్లు దాఖలవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఆప్ మాజీ ఎమ్మెల్యే సందీప్ కుమార్ వేసిన ఈ తరహా పిటిషన్‌పై ఆగ్రహం వెలిబుచ్చింది. ''దీనిపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని గతంలోనే స్పష్టం చేసినా పదేపదే అవే పిటిషన్లు వేస్తున్నారు. ఇవేమీ జేమ్స్‌బాండ్ సినిమా సీక్వెల్స్ కావు. వ్యవస్థను వెక్కిరించేలా పిటిషన్లు వేస్తే ఊరుకోం. మీకు రూ.50,000 జరిమానా వేస్తాం'' అని సందీప్‌ను హెచ్చరించింది. ఆయన తరఫున లాయర్ వాదించబోయినా, ''రాజకీయ ప్రసంగాలు ఇవ్వాలనుకుంటే వీధి చివరికెళ్లి ఇచ్చి రండి. మీ క్లయింట్ నేత కాబట్టి రాజకీయాలు చేస్తారు. మేం రాజకీయాల్లో మునగదల్చుకోలేదు'' అని స్పష్టం చేసింది.

ప్రచారంలో ముద్దు రగడ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో సోమవారం అనూహ్య ఘటన జరిగింది. ఉత్తర మాల్దా బీజేపీ అభ్యర్థి ఖగేన్ ముర్ము హఠాత్తుగా ఓ మహిళ చెక్కిలిపై ముద్దు పెట్టడంతో అంతా అవాక్కయ్యారు. ఈ వ్యవహారం వైరల్ కావడంతో పరాయి మహిళలకు ముద్దులు పెట్టడం బెంగాలీ సంస్కృతి కాదంటూ టీఎంసీ నేతలు విమర్శలకు దిగారు. ఖగేన్ మాత్రం తన చర్యను సమర్థించుకున్నారు. ''ఆమె నా బిడ్డ లాంటిది. తండ్రి తన బిడ్డను ముద్దాడితే తప్పేంటి?'' అని ప్రశ్నించారు. తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఖగేన్ ముద్దు పెట్టిన మహిళ కూడా ఆయన చర్యలో తప్పేమీ లేదనడం విశేషం! ముద్దు సంఘటన జరిగినప్పుడు తన తండ్రి, తల్లి అక్కడే ఉన్నారని వెల్లడించింది. సొంత బిడ్డ లాంటి మహిళను ఒక వ్యక్తి ముద్దాడడంలో తప్పేమీ లేదని పేర్కొంది. ముద్దు పెట్టిన ఫొటోను వైరల్ చేసిన వారిది నీచ మనస్తత్వం అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

కిరణ్‌ఖేర్‌కు మొండిచేయి

9 మందితో బీజేపీ పదో జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: చండీగఢ్ నుంచి వరుసగా రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన బాలీవుడ్ నటి కిరణ్‌ఖేర్‌కు బీజేపీ ఈసారి టికెట్ నిరాకరించింది. అక్కడ ఛత్తీస్‌గఢ్ మాజీ గవర్నర్, జనసంఘ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన దివంగత బలరామ్‌జీ దాస్ టాండన్ కుమారుడు సంజయ్ టాండన్‌ను బరిలో నిలిపింది. 9 మంది అభ్యర్థులతో బీజేపీ బీజేపీ బుధవారం పదో జాబితా విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లో ఏడుగురు, చండీగఢ్, పశ్చిమ బెంగాల్ నుంచి చెరొకరు చొప్పున పేర్లను ప్రకటించింది. అలహాబాద్ సిట్టింగ్ ఎంపీ రీటా బహుగుణ జోషీ స్థానంలో నీరజ్ త్రిపాఠికి అవకాశమిచ్చింది. మెయిన్‌పురిలో సమాజ్‌వాదీ అభ్యర్థి, అఖిలేశ్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్‌పై రాష్ట్ర మంత్రి జైవీర్‌సింగ్ ఠాకూర్‌ను పోటీలో దింపింది. బలియాలో నాలుగుసార్లు ఎంపీగా గెల్చిన వీరేంద్రసింగ్‌ను పక్కనబెట్టి మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడు నీరజ్ శేఖర్‌కు టికెటిచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో అసన్‌సోల్ నుంచి కేంద్ర మాజీ మంత్రి ఎస్ఎస్ అహ్లువాలియాకు టికెటిచ్చింది. గాజీపూర్‌లో ఇటీవల మరణించిన గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ కుమారుడు అఫ్జల్ అన్సారీపై పరాస్‌నాథ్ రాయ్‌ను బరిలోకి దింపింది. కౌశాంబి నుంచి వినోద్ సోంకార్, మఛ్లీషహర్ నుంచి బీపీ సరోజ్ పోటీచేయనున్నారు.

సందేశ్‌ఖాలీ అకృత్యాలపై సీబీఐ విచారణ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో గిరిజన మహిళలపై జరిగిన అకృత్యాలు, లైంగిక దాడులు, భూకబ్జాలపై సీబీఐ విచారణ జరపాలని కలకత్తా హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణను తాము పర్యవేక్షిస్తామని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్.శివజ్ఞానం నేతృత్వంలోని కలకత్తా హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మే 2వ తేదీలోగా విచారణ జరిపి, సమగ్ర నివేదిక అందజేయాలని సీబీఐకి సూచించింది. దర్యాప్తు విషయంలో సీబీఐకి సహరించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సందేశ్‌ఖాలీలో వ్యవసాయ భూమిని చెరువులుగా మార్చి చేపల పెంపకం చేపట్టారన్న ఆరోపణలపైనా దర్యాప్తు జరిపి, నివేదిక ఇవ్వాలంది.

కొడుక్కు తుపాకీ అందుబాటులో ఉంచారని...

తల్లిదండ్రులకు 15 ఏళ్ల జైలు

వాషింగ్టన్: కొడుకు చేసిన నేరానికి తల్లిదండ్రులకు శిక్ష విధించిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. స్కూల్‌లో తుపాకీతో కాల్పులు జరిపిన నలుగురు పిల్లలను బలి తీసుకోవడంతో పాటు ఏడుగురిని గాయపర్చిన బాలుడి తల్లిదండ్రులకు కోర్టు 15 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఇంట్లో బాలుడికి తుపాకీ అందుబాటులో ఉండేలా పెట్టడమే వారి నేరమని నిర్ధారించింది. 2021 నవంబర్ 30న మిషిగన్ రాష్ట్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఎథాన్ క్రంబ్లీ అనే పిల్లాడు తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. అతని మానసిక ఆరోగ్యం సరిగా లేదని తేలింది. అలాంటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సింది పోయి తుపాకీ అందుబాటులో ఉంచడం తల్లిదండ్రులు జేమ్స్, జెన్నిఫర్ తప్పేనని కోర్టు తేల్చింది.

ఓటేస్తే హెయిర్‌కట్ ఫ్రీ

ముంబై: ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వారికి తన సెలూన్లో ఉచితంగా హెయిర్‌కట్ చేస్తానని మహారాష్ట్రలోని అకోలాకు చెందిన అనంత కౌల్కర్ అనే వ్యక్తి ప్రకటించాడు! అకోలాలో ఏప్రిల్ 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఓటేసి తన సెలూన్‌కు వచ్చి వేలికి సిరా గుర్తు చూపించిన వారికి హెయిర్‌కట్ ఉచితమంటూ దుకాణం బయట బోర్డు పెట్టాడు. పోలింగ్ శాతం పెంచేందుకు తనకు తోచినంతలో వినూత్నంగా ప్రయత్నిస్తున్న కౌల్కర్‌ను స్థానికులు తెగ మెచ్చుకుంటున్నారు. ఏప్రిల్ 26వ తేదీన మహారాష్ట్రలోని 8 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

హోర్డింగులు, పోస్టర్లపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు ముద్రించాల్సిందే

రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. హోర్డింగులు సహా ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే ఇతర సామగ్రిపై ప్రింటర్, పబ్లిషనర్ పేర్లు స్పష్టంగా కనిపించేలా ముద్రించాలని ఆదేశించింది. ఎన్నికల ప్రచారంలో జవాబుదారీతనం, పారదర్శకత కోసమే ఈ నిబంధన విధించినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన హోర్డింగులపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు లేవంటూ ఆమ్ ఆద్మీ పార్టీ సహా పలువురు ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హోర్డింగుల సహా కరపత్రాలు, పోస్టర్లపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లను తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.



బుధవారం రాత్రి చార్మినార్ వద్ద రద్దీ..



చార్మినార్ వద్ద షాపింగ్..



సుర్మా పెట్టించుకుంటున్న యువకుడు



విద్యుత్ వెలుగుల్లో మక్కా మసీదు

రంజాన్ మాసంలో చివరి ఘట్టమైన ఈద్–ఉల్–ఫితర్‌కు నగరంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెలరోజుల పాటు కఠోరమైన ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు బుధవారం సాయంత్రం దీక్షలను విరమించారు. ఇక గురువారం ఈద్ పండగను జరుపుకొంటారు. ఇందులో భాగంగా పాతబస్తీ మీరాలం, మాదన్నపేట్ ఈద్గాలతో పాటు మక్కా మసీదు, కులీకుతుబ్ షా స్టేడియం, అంబర్‌పేట్ మైదానాల్లో సామూహిక ప్రార్థనలకు అధికారులు, మసీదు కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలోనూ సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. టెంట్లు, తాత్కాలిక షెడ్లు, నీటి వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని పోలీస్ అధికారులు తెలిపారు. కాగా బుధవారం రాత్రి వరకు చార్మినార్ ప్రాంతంలో షాపింగ్ సందడి కన్పించింది.

– చార్మినార్/సాక్షి, సిటీబ్యూరో

ఈద్ ముబారక్

రూ. 2.15 కోట్ల విలువైన నకిలీ సిగరెట్ల పట్టివేత



పట్టుబడిన కంటైనర్, సిగరెట్‌లతో కూడిన బాక్సులు

శంషాబాద్: నగరానికి అక్రమంగా తీసుకొచ్చిన రూ.2.15 కోట్ల విలువైన నకిలీ సిగరెట్లను రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, ఆర్‌జీఐఏ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలోని ట్రక్ పార్కింగ్ ఏరియాలో ఓ కంటైనర్‌లో భారీగా నకిలీ సిగరెట్లు తీసుకువచ్చినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఓటీ, ఆర్‌జీఐఏ పోలీసులు నిఘా వేసి కంటైనర్‌తో పాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందులో బిహార్ రాష్ట్రం పట్నాలోని గుడ్‌లక్ కంపెనీ నుంచి నగరంలోని ముషీరాబాద్ శ్రీరాం ఎంటర్‌ప్రైజెస్‌కు నకిలీ కన్‌సైన్‌మెంట్‌పై 267 కార్టన్ డబ్బాలు తీసుకొచ్చారు. వీటిల్లో మొత్తం రూ.2.15 కోట్ల విలువ చేసే సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. పార్కింగ్ ఏరియాలోనే కంటైనర్‌ను ఉంచి నగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నకిలీ సిగరెట్లను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కంటైనర్ వెంట పైలట్‌గా వచ్చిన బిహార్ రాష్ట్రానికి చెందిన రవికాంత్‌కుమార్, హర్యానాకు చెందిన కంటైనర్ డ్రైవర్ ఎండీ షాజహాద్, క్లీనర్ ముబారక్‌ఖాన్‌తో పాటు హైదరాబాద్‌లో సరుకు తీసుకునేందుకు వచ్చిన సయ్యద్ ఇలియాసుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్ నుంచి సరుకు సరఫరా చేసిన సుభాష్, హైదరాబాద్‌లో తీసుకునేందుకు సిద్ధమైన రెహాన్‌ఖాన్‌లు పరారీలో ఉన్నారు.

మిస్టరీ వీడిన తేజస్ మర్డర్ కేసు

- 9 మంది నిందితుల రిమాండ్
- పక్కా స్కెచ్.. ఆపై రీల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్
- నమ్మిన స్నేహితుడే ఈ కేసులో కీలకం
- రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన బాచుపల్లి పోలీసులు



హత్యకు హత్య

తరుణ్ రాయ్‌ను చంపినందుకు ప్రతీకారంగానే..



తేజస్ (ఫైల్)



తరుణ్‌రాయ్ (ఫైల్)

నిజాంపేట్: ప్రగతినగర్‌లో జరిగిన ప్రతీకార హత్య కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నలుగురు మైనర్లు ఉన్నారు. ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ కథనం ప్రకారం వివరాలు.. గత ఏడాది అక్టోబర్ 24న తెల్లవారుజామున ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి దాసారం బస్తీలో తరుణ్‌రాయ్ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఏ–1గా షేక్ షరీఫ్ అలియాస్ అమీర్ షరీఫ్, ఏ–2గా అభిషేక్, అలియాస్ అభి, ఏ–3గా పిల్లి తేజస్ అలియాస్ తేజు, అలియాస్ డీల్, ఏ–4గా బండ నాగరాజు, ఏ–5గా రాహుల్, ఏ–6గా రాబిన్ బెన్నీలు నిందితులు. వీరిని ఎస్‌ఆర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షేక్ షరీఫ్, తేజస్‌లు రెండు నెలల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన వీరిని ఎలాగైనా హత్య చేయాలని తరుణ్‌రాయ్ అనుచరులు పథకం రచించారు. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన తేజస్ బోరబండ నుంచి ప్రగతినగర్‌కు వచ్చి తన తల్లితో కలిసి అద్దె ఇంటిలో ఉండేవాడు.

పక్కా ప్రణాళికతో..

- తరుణ్‌రాయ్ బంధువులైన రోహిత్‌తో పాటు అతని అనుచరులు దినేష్ తదితరులు తేజస్‌ను హత్య చేయాలని పథకం వేసుకున్నారు. ఈ క్రమంలో ఎవరికీ అనుమానం రాకుండా శివప్పను ప్రగతినగర్‌లో ఉంటున్న తేజస్ దగ్గరకు మద్యం తాగడానికి పంపించారు. దీంతో శివప్పతో పాటు కౌశిక్, మహేశ్ ముగ్గురూ ఈ నెల 7న ప్రగతినగర్‌లోని తేజస్ ఇంటికి చేరుకుని రాత్రి 11 గంటల వేళ మద్యం తాగుతున్నారు. ఇదే సమయంలో మోతీనగర్‌లోని అల్‌సఫా హోటల్‌లో రోహిత్‌తో పాటు మరో 13 మంది తేజస్ హత్యపై చర్చించారు. శివప్ప ప్రగతినగర్‌లోని ఇంటి లొకేషన్‌ను షేర్ చేశాడు. తెల్లవారుజాము 2 గంటల సమయంలో సమీర్, సిద్ధేశ్వర్ నాయక్, జయంత్‌లు బైక్‌పై వచ్చారు. రోహిత్, దినేష్, ప్రతీక్, రాహుల్, సునీల్, గానప్ప, సంతోష్, శ్రీకర్‌లు బైక్‌లపై లొకేషన్‌కు చేరుకుని చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు.
- ఇదే సమయంలో శివప్ప సిగరెట్ తాగేందుకు కిందికి వెళదామనడంతో అందరూ కలిసి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న తేజస్‌ను శివప్ప తన స్కూటీపై ఎక్కించుకుని సమీర్, జయంత్, సిద్ధేశ్వర్‌ల ఎదుట నిలిపాడు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన తేజస్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించే లోపే జయంత్, సిద్ధేశ్వర్ కత్తులతో తేజస్‌పై దాడి చేశారు. వెంటనే సమీర్ సిమెంట్ రాయితో తలపై బలంగా కొట్టాడు. అప్పటికే తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయిన తేజస్ రోడ్డుపై పడిపోయాడు. దాడి చేసే క్రమంలో సిద్ధేశ్వర్ చేతికి గాయమైంది. దీంతో వెంటనే శివప్ప.. సిద్ధేశ్వర్ నుంచి కత్తి తీసుకుని తేజస్ గొంతు కోశాడు. మర్మాంగాలపై రాళ్లతో దాడి చేశాడు. తేజస్ చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం అందరూ అక్కడి నుంచి డాన్సులు చేసుకుంటూ బైక్‌పై రీల్స్ చేసుకుంటూ వెళ్లిపోయారు.

తేజస్ ఇంటిని అధీనంలోకి తీసుకుని..

ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న తేజస్ నివాసానికి తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో చేరుకున్న సుమారు 10 మందికి పైగా అతని ఇంటి పరిసరాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. దాడి అనంతరం 10 నిమిషాల్లోనే తేజస్‌ను హత్య చేసి పరారయ్యారు.

- సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. రోహిత్, సమీర్, సిద్ధేశ్వర్, శివప్ప, గణేశ్, సునీల్, రాహుల్, తిరుమల్, మహేశ్‌లను రిమాండ్‌కు తరలించారు. దినేష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని, ఈ కేసులో నలుగురు మైనర్లు సైతం ఉన్నారని పోలీసులు తెలిపారు. నిందితులు వినియోగించిన ఆరు సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ జోన్ డీసీపీ ఆదేశాలతో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్, ఎస్‌ఐలు మహేశ్, సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రాజేశ్, యాదగిరి, బాల్‌రాజ్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

నాడు తేజస్.. నేడు శివప్ప..

తరుణ్‌రాయ్ హత్య కేసులో ఏ–3గా ఉన్న తేజస్.. తరుణ్‌రాయ్‌కి నమ్మకంగా ఉండేవాడు. దీంతో అప్పట్లో ప్రత్యర్థులు తేజస్‌ను నమ్మకంగా వాడుకుని తరుణ్‌కు సంబంధించిన కదలికలను తెలుసుకుని అనువైన సమయం కోసం వేచి చూసి హత్య చేశారు. ఇదే క్రమంలో తరుణ్‌రాయ్ అనుచరులు సైతం తేజస్‌కు నమ్మకంగా ఉండే శివప్పను ప్రలోభపెట్టి తేజస్‌ను హత్య చేయడం గమనార్హం.

అందరూ నేర చరిత్ర కలిగిన వారే..

తేజస్ హత్యకేసు నిందితుల్లో అందరూ నేర చరిత్ర కలిగిన వారే ఉన్నారు. తిరుమల్ రౌడీ షీటర్ కాగా.. సిద్ధేశ్వర్ మర్డర్ కేసులో నిందితుడు. మిగతా వారిపై సైతం పలు రకాల కేసులు ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. కాగా అందరూ 25 సంవత్సరాల వయసు లోపు వారే కావడం గమనార్హం.

‘డెత్’లైన్ గేమ్స్!

ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలుగా మారుతున్న పలువురు

సాక్షి, సిటీబ్యూరో:

- బండ్లగూడ జాగీర్ సన్‌సిటీలో నివసించే భార్యాభర్తలు ఇందిర, ఆనంద్ తమ కుమారుడు విక్కీని చంపి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ దారుణానికి కారణం ఆనంద్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి అప్పుల పాలు కావడం.
- పంచాయితీ రాజ్ శాఖలో మిషన్ భగీరథ ప్రాజెక్ట్ కీసర విభాగంలో ఏఈగా పని చేస్తున్న గద్దం రాహుల్ బాబు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై ఆ నష్టాలు పూడ్చుకోవడానికి మోసగాడిగా మారి జైలుకెళ్లాడు.
- దుండిగల్‌లోని ఏరోనాటికల్ కాలేజీలో బీటెక్ చదువుతున్న గుడిమల్కాపూర్‌కు చెందిన శీలం మనోజ్ ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడు.
- తన భర్త జానారెడ్డి ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి డబ్బు పోగొట్టుకోవడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి మన్సూరాబాద్ భవానీనగర్‌కు చెందిన వివాహిత శిరీష ఆత్మహత్య చేసుకుంది.



- స్మార్ట్ ఫోన్ వినియోగంతో పెరిగిన ఈ ధోరణి
- పందెం కోసం భారీగా నగదు చెల్లిస్తున్న వైనం
- ఆపై అప్పుల్లో మునిగిపోయి తీవ్ర నిర్ణయాలు

....గడచిన నెలన్నర రోజుల కాలంలో వెలుగులోకి వచ్చిన ఈ నాలుగు ఉదంతాలు ప్రస్తుతం సమాజంపై ఆన్‌లైన్ గేమింగ్స్ ప్రభావాన్ని చెప్పకనే చెప్తున్నాయి. ఈ గేమ్స్‌కు అలవాటుపడుతున్న వాళ్లు గెలవడానికి బానిసలుగా మారిపోతున్నారు. దీని కోసం ఆయా కంపెనీల ట్రాప్‌లో పడి వివిధ రకాలైన పాయింట్లు కొంటున్నారు. వాటిని ఖరీదు చేయడానికి, పందెం కాయడానికి అవసరమైన డబ్బు కోసం అప్పులు చేస్తున్నారు. చివరకు ఆ ఉచ్చులో పడి మోసాలు, ఆత్మహత్యల వరకు వెళ్తున్నారు.

పథకం ప్రకారం విస్తరించిన గేమ్స్...

కోవిడ్ నేపథ్యంలో దాదాపు రెండేళ్లుగా ఆన్‌లైన్ క్లాసులే నడిచాయి. దీంతో దాదాపు ప్రతి విద్యార్థి చేతికి ఫోన్, ట్యాబ్‌లు వచ్చి చేరాయి. దీన్ని క్యాష్ చేసుకోవడానికి గేమింగ్ కంపెనీలు పథకం ప్రకారం వ్యవహరించాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, లింకుల ద్వారా తమ గేమ్స్‌ను ప్రమోట్ చేశాయి. వీటికి ఆకర్షితులైన విద్యార్థులు, ఉద్యోగులు, యువత వాటిని ఇన్‌స్టాల్ చేసుకుని ఆడటం మొదలెట్టారు. ఆ తర్వాతి రోజుల్లో ఇవి ఆడటం అనేది ఓ వ్యసనంగా మారిపోయింది. ఈ గేమ్స్ అన్నీ వాటి నిర్వాహకులు రూపొందించిన ప్రత్యేక ప్రోగ్రామింగ్ ద్వారా నడుస్తుంటాయి. దీని ప్రకారం గేమ్ ఆడటం కొత్తగా ప్రారంభించిన వారి ఐపీ అడ్రస్ తదితర వివరాలను నిర్వాహకులు సంగ్రహిస్తారు. దీని ఆధారంగా తొలినాళ్లల్లో దాదాపు ప్రతి గేమ్‌లోనూ వాళ్లే గెలిచేలా చేసి తమ ముగ్గులోకి దింపుతారు. వీళ్లకి గెలుపు అనేది ఓ కిక్‌గా మారుస్తారు.

పాయింట్లు, పందేల పేరుతో..

ఇలా తమ గేమ్‌కు బానిసగా మారిన వారిని ఎంపిక చేసుకునే నిర్వాహకులు అసలు కథ మొదలెడుతున్నారు. కొన్ని రోజుల పాటు వాళ్లు ఆయా గేమ్స్‌లో ఓడిపోయేలా చేస్తారు. ఆపై గేమ్‌లో నువ్వు వీక్ అయిపోయావంటూ సందేశాలు పంపి రెచ్చగొడతారు. ఇలా తాను ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనే భావన ఆడేవారిలో కలిగిస్తారు. దీనికోసం టిప్స్ ఇస్తున్నామంటూ కొన్ని యూసీ పాయింట్లను ఉచితంగా ఇస్తారు. వీటిని వినియోగిస్తే గేమ్‌లో మీ తరపున ఆడే క్రీడాకారులు బలంగా మారి, గెలుస్తావంటూ చెబుతారు. తొలుత ఈ పాయింట్లు ఉచితమే అంటూ వాటికీ బానిసలుగా మారేలా చేస్తారు. ఆపై ఈ పాయింట్లు రావాలంటే తమకు కొంత మొత్తం చెల్లించాలంటూ వసూలు చేయడం మొదలెడతారు.

అందినకాడికి దండుకుంటారు...

కొన్ని రోజుల తర్వాత ఆ యూసీ పాయింట్లు ఉచితంగా ఇవ్వలేమంటూ మెలికపెడతారు. అవి కావాలంటే తమ వద్ద రిజిస్టర్ చేసుకుని, డెబిట్ లేదా క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేయాలని షరతు విధిస్తారు. అప్పటికే ఈ గేమ్స్‌కు బానిసలుగా మారిన వాళ్లు తేలిగ్గా వాటి నిర్వాహకుల ట్రాప్‌లో పడిపోతున్నారు. తమవి లేదా తల్లిదండ్రుల కార్డులు తీసుకుని పేమెంట్లు చేస్తున్నారు. వీటి వివరాలను ఒకసారి నమోదు చేసి, ఆ సందర్భంలో కార్డు యజమానికి వచ్చే ఓటీపీ పొందుపరిచి, ఆటో రీచార్జ్ ఎంపిక చేసుకుంటే పదేపదే కార్డుతో అవసరం ఉండదు. దీంతో అదును చూసుకుని ఈ పని చేస్తున్న యువత అనునిత్యం భారీ మొత్తం ఖర్చు చేసేస్తోంది. ఇలా మళ్లీ గెలుపు అలవాటు చేసిన తర్వాత తమ వద్ద నిర్ణీత మొత్తం పందెం కాసి గేమ్ ఆడితే... భారీ లాభాలు ఉంటాయని చెప్పే కంపెనీలు డబ్బు దండుకుంటున్నాయి. ఇలాంటి గేమ్స్‌లో తొలినాళ్లల్లో తక్కువ మొత్తం పెట్టినప్పుడు లాభం వచ్చినా...పెట్టుబడి పెరిగే కొద్దీ నష్టాలే వస్తుంటాయి. వాటిలో ప్రోగ్రామింగ్ అలా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొందరు ఆన్‌లైన్ గేమింగ్స్ కోసం యాప్స్‌లో అప్పులు తీసుకుని, ఆ భారం పెరిగిపోయి, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యల వరకు వెళ్తున్నారు.

పురుషులే ఎక్కువ..

ఇటీవల కాలంలో ఇలాంటి ‘గేమింగ్ ఉదంతాలు’ ఎక్కువగా జరుగుతున్నాయి. పురుషులతో పాటు మహిళలూ ఇలాంటి గేమ్స్‌కు బానిసలుగా మారుతున్నారు. అయితే తల్లిదండ్రుల, కుటుంబీకుల కార్డ్స్ వినియోగించి యూసీ పాయింట్లు ఖరీదు చేయడం, పందేలు కావడం వంటివి మాత్రం కేవలం పురుషులే చేస్తున్నారు. ఇప్పటి వరకు మా దృష్టికి వచ్చిన ఉదంతాలు ఈ విషయం స్పష్టం చేస్తున్నాయి. యువతులు, మహిళలు గేమ్స్ ఆడుతున్నా..డబ్బు చెల్లించాల్సి వస్తే వాటికి దూరంగా ఉంటున్నారు.

– జి.రాజేంద్రన్, సైబర్ నిపుణుడు

రెండు రోజుల్లో అత్యవసర పంపింగ్

సాగర్‌లో డెడ్‌స్టోరేజీకి నీటిమట్టం

- ఎమర్జెన్సీ పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..
- మే ఒకటి నుండి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోనూ..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి తాగు నీరు అందించే కృష్ణా, గోదావరి బేసిన్ రిజర్వాయర్లలో నీటి మట్టాలు అడుగంటడంతో డెడ్ స్టోరేజీ నుంచి అత్యవసర పంపింగ్‌కు జలమండలి సిద్ధమైంది. నాగార్జున సాగర్ జలాశయంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి అడుగు దూరంలో ఉండటంతో అత్యవసర పంపింగ్ కోసం తొలి పంప్ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ఆ తర్వాత క్రమంగా ఈ నెల15 లోపు అన్ని పంపులను ప్రారంభించనుంది. అదేవిధంగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో మే ఒకటి నుండి అత్యవసర పంపింగ్ చేపట్టాలని నిర్ణయించింది. నగరానికి ఆరు జలాశయాల నుండి మొత్తం మీద 2,602 ఎంఎల్‌డీల నీటిని తరలిస్తుండగా, అందులో నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ల నుండే 1994 ఎంఎల్‌డీలు..అంటే 75 శాతం నీటిని తరలిస్తున్నారు. ప్రధాన రెండు జలాశయాల నీటి మట్టాలు డెడ్‌స్టోరేజీకి చేరడంతో నీటి తరలింపునకు అత్యవసర పంపింగ్‌కు సిద్ధమైంది. ఈసారి డెడ్‌స్టోరేజీ పంపింగ్‌కు ఎలాంటి అటంకాలు ఏర్పడకుండా సరికొత్త బార్జ్ టెక్నాలజీ వినియోగించాలని నిర్ణయించారు. రిజర్వాయర్ల మధ్యలో తేలే ఫ్లోటింగ్ పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తోంది.

మరో అడుగుతో డెడ్‌స్టోరేజీకి..


నాగార్జునసాగర్ జలాశయం నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 511 అడుగులకు చేరింది. మరో అడుగు తగ్గితే నీటి తరలింపుపై ప్రభావం పడుతోంది. జలాశయం నీటి మట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా రావాల్సిన నీళ్ల తరలించే పరిస్థితి ఉండదు. సాగర్‌లోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్ హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటే కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోతుంది. దీంతో అత్యవసర పంపింగ్‌కు తప్పని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 133.71 టీఎంసీలు నీరు అందుబాటులో ఉండగా, 131.66 టీఎంసీ వరకు నీటి లభ్యత ఉంటుంది. డెట్ స్టోరేజీ ఉన్నా. 2.05 టీఎంసీలను నీటి వాడుకోవచ్చు. అయితే ఈ వేసవిలో మాత్రం 5.60 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి పడిపోతే అత్యవసర మోటర్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. ఈసారి కూడా వర్షాభావ పరిస్థితులతో సంబంధం లేకుండా అక్టోబర్ వరకు పంపింగ్ చేయాలని జలమండలి అధికారులు నిర్ణయించారు.

నెలాఖరు వరకు బేఫికర్

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కంటే ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు ప్రస్తుతం జలాశయంలో 7.38 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. 3.31 టీఎంసీలవరకు లభ్యత ఉటుంది. ఈ వేసవిలో నగరానికి 3.33 టీఎంసీలు అవసరం ఉంటుందని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెలాఖరు వరకు నీటి తరలింపునకు ఎలాంటి అటంకం ఉండదు. అతర్వాత డెడ్ స్టోరేజీ నుంచి పంపింగ్‌కు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు



నాగార్జున సాగర్ జలాశయం

కొత్త సంవత్సరం.. వినూత్నంగా



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఓవైపు ఓటర్ల అవగాహనకు, మరో వైపు చెత్త నిర్మూలనతో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. విభిన్నంగా నిర్వహిస్తోంది. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు బస్తీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చెత్త నిల్వ ప్రాంతాలకు (గార్బేజ్ వల్నర్ బుల్) వీడ్కోలంటూ బ్యానర్లు ఏర్పాటు చేస్తోంది. ఉగాది పండుగను పురస్కరించుకొని కొన్ని చెత్త నిల్వ ప్రాంతాల్ని పరిశుభ్రం చేసి అక్కడ ఉగాది పచ్చడి కుండను ఉంచి, పూజలు చేసి ‘ఉగాది పర్వదినం నుంచి మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా తీర్చిదిద్దుకుందాం’ అంటూ బ్యానర్లు ఏర్పాటు చేసింది. స్థానికులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించింది.

లష్కర్ జిల్లా ఏర్పాటే లక్ష్యం

- లష్కర్ జిల్లా సాధన సమితి స్పష్టీకరణ
- మహంకాళి ఆలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వరకు పాదయాత్ర

సనత్‌నగర్: ప్రత్యేక లష్కర్ జిల్లా ఏర్పాటయ్యే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ జిల్లా సిద్ధించాలని కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యులు బుధవారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ముందుగా సికింద్రాబాద్‌లోని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ముఖ్యమంత్రి, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేసినట్లు వివరించారు. జిల్లా ఏర్పాటయ్యేవిధంగా ఆశీర్వదించాలని మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవార్లను మొక్కుకున్నట్లు తెలిపారు. వచ్చేవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాధం బాల్‌రాజ్‌యాదవ్, సభ్యులు జగదీష్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్, అశోక్, సుధాకర్‌రెడ్డి, ముక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరిట రూ.10 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: ట్రేడింగ్‌లో పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ఇంజినీర్‌ను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి చెప్పిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఇంజినీర్‌కు తన టెలీగ్రాం గ్రూప్‌లో ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ మెసేజ్ వచ్చింది. అందులో బాధితుడి పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ నకిలీ ట్రేడింగ్ అకౌంట్‌ను సృష్టించారు. అనంతరం వారు బాధితుడి అకౌంట్‌లో ట్రేడింగ్ కోసం రూ. 10 వేలు పెట్టుబడి పెట్టి నమ్మించారు. అందులో లాభాలు వచ్చాయని బాధితుడకి అకౌంట్‌లో చూపించారు. అనంతరం బాధితుడికి ట్రేడింగ్ పెట్టుబడులపై ట్రెనింగ్ ఇచ్చి, తన సొంత డబ్బును పెట్టుబడి పెట్టాలన్నారు. మొదట్లో బాధితుడు కొంత డబ్బును ట్రేడింగ్ చేయగా లాభాలు వచ్చాయి. లాభాలను విత్‌డ్రా చేసుకోవడానికి మరింత పెట్టుబడి పెట్టాలని ఇతర కారణాలు చెబుతూ బాధితుడి వద్ద మొత్తం రూ. 10.59 లక్షలు కాజేశారు. అనంతరం ఆ డబ్బు సైబర్ నేరగాళ్లు సృష్టించిన నకిలీ ట్రేడింగ్ అకౌంట్ నుంచి రాకపోవడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇన్సూరెన్స్ రివార్డ్ పాయింట్స్ పేరుతో మోసం..

మరో కేసులో ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. యాక్సిక్ బ్యాంక్‌కి చెందిన ఇన్సూరెన్స్ రివార్డ్ పాయింట్స్ అంటూ సందేశం వచ్చింది. వెంటనే బాధితుడు ఆ లింక్ ను క్లిక్ చేయగా బ్యాంక్ వివరాలు ఇతర వివరాలతో పాటు ఓటీపీ వచ్చింది. బ్యాంక్‌కి చెందినది అనుకున్న బాధితుడు అన్ని వివరాలతో పాటు ఓటీపీని ఎంటర్ చేశాడు. దీంతో తన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ. 1.90 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930కి కాల్ చేయాలని ఏసీపీ సూచించారు.

కొడితే కొట్టాలి రా.. సిక్స్ కొట్టాలి..



రహమత్‌నగర్: ‘అజారన్నా.. ప్లీజ్ ఒక్క సారి మాతో క్రికెట్ ఆడన్నా అంటూ’ పిల్లలు చేసిన రిక్వెస్ట్‌కు స్పందించారు టీం ఇండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో జరుగుతున్న రంజాన్ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించేందుకు వచ్చారు. ఆ సమయంలో అక్కడే క్రికెట్ ఆడుకుంటున్న చిన్నారులు అజహరుద్దీన్‌ను చూసి తమతో కలిసి ఆడాలని కోరారు. స్పందించిన ఆయన కాసేపు వారితో సరదాగా బ్యాటింగ్ చేసి ఉత్తేజపరిచారు. అంతేగాక బాల్స్ కొనుక్కునేందుకు డబ్బులు కూడా ఇచ్చారు.

జలమండలి ఆధ్వర్యంలో 101 చలివేంద్రాల ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి తాపం వల్ల ఏర్పడే ప్రజల దాహార్తిని తీర్చేందుకు జలమండలి పలు ప్రాంతాల్లో చలివేంద్రాల్ని ఏర్పాటు చేస్తోంది. ఓఆర్‌ఆర్ పరిధిలో 70, జీహెచ్‌ఎంసీ పరిధిలో 31 చొప్పున మొత్తం 101 కేంద్రాల్ని ఏర్పాటు చేస్తోంది. వీటిలో ఇప్పటికే నాలుగు కేంద్రాలు ప్రారంభమై అందుబాటులోకి వచ్చాయి. రంజాన్ నేపథ్యంలో..మక్కా మసీదు దగ్గర వాటర్ క్యాంపులు ఏర్పాటు చేయనుంది. వాటర్ బాటిల్స్, ప్యాకెట్ల ద్వారా నీరు అందజేస్తారు. మసీదులున్న ఇతర ప్రాంతాల్లో జలమండలి ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయనుంది. చలివేంద్రాల ఏర్పాటుతో తాగు నీటితో పాటు మురుగు నీటి నిర్వహణ కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

వాహనదారులూ.. వినండహో!

సిగ్నల్ లేని జంక్షన్లలో పోలీసుల అనౌన్స్‌మెంట్లు



కళింగ కల్చరల్ సెంటర్‌లో మైక్‌సెట్‌లో వాహనదారులను అప్రమత్తం చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

బంజారాహిల్స్: సిగ్నల్ లేని జంక్షన్లు, ఐలాండ్‌ల వద్ద వాహనదారులు ఎక్కడ పడితే ఆగడంతో పాటు రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఒహిరిస్ ఐలాండ్, కళింగ జంక్షన్ వద్ద బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రకాశ్ గౌడ్ మైక్‌సెట్ ద్వారా వాహనదారులను అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చేశారు. ఈ జంక్షన్‌లో నిత్యం తెలంగాణ భవన్ వైపు నుంచి, జానారెడ్డి నివాసం వైపు నుంచి కమాండ్ కంట్రోల్ సెంటర్ వైపు నుంచి వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో కొంత మంది రోడ్డు మధ్యలో ఆగుతుండటంతో పాటు కొంత మంది తొందరగా వెళ్లాలనే ఆతృతలో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని అలాంటి వారిని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్‌ను వేగంగా ముందుకు కదిలేలా చేసేందుకు మైక్‌సెట్ అనౌన్స్‌మెంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

గోవా నుంచి ఎండీఎంఏ మాదకద్రవ్యం


నాగరాజు గౌతమ్ ఎం.భరత్ గణేష్ సాయిదిలీప్

అయిదుగురు నిందితుల అరెస్ట్

సనత్‌నగర్: గోవా నుంచి ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని నగరానికి తీసుకువచ్చిన అయిదుగురిని సైబరాబాద్ ఎస్ఓటీ రాజేంద్రనగర్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల నుంచి రూ.2 లక్షల విలువైన ఎండీఎంఏతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలేనికి చెందిన నాగరాజు బంజారాహిల్స్ సింగాడికుంటలో ఉంటూ ఈవెంట్స్‌లో డెకరేషన్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 4న నాగరాజు స్నేహితుడు దిలీప్ పుట్టిన రోజు సందర్భంగా అయిదుగురు మిత్రులు గోవాకు వెళ్లి అక్కడి బీచ్‌లో వంట మనిషిగా పని చేస్తున్న ప్రదీప్ అనే యువకుడి వద్ద నాలుగు గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేశారు. గోవా నుంచి బస్సులో ఎండీఎంఏను నగరానికి తీసుకువచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదకద్రవ్యంతో సనత్‌నగర్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా కనిపించిన నాగరాజు, అతని మిత్రులు సీహెచ్.గణేష్, ఎం.భరత్, సాయిదిలీప్, ఎం.గౌతమ్‌లను సనత్‌నగర్ పోలీసుల సహకారంతో ఎస్ఓటీ రాజేంద్రనగర్ టీమ్ అదుపులోకి తీసుకుంది. 4 గ్రాముల ఎండీఏఎం, 5 గ్రాముల గంజాయి, ఓసీబీ రోలింగ్ పేపర్లు, అయిదు సెల్‌ఫోన్లతో పాటు మొత్తం 2 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

తెలంగాణ సెయిలర్లకు 9 పతకాలు

లక్డీకాపూల్: జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ సెయిలర్లు అద్భుత ప్రదర్శన చేశారు. షిల్లాంగ్ (మేఘాలయ)లోని ఉమియం సరస్సులో జరిగిన ఈ టోర్నీలో మొత్తంగా తొమ్మిది పతకాలు నెగ్గిన తెలంగాణ ఉత్తమ సెయిలింగ్ జట్టు అవార్డును కైవసం చేసుకుంది. మేఘాలయలో తొలిసారి జరిగిన తొలి నేషనల్ ర్యాంకింగ్ ఈవెంట్ ఇదే. కొండలు, అడవుల మధ్య స్వచ్ఛమైన నీటితో నిండిన సుందర ఉమియం సరస్సులో జరిగిన పోటీలో అంచనాలు లేకుండా బరిలోకి దిగిన నల్లకుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన గోవర్ధన్ పల్లారా అండర్- 15 విభాగంలో తొలిసారి జాతీయ టైటిల్ సొంతం చేసుకున్నాడు. నగరానికి చెందిన దీక్షితను ఓడిస్తూ ఓవరాల్ స్వర్ణం పతకాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. రసూల్‌పురాలోని ఉద్భవ్ స్కూల్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు కొమరవెల్లి దీక్షిత, లహరి 2, 3వ స్థానాల్లో నిలవడంతో పాటు బాలికల స్వర్ణం, రజతాలను గెలుచుకున్నారు. ఒక జాతీయ ఈవెంట్ లో తెలంగాణకు తొలి మూడు స్థానాలు రావ డం ఇదే తొలిసారి. భారత రెండో ర్యాంకర్ బన్నీ బొంగూర్ రెండు పాయింట్ల తేడాతో పాటిగడ్డ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రిజ్వాన్ మహ్మద్‌ను ఓడించి కాంస్య పతకం సాధించాడు. అండర్ 18 డబుల్ హ్యాండర్‌లో తనుజా కామేశ్వర్- గణేష్ పీర్కట్ల రజతం సాధించారు. అండర్ 18 సింగిల్ హ్యాండర్‌లో వైష్ణవి వీరవంశం అలవోకగా స్వర్ణ పతకం గెలిచింది. ధరణి లావేటి- క్రూ మల్లేష్ రజత పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రానికి చెందిన సుహీమ్ షేక్ ఉత్తమ కోచ్‌గా ఎంపికయ్యాడు. మొత్తంగా జాతీయ సెయిలింగ్ చరిత్రలో రాష్ట్ర జట్టు అత్యుత్తమ ప్రదర్శనల్లో ఇది ఒకటిగా నిలిచింది.


ఓయూ బీఈడీ హాస్టల్ భోజనంలో బల్లి: విద్యార్థుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ బీఈడీ కాలేజీ హాస్టల్ భోజనంలో బల్లి పడటంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. బుధవారం బీఈడీ హాస్టల్ విద్యార్థులు భోజనంలోని బల్లిని తీసుకొని చీఫ్ వార్డెన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంఘటనపై హాస్టల్ వర్కర్స్ పై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నీతూబాయి కిరాణ షాపులో పట్టుకున్న గంజాయి (ఫైల్)

ఐటీ కారిడార్‌లో మత్తు దందా



- నాడు గుడుంబా నేడు గంజాయి
- యథేచ్ఛగా డ్రగ్స్, గంజాయి సరఫరా
- వలస కూలీలు, యువతే టార్గెట్
- కొందరు సెలబ్రిటీలు కూడా బాధితులే
- అవగాహన కల్పిస్తున్నా కనిపించని మార్పు
- మూడు నెలల్లో 26 కేసులు నమోదు

ఐటీ కారిడార్‌లో మాదక ద్రవ్యాల దందా కలకలం సృష్టిస్తోంది. వలస కూలీలు, యువత లక్ష్యంగా గంజాయి, డ్రగ్స్ సరఫరా యథేచ్ఛగా సాగుతోంది. సైబరాబాద్ పోలీసులు దాడులు చేసినా మత్తు పదార్థాలకు అడ్డుకట్ట పడటంలేదు. 'డ్రగ్స్ ఫ్రీ సిటీ' పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదు. పదేళ్ల క్రితం ఐటీ కారిడార్‌కు ధూల్‌పేట్ నుంచి గుడుంబా సరఫరా జరిగేది. నానక్‌రాంగూడ, ఇందిరానగర్, సిద్ధిఖీనగర్, పత్రికానగర్, చందానాయక్ తండా, గోపన్‌పల్లి గుడుంబా అడ్డాలుగా ఉండేవి. పోలీసులు ఉక్కుపాదం మోపి గుడుంబా విక్రయాలను నిరోధించారు. ప్రస్తుతం గుడుంబా స్థానంలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. నాడు నానక్‌రాంగూడ కేంద్రంగా గుడుంబా.. నేడు గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగడం గమనార్హం.

– గచ్చిబౌలి

ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పరిధిలో మూడు నెలల్లోనే 26 కేసులు నమోదయ్యాయి. వీటిలో 5 డ్రగ్స్.. 21 గంజాయి కేసులు ఉన్నాయి. బాధితులు సెలబ్రిటీల నుంచి వలస కూలీల వరకు ఉండటం గమనార్హం. ఐటీ కారిడార్ రాడిసన్ డ్రగ్స్ కేసు కలకలం రేపింది. మంజీరా గ్రూపు డైరెక్టర్ వివేకానంద తన హోటల్‌లోనే డ్రగ్స్‌పార్టీ నిర్వహించి పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసులో దాదాపు 8 మందిని గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. వివేకానంద డ్రగ్ పెడ్లర్ నుంచి అనేకసార్లు రాడిసన్ హోటల్‌లో కొకైన్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గోవా జైలులో ఉన్న ఫైజల్ తన నెట్‌వర్క్ ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఐటీ కారిడార్‌లో ఉన్న స్టార్ హోటళ్లు, పబ్‌లపై నిరంతర నిఘా చేస్తేనే డ్రగ్స్‌ను నియంత్రించేందుకు వీలుంటుంది.

కిరాణ దుకాణాల్లో కిలోలకొద్దీ..

కిరాణ దుకాణాల్లో కిలోల కొద్దీ గంజాయి, రూ.లక్షల నగదు లభించడంతో గంజాయి దందా ఎంత దర్జాగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడిన కొన్ని కుటుంబాలు గంజాయి దందాను ఎంచుకున్నట్లు సమాచారం. కిరాణ దుకాణం నిర్వహిస్తున్న నీతూ బాయి ఇంట్లో కొద్దిరోజుల క్రితం 22 కిలోల గంజాయి, రూ.22 లక్షల నగదును ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి 13 మంది వినియోగదారులను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. బాధితుల్లో వలస కూలీలు, యువకులే ఎక్కువగా ఉన్నారు. నానక్‌రాంగూడలో అనురాధ బాయి కిరాణ షాపులోనూ పోలీసులు 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీ కోసం సహకరించాలి



స్టార్ హోటళ్లు, పబ్‌లపై నిఘా ఉంచాం. డ్రగ్స్‌తో పాటు గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నా, వాడుతున్నట్లు తెలిసినా 94906 17100, 83310 13206లకు ఫోన్ చేసి చెప్పవచ్చు. సమాచారమిచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– డాక్టర్ వినీత్, మాదాపూర్ డీసీపీ

జైలుకు పంపించినా మార్పు రాలేదు..

నీతూబాయిపై 19 కేసులు నమోదయ్యాయి. గోల్కొండ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి ఆమెను జైలుకు పంపారు. జైలు నుంచి తిరిగి వచ్చిన ఆమె గంజాయి దందాను కొనసాగించడం గమనార్హం. గంజాయి విక్రయదారుల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించడంతో పాటు పూర్తి స్థాయిలో కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు పేర్కొంటున్నారు.

'సాహితీ సర్వస్వం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బంజారాహిల్స్: సాహిత్యమే తపస్సుగా ముందుకుసాగిన పోలవరపు కోటేశ్వరరావు జీవితం, సాహిత్యం నేటి తరానికి ఆదర్శనీయమని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సంపాదకత్వంలో వెలువడిన సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు 'సాహితీ సర్వస్వం' పుస్తకం రెండో భాగాన్ని బుధవారం జూబ్లీహిల్స్‌లోని దస్పల్లా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. సాధారణంగా సాహితీవేత్తలు ఒకటి, రెండు ప్రక్రియలకు మాత్రమే పరిమితమవుతారని, కోటేశ్వరరావు మాత్రం కవిత్వం, కథలు, నవల, నాటిక, సంగీతం, నృత్యం, యక్షగానం, వ్యాఖ్యానం, పరిశోధన..ఇలా అనేక విభాగాల్లో తమ కలం బలాన్ని చూపించారన్నారు. ఈ పుస్తకాన్ని చక్కగా రూపొందించి ముద్రించిన లోక్‌నాయక్ ఫౌండేషన్, రైతునేస్తం ప్రెస్ బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జంపన ప్రతాప్


రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ప్రతాప్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు, కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఖదీరవన్, ప్రమోద్‌కుమార్, రంగ రవీందర్ గుప్తా, రేపాల వెంకటేశ్వర్లు సైతం సీఎంను కలిశారు. కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మైనంపల్లి అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని వార్డుల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు ఉంటాయన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెన్నెల, పార్టీ సీనియర్ నేత మర్రి అమరేందర్‌రెడ్డి, సామల రాఘవరెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, ఆనంద్‌బాబు, దండుగుల యాదగిరి, నందకిశోర్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కిరాయి డబ్బులు అడిగితే బీరు సీసాలతో దాడి

రహమత్‌నగర్: ఆటో కిరాయి డబ్బులు అడిగినందుకు డ్రైవర్‌పై బీరు సీసాలతో దాడి చేసి గాయపర్చిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన సమాచారం మేరకు.. అల్లాపూర్‌నకు చెందిన చింటు, మల్లు, బోరబండకు చెందిన రాకేష్ మిత్రులు. మంగళవారం రాత్రి వీరు పని నిమిత్తం మొయినాబాద్‌కు వెళ్లారు. ద్విచక్రవాహనం పాడయిందని.. వాహనాన్ని బోరబండకు తీసుకెళ్లాలని అక్కడి బాలాజీ స్టీల్ షాపునకు చెందిన ట్రాలీ ఆటోను మాట్లాడుకున్నారు. రూ. 2 వేలకు కిరాయి మాట్లాడి డ్రైవర్ వికాస్‌కుమార్‌కు అడ్వాన్స్‌గా రూ.1000 ఇచ్చారు. మార్గంమధ్యలో మద్యం సీసాలను కొన్నారు. బోరబండ సైట్-3 శ్మశాన వాటికలో అర్ధరాత్రి 2 గంటలకు చేరుకుని మద్యం తాగుతున్నారు. మిగతా డబ్బులు ఇవ్వాలని వికాస్‌కుమార్ ముగ్గురు యువకులకు కోరాడు. దీంతో వారు బీరు సీసాలతో వికాస్‌కుమార్, సహాయకునిగా వచ్చిన అజయ్‌లపై దాడి పాల్పడ్డారు. గాయాలపాలైన వికాస్‌కుమార్ అదే రాత్రి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మల్లేపల్లి బడేమసీదు వద్ద ఫుట్‌పాత్‌పై మృతి చెందాడు. స్థానికులు గమనించి 100 డయల్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు కుర్తా, అదే రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. వడదెబ్బ సోకి మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు హబీబ్‌నగర్ పోలీసులను లేదా 87126 60480ను సంప్రదించాలని సూచించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి

కాచిగూడ: ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. చివరికి నయవంచన చేశాడు. యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని బుధవారం కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక కల్లు కాంపౌండ్ సమీపంలో నివాసం ఉంటున్న యువతి ప్రైవేటు ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కొన్నాళ్ల క్రితం సత్యనగర్‌లో నివాసం ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఆ ఇంటి పక్కనే ఉంటున్న అఖిల్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అఖిల్ మాయమాటలు నమ్మిన యువతి అప్పుడప్పుడు ఖర్చుల కోసం అతనికి రూ.8 లక్షల వరకు ఇచ్చింది. తనను పెళ్లి చేసుకోవాలని అఖిల్‌పై ఒత్తిడి చేయడంతో.. తన తల్లిదండ్రులు వేరే సంబంధం చూస్తున్నారని చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

హోమియోపతితో వ్యాధి నిరోధకశక్తి



- సైడ్‌ఎఫెక్ట్ లేకుండా తక్కువ ఖర్చుతో వైద్యం
- డాక్టర్ కేర్ హోమియోపతి సీఈఓ డాక్టర్ సృజన పేర్ల

లక్డీకాపూల్ : వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో హోమియోపతి వైద్యం ముందంజలో ఉంటుందని డాక్టర్ కేర్ హోమియోపతి సీఈఓ డాక్టర్ సృజన పేర్ల తెలిపారు. ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్ లేకుండా తక్కువ ఖర్చుతో హోమియోపతి వైద్యాన్ని అందించిన డాక్టర్ శామ్యూల్ హనీమన్‌కు ఎంతో రుణపడి ఉంటామన్నారు. బుధవారం డాక్టర్ కేర్ హోమియోపతి నిర్వహించిన ప్రపంచ హోమియోపతి దినోత్సవంలో డాక్టర్ సృజన పేర్ల మాట్లాడారు. అల్లోపతి వైద్య రంగంలో పట్టభద్రులైన డాక్టర్ శామ్యూల్ సైంటిఫిక్ మెథడ్‌తో హోమియోపతి వైద్యాన్ని అందించినట్లు చెప్పారు. దీర్ఘకాలిక జబ్బులతో పాటు తాత్కాలిక జబ్బులను కూడా నయం చేస్తుందని కోవిడ్ లాంటి విపత్కర సమయంలో నిరూపితమైందన్నారు. డాక్టర్ కేర్ హోమియోపతి, డాక్టర్ పాజిటివ్ హోమియోపతి వ్యవస్థాపకులు డాక్టర్ ఏఎం రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వేగవంతమైన జీవన విధానంలో ఆధునిక సమాజం తన జీవనశైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. డాక్టర్ కేర్ హోమియోపతి వైద్యులు ఫ్యామిలీ వైద్యులుగా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కేర్ హోమియోపతి, పాజిటివ్ హోమియోపతి మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్


పోలీసులు పట్టుకున్న నగదు, ల్యాప్‌టాప్‌లు

మియాపూర్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు బుకీలను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మాతృశ్రీనగర్ కాలనీలో శ్రీనిధి సర్వీస్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 505లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు చెందిన అల్లూరి త్రినాథ్ (34), మనం రాజేష్ (33), బోలే స్వామి (30), మార్పెన్న గణపతిరావు(57)లు ఐపీఎల్ బెట్టింగ్ బుకీలుగా ఉన్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ లైన్ గురు యాప్, లక్కీ ఆన్‌లైన్ యాప్ ద్వారా ఐపీఎల్ -2024 మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆ నలుగురును అదుపులోకి తీసుకుని విచారించగా గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన శాఖమూరి వెంకటేశ్వరావు అలియాస్ చిన్ను అనే వ్యక్తి వీరితో కలిసి బెట్టింగ్ ముఠాను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ.40 లక్షల నగదు, బ్యాంక్ ఖాతాలో రూ.3.57 లక్షలు, ఎనిమిది స్మార్ట్ ఫోన్లు, రెండు కీ బోర్డు ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 ట్యాబ్‌లు స్వాధీనం చేసుకున్నారు. శాఖమూరి వెంకటేశ్వర్‌రావు పరారీలో ఉన్నాడు.

వృద్ధురాలిని బెదిరించి బంగారు ఆభరణాల అపహరణ

7 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

అల్వాల్: వృద్ధురాలిని బెదిరించి బంగారు వస్తువులు లాక్కొని పారిపోయిన నిందితుడిని ఏడు గంటల్లో అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం అంజనపురి కాలనీలో 65 ఏళ్ల సుగుణమ్మ నివసిస్తోంది. ఇదే కాలనీకి చెందిన దేశమని 20 ఏళ్ల తేజ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తుంటాడు. ఒంటరిగా ఉంటున్న సుగుణమ్మ మెడలోని బంగారు గొలుసు దొంగిలించాలని పథకం వేశాడు. ఈ క్రమంలో ఆమె ఇంట్లోకి వెళ్లి రెక్కీ చేశాడు. ఈ నెల 9న మధ్యాహ్నం 1.30 గంటలకు మంచినీళ్లు కావాలని వృద్ధురాలిని అడిగాడు. మంచినీళ్లు లేవు అని ఆమె సమాధానం చెప్పినప్పటికీ బలవంతంగా తలుపు నెట్టి లోపలికి ప్రవేశించాడు. సుగుణమ్మ గొంతు అదిమిపట్టి ఆమె మెడలోని గొలుసు, చెవిదిద్దులు, బంగారు ఆభరణాలు లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదేరోజు సాయంత్రం మచ్చబొల్లారంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి రూ.1.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం జరిగిన ఏడు గంటల్లో కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్నారు. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, క్రైమ్ సిబ్బంది సుధాకర్, విద్యాకర్‌రావు, రమాకాంత్, గౌస్ పాషా, రాజశేఖర్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లో మాదాపూర్ వైపు నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి మెట్రో డివైడర్‌ను ఢీకొట్టింది. కారు నడుపుతున్న వైద్యురాలు ప్రమాదం నుంచి బయటపడింది. డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయండి



మాట్లాడుతున్న దానం నాగేందర్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశం బుధవారం బంజారాహిల్స్‌లోని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ నివాసంలో నిర్వహించారు. డివిజన్‌కు చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకాగా వారినుద్దేశించి నాగేందర్ మాట్లాడుతూ... తాను తీసుకున్న ప్రతి నిర్ణయానికి మన స్ఫూర్తిగా మద్దతునిస్తూ తన వెంట నిలుస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ తన వెన్నంటే నిలబడి తన విజయానికి కృషి చేస్తున్న జూబ్లీహిల్స్ డివిజన్ నేతలు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో కూడా అదే స్ఫూర్తిని చాటుతూ తనకు మద్దతుగా నిలబెట్టడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. వచ్చే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నేతలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించి కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మామిడి నర్సింగరావు, ఆకుల రాజు, కాటూరి రమేష్, డి.సింహం, అబ్దుల్ ఘని, వంశీ, యాదగిరి, ధనమ్మ, పద్మ, దీపాగౌడ్, కె.రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి సమష్టిగా పనిచేద్దాం



మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయానికి పార్టీ శ్రేణులు, అభిమానులు సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీని తీసుకురావాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. జూబ్లీహిల్స్ డివిజన్ బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలతో బుధవారం ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఎన్నికల రోజున, ప్రచారం సమయంలో చేపట్టాల్సిన అంశాలు, విధి విధానాలను సూచించారు. పద్మారావు విజయానికి అందరూ సమన్వయంగా ముందుకుసాగాలని, పార్టీ సిద్ధాంతాలు, గతంలో చేపట్టి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. జూబ్లీహిల్స్ డివిజన్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ మంచి మెజార్టీని నమోదు చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నేతలు పారటీ అధినేత కేసీఆర్ వెంటే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు పెరికె కిరణ్, శంకర్, కేతావత్ జ్యోతి, దీపక్, రమణమ్మ, విష్ణునాయక్, స్రవంతి, వినయ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'మోహినీభస్మాసుర' నాటక ప్రదర్శన





మోహినీభస్మాసుర నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఫిలింనగర్: ఉగాది పద్య నాటకోత్సవాల్లో భాగంగా పాత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికలు ఆకట్టుకుంటున్నాయి. ఫిలింఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో బుధవారం మోహిని భస్మాసుర పౌరాణిక పద్య నాటకాన్ని ఉషోదయ నాట్య కళామండలి రంగస్థల నటులు ప్రదర్శించారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ నాటకాన్ని కళాకారులు రక్తికట్టించారు. గయోపాఖ్యాన యుద్ధ సన్నివేశంలో శ్రీకృష్ణుడిగా బంగారు కంకణ గ్రహీత ఎం.రామలింగేశ్వరరావు, అర్జునుడిగా ఉప్పాల రాజేశ్వర్‌రావు భస్మాసురిడిగా మొగిలి పువ్వు వెంకట సుబ్బయ్య, నారదుడిగా అసోది అక్కిరెడ్డి, శంకరుడిగా కేసన నాగేశ్వర్‌రావు, విష్ణుమూర్తిగా కొప్పరపు శ్రీనివాసరావు, చిక్కాసురిడిగా ఆరాధ్యుల శ్రీనివాసరావు, డక్కాసురిడిగా మద్రివాడ సుబ్బారావు, లక్ష్మిగా సురభిజ్యోతి, మోహినిగా తిరుమలాబి బృంగీశ్వరుడిగా బొక్కసం సత్యనారాయణ అందించారు. ఈ నాటికకు హార్మోనియం సి.హెచ్.శ్రీనివాసరావు, డోలక్ బాపిరెడ్డి, ఆహార్యం వెంకటస్వామి సహకారం అందించారు. వీనుల విందుగా సాగిన ఈ నాటకాన్ని సినీ ప్రేక్షకులు, కళాభిమానులు వీక్షించి పరవశించిపోయారు.

భారత విద్యార్థులకు వరం కిర్గిస్తాన్ మెడికల్ అకాడమీ

ఎఫ్ఎంజీఈ అర్హత సాధించిన విద్యార్థుల సక్సెస్ మీట్‌లో పలువురు వక్తలు



లక్డీకాపూల్: స్వదేశంలో ఎంబీబీఎస్ సీటు రాని భారతీయ విద్యార్థులకు కిర్గిస్తాన్‌లోని కిర్గిజ్ స్టేట్ మెడికల్ అకాడమీ వరంగా మారిందని ప్రోసియం సీఈఓ డాక్టర్ జి. భాను ప్రకాష్ అన్నారు. కిర్గిస్తాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 80 శాతం విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే అర్హత సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. బుధవారం నగరంలో ఈవింగ్స్ ఎంబీబీఎస్ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ ర్పాటు చేసిన ఎఫ్ఎంజీఈ సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ... భవిష్యత్తులో 'నెక్స్' ఎగ్జామ్ విదేశాల్లో చదివిన విద్యార్థులతో పాటు ఇండియాలో ఎంబీబీఎస్ చదవబోయే విద్యార్థులు కూడా రాయాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లో సీటు రానివారికి విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం ఒక ఉత్తమమైన మార్గమని భాను ప్రకాష్ అభిప్రాయపడ్డారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్సింగ్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ.. కిర్గిస్తాన్‌లో ఎంబీబీఎస్‌తో పాటు ఎఫ్ఎంజీఈ అర్హత సాధించడానికి కావాల్సిన శిక్షణ కూడా భారతీయ అధ్యాపకులతో ఇప్పించారని, ఈ శిక్షణ తమకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో అరైజ్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.ఖలీల్ అహ్మద్, తెలంగాణ ఆర్ఎంపీ డాక్టర్స్ అసోయేషన్ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వెంకట్‌రెడ్డి, శ్రీ వశిష్ఠ గ్రూప్ జీఎం వంశీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో పాల్గొన్న డాక్టర్ మహి అత్రా..

కాచిగూడ: పౌష్టికాహారంతోనే పలు విధాలైన వ్యాధులను దూరం చేసుకోవచ్చని షెనాయ్ హాస్పిటల్స్ న్యూట్రిషన్ విభాగం హెడ్ డ్టార్ మహి అత్రా అన్నారు. ప్రపంచ ఆరోగ్యం దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బర్కత్‌పురలోని శ్రీమతి ఎ. శ్యామలదేవి డిగ్రీ కళాశాలలో న్యూట్రిషన్‌పై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటే రక్తం వృద్ధి చెందుతుందని అన్నారు. మాంసం బదులు కూరగాయలు ఎక్కువగా తినాలని, కాలానుగుణంగా లభించే పండ్లను తీసుకోవాలని, స్థానికంగా దొరికే ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. సులభంగా జీర్ణమయ్యే, సూక్ష్మపోషకాలు లభించే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. విటమిన్స్ లోపంతో కంటిచూపు మందగిస్తుందని, ఐరన్ లోపంతో రక్తహీనత, జ్ఞాపకశక్తి నశిస్తుందని, కాల్షియం లోపంతో ఎముకల పటుత్వం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి, లెక్చరర్లు దీప్తి, దీప, స్వాతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

'టికెట్ల కేటాయింపులో గౌడలను విస్మరించిన కాంగ్రెస్'

గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో బలమైన సామాజికవర్గమైన గౌడలకు పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కేటాయించకపోవడం సరైందికాదని గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అన్నారు. గౌడ సామాజికవర్గాన్ని విస్మరిస్తే తమ సత్తా చాటడం ఖాయమని ఆయన హెచ్చరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న గౌడ సామాజికవర్గం అన్ని వర్గాలతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా గౌడ సామాజిక వర్గాన్ని గుర్తించి లోక్‌సభ సీట్లు కేటాయించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లో ఇచ్చిన సామాజిక గౌరవం కాంగ్రెస్ పార్టీ పాటించాలని కోరారు.

ఉండమ్మా.. బొట్టు పెడతా..!

- తప్పకుండా ఓటు వేయండి.. మీ రాక కోసం ఎదురుచూస్తా...
- వినూత్నంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు
- పోలింగ్ శాతం తగ్గిన చోట్ల సిబ్బంది పర్యటన
- ప్రజల నుంచి విశేష స్పందన



తప్పనిసరిగా ఓటు వేయాలంటూ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 శ్రీరామ్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని, మంచి నాయకత్వం రావాలంటే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేస్తేనే సాధ్యం అవుతుందని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో చాలామంది ఇంకా వెనుకడుగు వేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు రావడానికే ఆలోచిస్తున్నారు. ప్రతిఒక్కరూ ఓటు వేసినప్పుడే సమర్థవంతమైన నాయకత్వం వస్తుందని భావిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం ఈ సారి ఓటర్లను తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి రప్పించే దిశలో చైతన్య కార్యక్రమాలకు తెరలేపింది.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఓటరు చైతన్య కార్యక్రమాలను అధికారులు ముమ్మరం చేశారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో హిమాయత్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లతో కలిపి 245 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 52.11 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. చాలాచోట్ల 40 నుంచి 42 శాతం పోలింగ్ మాత్రమే నమోదు కాగా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అక్కడే ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 34 ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లుగా గుర్తించారు.
- ఇళ్లు కదలండి.. ఓటు వేయండి.. అనే నినాదంతో జీహెచ్ఎంసీ సిబ్బంది ఓటరు చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు.



- పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతున్న బూత్‌లలో ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి తప్పనిసరిగా ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.
- ఓటు విలువపై మహిళా సమాఖ్యలు అవగాహన కల్పిస్తున్నాయి.
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని శ్రీరామ్‌నగర్ బస్తీలో జీహెచ్ఎంసీ సర్కిల్-18 యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆశావిరానిక, కమ్యూనిటీ ఆర్గనైజర్లు బుచ్చమ్మ, భావ్‌సింగ్ ఆధ్వర్యంలో రీసోర్స్ పర్సన్‌లు ఇంటింటికీ తిరుగుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు.
- ప్రతిఒక్కరూ ఓటింగ్ రోజున ఇల్లు కదిలి పోలింగ్ బూత్‌కు రావాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా పోలింగ్ నమోదైన పోలింగ్ బూత్‌లు

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-5లోని దేవరకొండ బస్తీ కమ్యూనిటీ హాల్ పోలింగ్ బూత్‌లో నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 297 ఓట్లకు గాను 269 ఓట్లు పోలయ్యాయి.
- ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ స్కూల్‌లో పోలింగ్ బూత్‌లో మొత్తం 450 ఓట్లకు గాను 391 ఓట్లు పోలయ్యాయి.
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10 ఉదయ్‌నగర్‌లోని సెయింట్ జోసఫ్ పబ్లిక్ స్కూల్‌లో మొత్తం 262 ఓట్లకు గాను 197 ఓట్లు పోలయ్యాయి.
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-13 ఇరిగేషన్ శాఖ పోలింగ్ బూత్‌లో 464 ఓట్లకు గాను 322 ఓట్లు పోలయ్యాయి.

అతి తక్కువ ఓట్లు పోలైన ప్రాంతాలివీ...

హిమాయత్‌నగర్ డివిజన్ సెయింట్ జోసఫ్ స్కూల్ పోలింగ్ బూత్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో 36.43 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది.

- వాసవీ పబ్లిక్ స్కూల్ పోలింగ్ బూత్‌లో 41 శాతం, ఖైరతాబాద్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పోలింగ్ బూత్‌లో 43 శాతం, ఇంజినీర్ ఇన్ చీఫ్ పంచాయతీ రాజ్ ఆఫీసు పోలింగ్ బూత్‌లో 38.96 శాతం, సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజ్ పోలింగ్ బూత్‌లో 40.76 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. 40 శాతానికి తక్కువగా 30 ప్రాంతాల్లో పోలింగ్ నమోదైంది.

దుకాణంలో బాలుడిని బెదిరించి డబ్బులతో పరార్

రహమత్‌నగర్: ఓ షాపులోకి చొరబడి అందులోని ఓ బాలుడిని బెదిరించి డబ్బులు తీసుకుని పారిపోయిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎస్పీఆర్ హిల్స్‌లోని రెండు బొమ్మల ప్రాంతంలో శేఖర్ అనే ప్రభుత్వ ఉద్యోగికి ఆయిల్ షాపు ఉంది. మంగళవారం మధ్యాహ్నం షాపులో శేఖర్ కుమారుడు ఉన్నాడు. ఆ సమయంలో నెంబర్ ప్లేట్ లేని వాహనంపై గుర్తు తెలియని యువకుడు వచ్చి తన కొడుకు బెదిరించి రూ. 2 వేలు తీసుకుని పారిపోయాడని శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గొడవపడిన నలుగురికి ఐదు రోజుల జైలు శిక్ష

బంజారాహిల్స్: ఇంటి ముందు రాత్రి పూట కూర్చుంటూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారంటూ జరిగిన గొడవలో బంజారాహిల్స్ పోలీసులు నలుగురు వ్యక్తులపై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని పదవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందా మురళి ఎదుట హాజరుపరిచారు. ఈ నలుగురికి న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్ష, రూ. 1050 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే కార్తీక్, చంద్రశేఖర్‌తో పాటు ఎండీ అలీ, ఎండీ సమీర్‌లు మంగళవారం రాత్రి గొడవకు పాల్పడ్డారు. ఇంటి ముందు న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారంటూ జరిగిన గొడవలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్థానికంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తూ చుట్టుపక్కల వారికి ఇబ్బందులు కలిగించారు. దీంతో పోలీసులు ఈ నలుగురిపై ఐపీసీ సెక్షన్ 323, 70 (బీ) సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి మందా మురళి ఈ నలుగురికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిక్కడపల్లి: హిందూ, ముస్లింలు తమ పండగలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం ఇక్కడ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్యతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండగల నేపథ్యంలో ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. పరిష్కారం కోసం తాము ప్రయత్నిస్తామని తెలిపారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

గతాన్ని అధ్యయనం చేస్తేనే భవిష్యత్ తరాలకు చరిత్రను అందించగలం



సదస్సుకు హాజరైన వక్తలు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చరిత్ర విభాగం, సౌత్ ఇండియన్ న్యూమిస్మాటిక్స్ సొసైటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా «న్యూమిస్మాటిక్స్-రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సౌత్ ఇండియన్ హిస్టరీ» దక్షిణ భారత న్యూమిస్మాటిక్స్ సొసైటీ 32వ వార్షిక సదస్సు బుధవారం అంబేద్కర్ వర్సిటీలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆర్కైవల్ బోర్డు సభ్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిషన్‌రావు హాజరై ప్రసంగించారు. చరిత్రకారులు చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాలంటే గతాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. ప్రతిఒక్కరిలో విజ్ఞానం ఉందని, తమలో తాము ఒక ఎన్‌సైక్లోపీడియా అని ఆయన అభిప్రాయపడ్డారు. న్యూమిస్మాటిక్స్ స్ఫూర్తికి మూలం, చరిత్ర నిర్మాణం లేదా పునర్నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని, ప్రతి చరిత్రకారుడు గత ఆవిష్కరణల ప్రాంతాలకు వెళ్లి వారి పరిశోధనలను అధ్యయనం చేయాలన్నారు. నేర్చుకోవడం అనేది రోజువారీ ప్రకియ అని, ఇది చరిత్రను అభ్యసించే ప్రతి విద్యార్థికి నిరంతర ప్రక్రియగా మారాలన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ రాజారెడ్డి ప్రాచీన చరిత్రకు శాతవాహనుల కృషిని కొనియాడారు. శాతవాహనుల కాలం నాటి విశిష్టమైన సాహిత్య రచనలు ఉన్నాయన్నారు. ప్రపంచ చరిత్రలో శాతవాహనుల స్థానాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రీస్తుపూర్వం మూడింట ఒకవంతు వాళ్లే పాలించారన్నారు. శాసనాలు, నాణేలు, సాహిత్య రచనలు తదితర వాటిని నిక్షిప్తం చేయాలన్నారు. కరీంనగర్‌లో గత 30 ఏళ్లలో రెండు శాసనాలు లభ్యం కాగా, తాజాగా 10 రోజుల క్రితం చెముక శాతవాహనుడి ఉనికి నాణేల ద్వారా గుర్తించబడిందన్నారు. కరీంనగర్‌లో 420, ఈసంపల్లిలో 10 నాణేలు లభ్యమయ్యాయని వివరించారు. శాతవాహనులు తమ నాణేలపై సిరి లేదా శ్రీని ఉంచే సంప్రదాయాన్ని కలిగి ఉన్నారని, యువ పరిశోధకులు నాణేలపై నిరంతర అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెమినార్ డైరెక్టర్ సుధారాణి, హైదరాబాద్ విశ్వ విద్యాలయం హిస్టరీ విభాగం ప్రొఫెసర్ కేపీరాము, డాక్టర్ సత్యమూర్తి, డాక్టర్ రాధాకృష్ణ, ఏవీఎన్‌రెడ్డి, వద్దానం శ్రీనివాస్, డాక్టర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ భవన్‌లో పూలే జయంతి వేడుకలు



నందగోపాల్‌ను సత్కరిస్తున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నేడు(గురువారం) విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. పూలే జయంతి ఉత్సవ కమిటీ-2024 చైర్మన్‌గా తంగెళ్లమూడి నందగోపాల్ ఎన్నికైన సందర్భంగా బుధవారం కాచిగూడలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ పూలే జయంతి వేడుకలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా పూలే చిత్రపటానికి పూలమాల వేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతి భవన్‌ను పూలే భవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, టి.రాజ్‌కుమార్, దొడ్డుపల్లి రఘుపతి, నీల వెంకటేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు

అమీర్‌పేట: సమాజంలో వైద్యరంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని వైద్యవృత్తిని వ్యాపారంగా మార్చకూడదని టీఆర్‌పీఎస్, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.వెంకట్‌రెడ్డి అన్నారు. ఈవింగ్స్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ద్వారా కిర్గిస్తాన్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి మొదటి ప్రయత్నంలోనే «ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్సింగ్» పరీక్షలో అర్హత సాధించిన వైద్యులతో బుధవారం అమీర్‌పేటలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించేందుకు ఆసక్తిని చూపాలన్నారు. ప్రజలకు సేవా చేయాలన్న దృక్పధంతో వైద్య వృత్తిని ఎంచుకునే వారు కొందరైతే డబ్బు సంపాదనే ధ్యేయంగా మరి కొందరు వైద్య వృత్తిని ఎంచుకుంటున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు వైద్యం నేటికి అందని ద్రాక్షగా మారిందని గుర్తు చేశారు. కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన 10 మంది విద్యార్థులను అభినందించారు.

రంజాన్‌కు ముస్తాబైన మసీదులు

- పటిష్ట ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- ఈద్గాల వద్ద ప్రార్థనకు వసతులు



విద్యుత్ కాంతుల్లో బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మసీదు

బంజారాహిల్స్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లోని మసీదులన్నీ విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్నాయి. గురువారం ఉదయం మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం ఇప్పటికే ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెక్లెస్ రోడ్డులోని ఈద్గాతో పాటు బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ మైదానం, ఫిలింనగర్ దర్గా ప్రాంతంలోని మైదానాల్లో ఇప్పటికే ఆయా మసీదుల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపుగా అన్ని మైదానాల వద్ద ఉదయం 9 గంటల్లోపే ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రంజాన్ ప్రార్థనల ఏర్పాట్లను పరిశీలించిన మేయర్



క్వారీ మైదానంలో పర్యటిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు

రహమత్‌నగర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రార్థనల (ఈద్-ఉల్-ఫిత్ర్) కోసం ఎస్పీఆర్‌హిల్స్‌లోని క్వారీ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రహమత్‌నగర్, బోరబండ కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, బాబాఫసియుద్దీన్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ప్రార్థనల కోసం వచ్చే ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. క్వారీ మైదానంలో రంజాన్ ప్రార్థన ఏర్పాట్ల కోసం జీహెచ్ఎంసీ ద్వారా రూ. 9 లక్షలు మంజూరు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌ల నాయకులు పాల్గొన్నారు. టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీం ఇండియా మాజీ సారథి మహమ్మద్ అజహరుద్దీన్, తెలంగాణ క్రీడా విభాగం చైర్మన్ అసదుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

మరోసారి మోదీ నాయకత్వాన్ని బలపర్చండి: కిషన్‌రెడ్డి



ఇందిరానగర్‌లో పాదయాత్ర చేస్తున్న కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి ప్రజలంతా ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలని.. భారీ మెజార్టీతో తనను గెలిపించాలిన కేంద్ర మంత్రి, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థి కిషన్‌రెడ్డి కోరారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్, గాయత్రీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఓటర్లను కలుసుకొని తనకు ఓటు వేసి భారీ మెజారీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో యువకులపై దాడి

వెంగళరావునగర్: రెండు వేర్వేరు ఘటనల్లో అకారణంగా యువకులపై కొందరు దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే సాయికుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి తన స్నేహితులు తరుణ్, సంజయ్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎస్ఆర్‌నగర్ వైపు వెళుతున్నారు. కమాన్‌గల్లీ వద్దకు రాగానే అకస్మాత్తుగా గుర్తు తెలియని వ్యక్తి హెడ్‌ఫోన్ పెట్టుకుని వేగంగా వారి వైపు వచ్చాడు. దాంతో వీరు అరేయ్ సరిగ్గా డ్రైవ్ చేయమని అరిచారు. దాంతో ఆ వ్యక్తి స్నేహితులతో కలిసి వచ్చి ముగ్గురు స్నేహితులను కొట్టారు. దాడి చేసిన వారు పి.సందీప్, షోయబ్‌ఖాన్, అబ్దుల్ అహ్మద్‌గా గుర్తించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

- ఎల్లారెడ్డిగూడలో ఉండే ఎం.సాయిరామ్ డైలీ లేబర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 9న తన స్నేహితుడు నితీష్‌తో కలిసి కీర్తి అపార్ట్‌మెంట్ వెనుక కూర్చుని మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో వివేక్ అనే వ్యక్తి మద్యం సేవించి వెళ్తున్నాడు. తనను చూసి నవ్వుతున్నారని అనుకుని రాయి తీసుకుని వారివైపు విసిరాడు. దాంతో వివేక్ తండ్రి వేణు, స్నేహితుడు సందీప్‌లు కత్తులు తీసుకుని సాయిరామ్ ఇంటికి వచ్చి బెదిరించాడు. ఆ సమయంలో సాయి సోదరుడు రవి వారి చేతిలోని కత్తి లాక్కుని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ రెండు కేసులను పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక నృత్యాలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను కాలనీ 4వ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆహుతులను అలరించాయి. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకలకు సరోజినీదేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జెక్‌కాలనీ మాజీ అధ్యక్షుడు సీహెచ్.అనంతరెడ్డి, నంది అవార్డు గ్రహీత ఇనగంటి లావణ్య, మోడల్‌కాలనీ ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర్ చందులు అతిథులను సన్మానించారు. కాగా చిన్నారులకు జ్ఞాపికలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. కాలనీ ప్రతినిధులు సురేష్‌గౌడ్, నాగిరెడ్డి, భాషా, శివారెడ్డి, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రావు, డీఎస్‌రావు, విశ్వనాథరాజు, ప్రసాదరాజు, లక్ష్మారెడ్డి, సునీల్ తదితరులున్నారు.

క్లుప్తంగా...

'ఏబీ' సాక్షులను బెదిరిస్తున్నారు

- ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారు
- ఏబీ వెంకటేశ్వరరావు పిటిషన్‌పై క్యాట్‌లో ఏజీ శ్రీరామ్ వాదనలు
- తదుపరి విచారణ 16కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వెంట్ హోదాలో ఉన్న ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు.. ప్రభుత్వానికి, ఇతర ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా ఆరోపణలు చేయడంతోపాటు, ఆయనపై దాఖలైన కేసులో సాక్షులను బెదిరించే ప్రయత్నం చేశారని ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈ మేరకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్, జీపీ పాండురంగారెడ్డి వాదించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇజ్రాయిల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చినట్లు ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. అనంతరం సస్పెన్షన్ పూర్తయ్యాక ఏబీ విధుల్లో చేరారు. విధుల్లో చేరాక ఏబీ వెంకటేశ్వరరావు తన అధికారాన్ని అడ్డు పెట్టుకుని ట్యాపింగ్ కేసులో సాక్షులను బెదిరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మరోసారి ఆయన సస్పెండ్ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఏబీ గతేడాది ఏప్రిల్‌లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై క్యాట్ బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. ఏజీ వాదనలు విన్న బెంచ్.. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.


ఏపీలో గ్రూప్-2 ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి: ఏపీలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమ్స్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) బుధవారం విడుదల చేసింది. గత ఏడాది డిసెంబర్ 7న ఏపీపీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేయగా.. 4,83,525 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 25న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు 4,04,039 మంది (87.17 శాతం) హాజరయ్యారు. ఏపీపీఎస్సీ డిసెంబర్ 7న 897 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం 8 పోస్టులు కలపడంతో మొత్తం పోస్టుల సంఖ్య 905కి పెరిగాయి. పెరిగిన పోస్టుల ఆధారంగా మెయిన్స్‌కు మొత్తం 92,250 మందిని ఎంపిక చేశారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను జూలై 28న నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ ప్రకటించింది.

బాబుకు 'ఈడీ' వేడి

కేజ్రీవాల్ కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పుతో ముచ్చెమటలు

- అక్రమ నిధులు పొందే పార్టీలపై ఈడీ కేసులకు కోర్టు గ్రీన్‌సిగ్నల్
- సంబంధిత పార్టీ అధ్యక్షుడే అందుకు బాధ్యుడు.. ఢిల్లీ మద్యం కేసు తరహాలోనే ఏపీలో స్కిల్ స్కామ్
- హవాలా మార్గంలో టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు..
- పూర్తి ఆధారాలతో ఈడీకి ఇప్పటికే నివేదించిన 'సిట్'



సాక్షి, అమరావతి: మద్యం కుంభకోణంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిస్తోంది! హవాలా మార్గంలో అక్రమ నిధులు పొందే రాజకీయ పార్టీలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అందుకు సంబంధిత పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలని తేల్చి చెప్పింది. మద్యం కుంభకోణం ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ అక్రమంగా నిధులు పొందినట్లు ఆధారాలున్నందున ఆ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్‌పై ఈడీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం సరైనదేనని పేర్కొంది. ఈ కేసులో హవాలా మార్గంలో ఆమ్ ఆద్మీ పార్టీకి నిధులు చేరిన తరహాలోనే చంద్రబాబు హయాంలో స్కిల్ స్కామ్ ద్వారా కొల్లగొట్టిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి చేరినట్లు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధారాలతో సహా వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెండు కేసుల మధ్య చాలా సారూప్యతలున్నాయి. ఇప్పటికే స్కిల్ కుంభకోణంపై షెల్ కంపెనీలను విచారిస్తున్న ఈడీ ఇక చంద్రబాబును కూడా బోనెక్కించే అవకాశాలున్నాయి.

'ఆప్' చేతికి రూ.50 కోట్లు

ఢిల్లీలో మద్యం కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన నిధులను షెల్ కంపెనీల ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి మళ్లించినట్లు ఈడీ నిర్ధారించింది. 2022లో గోవా ఎన్నికల సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులకు హవాలా మార్గంలో రూ.50 కోట్లు చేరినట్లు ఆధారాలతో తేల్చింది. ఈ మేరకు గోవాలో ఆప్ వ్యవహారాలను పర్యవేక్షించిన ఓ అభ్యర్థి వాంగ్మూలం కూడా ఇవ్వడం గమనార్హం.

కేజ్రీవాలే బాధ్యత వహించాలి

మద్యం కుంభకోణంపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన ఈడీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టులో ఈ కేసు విచారణ సందర్భంగా మంగళవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ 70 ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ, పార్టీ అధ్యక్షుడుగా ఉన్న కేజ్రీవాల్ దీనికి బాధ్యత వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 2(ఎఫ్) ప్రకారం రాజకీయ పార్టీ అంటే కొందరు వ్యక్తులతో కూడిన సంఘం. కంపెనీల చట్టం ప్రకారం ఓ కంపెనీ అంటే కొందరు వ్యక్తులతో కూడిన సముదాయం. రెండు వేర్వేరు చట్టాల ద్వారా నమోదైన రాజకీయ పార్టీ, కంపెనీల నిర్వచనం మాత్రం ఒకటే. కాబట్టి అక్రమ నిధులు పొందిన ఓ కంపెనీపై ఈడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లుగానే అక్రమంగా నిధులు పొందిన రాజకీయ పార్టీపై కూడా అదే విధంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయవచ్చు' అని న్యాయమూర్తి ప్రకటించారు. 'మద్యం కుంభకోణం ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ అక్రమంగా నిధులు పొందినట్టు ప్రాథమిక ఆధారాలున్నాయి. ఆ పార్టీకి జాతీయ సమన్వయకర్త (అధ్యక్షుడు)గా ఉన్న కేజ్రీవాలే అందుకు బాధ్యత వహించాలి. ఆయనపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయవచ్చు. ఆయన అరెస్ట్ సరైనదే' అని తీర్పులో పేర్కొన్నారు.

ఇక బాబుపై ఈడీ కొరడా!

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి సిట్ పూర్తి ఆధారాలను ఈడీకి అందచేసింది. షెల్ కంపెనీల ద్వారా హవాలా మార్గంలో నిధుల తరలింపుపై కేసు నమోదు చేసిన ఈడీ ఈ ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగిందని నిర్ధారించింది. ఇప్పటికే సుమన్ బోస్ (సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ), వికాస్ ఖన్విల్కర్ (డిజైన్ టెక్ కంపెనీ ఎండీ), ముకుల్‌చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ కంపెనీ ప్రతినిధి), సురేశ్ గోయల్ (చార్టెడ్ అకౌంటెంట్)లను అరెస్టు చేసింది. డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌తోపాటు నలుగురిని అరెస్ట్ చేసింది. డిజైన్‌టెక్ కంపెనీకి చెందిన రూ.31.32 కోట్ల బ్యాంకు ఖాతాలను జప్తు చేసింది. ఈ కేసులో ఆ కంపెనీ ఆస్తులను జప్తు చేయడం సరైన చర్యేనని ఏపీ హైకోర్టు కూడా సమర్థించింది. తాజాగా ఢిల్లీ హైకోర్టు తీర్పు నేపథ్యంలో హవాలా మార్గంలో టీడీపీ ఖాతాల్లో చేరిన అక్రమ నిధులపై ఈడీ దృష్టి సారించాల్సి ఉంది. తాజా తీర్పు ప్రకారం రాజకీయ పార్టీ ఖాతాలో చేరే అక్రమ నిధులకు సంబంధిత పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలి. అంటే టీడీపీ అధ్యక్షుడుగా ఉన్న చంద్రబాబే నిందితుడు అన్నది సుస్పష్టం. ఈ క్రమంలో ఆయన్ని ఈడీ అరెస్ట్ చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది. ఇదే విషయాన్ని పలువురు న్యాయ నిపుణులతో పాటు సిట్ కూడా ఈడీ దృష్టికి తీసుకెళ్లనుంది.

స్కిల్ స్కామ్‌లో టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు

బాధ్యత వహించాల్సింది చంద్రబాబే

చంద్రబాబు హయాంలో స్కిల్ స్కామ్‌లో కొల్లగొట్టిన నిధులు హవాలా మార్గంలో టీడీపీ ఖాతాల్లోకి చేరడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జర్మనీలోని సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ప్రాజెక్టు అంటూ నిధులు కొల్లగొట్టారు. నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేసిన రూ.371 కోట్లలో షెల్ కంపెనీల ద్వారా రూ.241 కోట్లు చంద్రబాబు బంగ్లాకు చేర్చిన అవినీతి నెట్‌వర్క్ గుట్టును సిట్ బయట పెట్టింది. అందులో రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు పక్కా ఆధారాలతో గుర్తించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నాలుగు బ్యాంకుల్లో టీడీపీ పేరిట ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ.65,86,47,510 మళ్లించారు. జూబ్లీహిల్స్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో టీడీపీకి మూడు ఖాతాలున్నాయి. వాటిల్లో వరుసగా రూ.4,81,60,587, రూ.25,31,31,352, 2,26,28,500 చొప్పున జమ చేశారు. జూబ్లీహిల్స్‌లోని యూనియన్ బ్యాంక్ ఖాతాలో రూ.33,47,27,071 డిపాజిట్ చేశారు. 2016 నవంబరు నుంచి 2017 జనవరి మధ్యలో రూ.500, రూ.వేయి నోట్లను కట్టల రూపంలో తరలించి ఈ అక్రమ నిధులను జమ చేశారు. విస్తుపోయే విషయం ఏమిటంటే.. ఆ నిధులు తమకు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయన్నది టీడీపీ వెల్లడించకుండానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కేంద్ర ప్రభుత్వం 2016 నవంబరులో పెద్ద నోట్ల రద్దును ప్రకటించింది. ప్రజలు, సంస్థల దగ్గర ఉన్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు అనుమతించింది. ఆ సమయంలో టీడీపీ బ్యాంకు ఖాతాల్లో భారీగా నిధులను జమ చేశారు. భారీ డిపాజిట్లకు సంబంధించి ఆదాయ మార్గాలు వెల్లడించాల్సి ఉండగా టీడీపీ ఖాతాల్లోకి ఏకంగా రూ.65.86 కోట్లు జమ కావడం గమనార్హం. నోట్ల డిపాజిట్ సమయంలో 'పే-స్లిప్'లో ఆ నిధులు ఎలా వచ్చాయనే విషయాన్ని తప్పనిసరిగా పేర్కొనాలి.

ప్రాచీన కాలం నుంచీ ఆక్యుపంచర్

దీనితో సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు: ఆక్యుపంచరిస్టు కాపర్తి జనార్దనచారి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆక్యుపంచర్ వైద్యాన్ని అందిస్తున్న కాపర్తి జనార్దనచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): మారిన జీవనశైలితో ఎన్నో అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయని, దీర్ఘకాలిక రోగాలు, మందులతో సహజీవనం చేయాల్సి వస్తోందని.. ఇలాంటి సమయంలో ఆక్యుపంచర్ విధానంతో ఆరోగ్యం సమకూరుతుందని ప్రముఖ ఆక్యుపంచరిస్టు కాపర్తి జనార్దనచారి పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను కూడా నయం చేయడానికి ఆక్యుపంచర్ విధానం దోహదం చేస్తుందన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలో ఆక్యుపంచర్ చికిత్సలు అందిస్తున్న ఆయన దీని గురించి వివరాలు వెల్లడించారు.

మన దేశంలోనూ మూలాలు..

ఆక్యుపంచర్ వైద్యాన్ని చైనా బాగా అభివృద్ధి పరిచి ప్రపంచానికి పరిచయం చేసిందని, అందుకే ఇది చైనా వైద్యమనే భావన ఉందని జనార్దనచారి చెప్పారు. కానీ ఈ వైద్యం మూలాలు మన దేశంలోనూ ఉన్నాయని.. సుచివైద్యం, మర్మ చికిత్స వంటి పేర్లతో ప్రాచీన కాలంలో అమల్లో ఉందని వివరించారు. నిజానికి రోగాలను తగ్గించే శక్తి శరీరానికే ఉంటుందని.. ఆ శక్తి సన్నగిల్లినప్పుడు వ్యాధులు విజృంభిస్తాయని పేర్కొన్నారు. ఆక్యుపంచర్ ద్వారా శరీరంపై నిర్దేశిత భాగాల్లో ప్రేరేపితం చేస్తే.. రోగ నిరోధక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందన్నారు. ఈ విధానంలో వైద్యులు నాడీ పరీక్ష ద్వారా రోగ నిర్ధారణ చేస్తారని.. శరీరంలోని ఎక్కడ సమస్య ఉందో తెలుసుకుని, అందుకు తగినట్టుగా సూదులతో చికిత్స చేస్తారని వివరించారు. వీటిని చర్మం పైపొరల్లో నే వేస్తారని.. రక్తనాళాలు, నరాలు, ఎముకలకు తాకే విధంగా ఉండదని వెల్లడించారు.

శరీరంలో పాజిటివ్ మార్పులు..

ఆక్యుపంచర్ విధానం వల్ల శరీరంలో అనేక సానుకూల మార్పులు వస్తాయని జనార్దనచారి తెలిపారు. "దీనితో రక్త ప్రసరణ పెరుగుతుంది. హార్మోన్లు బ్యాలెన్స్ అవుతాయి. మందగించిన ఆకలి పెరుగుతుంది. శరీరం వ్యర్థాలను తొలగించుకునే శక్తిని సంతరించుకుంటుంది. ఆక్యుపంచర్‌తో నొప్పులు, నరాలు, ఎముకలు, శ్వాస సంబంధ, చర్మ, ఉదర సంబంధ సమస్యలు, పునరుత్పత్తి సంబంధ సమస్యలు, థైరాయిడ్, మధుమేహం వంటివాటికీ పరిష్కారం ఉంటుంది. మానసిక సమస్యలనూ తగ్గిస్తుంది.." అని పేర్కొన్నారు. ఈ విధానంలో ఖర్చు చాలా తక్కువని, చికిత్స ప్రభావవంతంగా ఉంటుందని చెప్పారు.

పవన్ అనుచిత వ్యాఖ్యలపై ఈసీ కన్నెర్ర

- సీఎం జగన్‌ను స్కామ్‌స్టర్, ల్యాండ్ గ్రాబర్, శాండ్ అండ్ లిక్కర్ ఎంపరర్ అంటూ చేసిన విమర్శలపై స్పందన
- 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ముకేశ్‌కుమార్ మీనా ఆదేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి స్కామ్‌స్టర్, ల్యాండ్ గ్రాబర్, శాండ్ అండ్ లిక్కర్ ఎంపరర్ అంటూ ఈ నెల 7న అనకాపల్లి వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. వ్యక్తిత్వ హననం చేస్తూ.. రెచ్చగొట్టేలా ఉన్న ఈ తరహా వ్యాఖ్యలు ఎన్నికల సంఘం నియమావళిని ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా బుధవారం నోటీసులు జారీ చేశారు. ఆ వ్యాఖ్యలపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని పవన్ కళ్యాణ్‌ను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌పై అనకాపల్లి వారాహి యాత్రలో పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ నెల 8న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు.

ఏపీలో నేడు, రేపు వడగాడ్పులు!

నేటి నుంచి తేలిక పాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. అయితే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. నిన్న మొన్నటి వరకు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. అయితే బుధవారం గరిష్టంగా 42 డిగ్రీలకు మించలేదు. మరోవైపు గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉత్తర కోస్తాలోను, శుక్రవారం నుంచి రాయలసీమల్లో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం వెల్లడించింది. దక్షిణ కోస్తాలో మాత్రం పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది.

15, 16 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి సదస్సు



హిమాయత్‌నగర్: మత రాజకీయాలు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, యువతపై ప్రభావం, ప్రస్తుత రాజకీయాలు తదితర అంశాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పేర్కొంది. ఈ నెల 15, 16 తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో రెండు రోజుల పాటు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర స్థాయి కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో కన్వెన్షన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ... యువజన రంగంపై పాలకులు కనబరుస్తున్న వివక్షపై ఈ కన్వెన్షన్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం దేశంలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ కన్వెన్షన్ ప్రాముఖ్యతను సంతరించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి కన్వెన్షన్‌కు అన్ని జిల్లాల నుండి యువజన ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

14న హెరిటేజ్ వాక్!

సాక్షి, సిటీబ్యూరో: స్మారక చిహ్నాలు, ప్రదేశాల పరిరక్షణ కోసం ఏప్రిల్ 14న ఉదయం 7 గంటలకు చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ నగరం ప్రాముఖ్యత, గొప్పతనం, వ్యక్తిగత పరిశీలన వంటి అంశాలను ఈ సందర్భంగా నేటి యువతరానికి పరిచయం చేయనున్నట్లు తెలిపింది.

మే 16 నుంచి ఓయూ డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో మే 16 నుంచి డిగ్రీ సెమిస్టర్ ప్రారంభం కానున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు బుధవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల రెగ్యులర్‌లతో పాటు బ్యాక్‌లాగ్, వన్‌టైం ఛాన్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల టైం టేబుల్ పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు.

నగర వార్తలు

100 శాతం ఓటింగ్ లక్ష్యం

- విస్తృతంగా అవగాహన.. ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లా పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. వందశాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. బుధవారం బుద్ధ భవన్‌లో ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం కన్నా తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రానున్న 25 రోజుల పాటు 'స్వీప్' కార్యక్రమాలు విస్తృతం చేయాలని, అందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, రోజువారీగా వివిధ వర్గాల ప్రజలతో పలు రకాల కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ బూత్ స్థాయిలోని సంబంధిత అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్లను చైతన్యపరచాలన్నారు. అందుకు తగిన మైక్రోప్లానింగ్ సిద్ధం చేయాలన్నారు. మహిళా సంఘాల సహకారంతో ఇంటింటికీ తిరిగి ఓటరు కార్డు చూసి ఓటు ఎక్కడ ఉంది, తాజా జాబితాలో పేరున్నదీ లేనిదీ చెక్‌చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలను ఏఆర్‌ఓలు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలన్నారు.

అడుగడుగునా చైతన్య కార్యక్రమాలు

అన్ని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్, టూరిజం ప్రాంతాలు, రిలీజియస్ ప్లేసెస్, బస్సు షెల్టర్లు, ప్రధాన కూడళ్లలో, ఎగ్జిబిషన్లు జరిగే స్థలాల్లో, అన్ని మార్కెట్ యార్డులలో, పబ్లిక్ పార్కులు, బస్టాండ్లలో, రెస్టారెంట్లలో ఓటర్లకు అవగాహన కలిగేలా వాల్‌పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాటిల్లో ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాల్సిందిగా, పోలింగ్ తేదీ మే13న ఓటు వేయాల్సిందిగా కోరాలని పేర్కొన్నారు. కళాశాలల్లోనూ వీటిని ఏర్పాటు చేయాలన్నారు. ఇంకా, స్వచ్ఛ ఆటోలు, ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ అంబ్రెల్లాలపై ఓటు వేయాల్సిందిగా కోరుతూ ఆడియో రికార్డింగ్ చేసి అనౌన్స్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఓటు ప్రాధాన్యం, ఓటు హక్కు వినియోగించుకోవడంపై వివిధ పోటీలు, మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా రేడియో జాకీస్, ఫోన్ రింగ్ టోన్స్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఎన్జీఓలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.ఓటరు సమాచార స్లిప్పులను ఓటర్లకు తప్పనిసరిగా అందించి ,ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్, ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి, సికింద్రాబాద్ అసెంబ్లీ కంటోన్మెంట్ ఏఈఆర్ఓ ఆకాష్, ఏఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

15న స్వాలోయింగ్ ది నేషన్ పుస్తకావిష్కరణ



బాబీ కాందారియా

పంజగుట్ట: ఐక్యరాజ్య సమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్, మహిళా విభాగం మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ లక్ష్మీ మురుడేశ్వర్ పూరీ రచించిన 'స్వాలోయింగ్ ది నేషన్' పుస్తకాన్ని ఈ నెల 15న తాజ్‌కృష్ణాలో ఆవిష్కరించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు బాబీ కాందారియా తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సివిల్‌సర్వీసెస్ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న లక్ష్మీ తన కార్యనిర్వాహణ అనుభవాలతో ఇప్పటికే పలు పుస్తకాలు రచించారన్నారు. ఆయా పుస్తకాలు సమాజంలో స్ఫూర్తిని రగిలించేవిగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 15వన తాజ్‌కృష్ణా బాల్‌రూమ్‌లో జరిగే పుస్తకావిష్కరణకు అపోలో ఆసుపత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభ ఖైతాన్ ఫౌండేషన్, కితాబ్ నిర్వహిస్తున్నాయని పుస్తక ప్రియులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

17న పుత్రకామేష్టి యాగం

లక్డీకాపూల్: నవమితో పాటు పుష్యమీ నక్షత్రం కలిసివస్తున్న ఈనెల 17న మెదక్ జిల్లా, నర్సాపూర్‌లో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకులు సత్యవీర్ గురూజీ తెలిపారు. మారిన జీవన విధానాలతో సంతానలేమి సమస్యగా మారిన నేపథ్యంలో సంతానం లేని దంపతుల కోసం పుత్ర కామేష్టి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు తమ వివరాలను 9248828666 లేదా 7981750006 నెంబర్లలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

పూలే స్మృతి వనం ఏర్పాటు చేయాలి

ప్రభుత్వానికి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి



కాచిగూడ: మహాత్మా జ్యోతిబాపూలే బడుగు, బలహీనవర్గాల చైతన్యం కోసం జీవితాంతం కృషి చేశారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదెకరాల్లో పూలే స్మృతి వనం, 200 అడుగుల ఎత్తులో విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏటా ప్రభుత్వమే అధికారికంగా పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించాల్సి ఉండగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసారి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూలే ఆశయ సాధనకు అందరూ పునరంకితం కావాలన్నారు.

జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఉత్సవ కమిటీ -2024ని ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా తంగెళ్లమూడి నందగోపాల్, వైస్ చైర్మన్‌గా వేముల రామకృష్ణ, కో-ఆర్డినేటర్‌గా టి.రాజ్ కుమార్, కన్వీనర్‌గా దొడ్డుపల్లి రఘుపతిలను ఎన్నుకున్నారు.

22 నుంచి మాస్టర్ చెఫ్ కాంటెస్ట్

- ఇంటి వంటకు ఇంటర్నేషనల్ గుర్తింపు..
- ప్రొఫెషనల్స్ కాకుండా గృహిణులు, ఉద్యోగులకు ప్రత్యేకం



సాక్షి, సిటీబ్యూరో: ప్రాంతీయ రుచులకు పట్టం గడుతూ ఇంటి వంటకు ఇంటర్నేషనల్ గుర్తింపే లక్ష్యంగా మాస్టర్ చెఫ్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన ప్రముఖ చెఫ్స్ తెలిపారు. నిర్వాహక సంస్థ సోనీలివ్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీరు మాట్లాడుతూ ఇప్పటిదాకా హిందీలో చిన్న తెరకు పరిమితమైన ఈ సూపర్ హిట్ కాంటెస్ట్‌ను ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు తీసుకువచ్చామని, ఈ నెల 22 నుంచి సోనీలివ్ (ఓటీటీ) వేదికగా ఈ కార్యక్రమం 7 వారాల పాటు కొనసాగనుందన్నారు. ఔత్సాహికులకు తప్ప ప్రొఫెషనల్స్‌కు చోటు లేని ఈ పోటీలో ప్రాంతీయ వడపోత అనంతరం ముంబైలో జరిగే ఫైనల్స్‌లో విజేతను ఎంపిక చేసి రూ.10 లక్షల నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చెఫ్స్ సంజయ్ తుమ్మ, చలపతిరావు, నిఖితా ఉమేష్ పాల్గొన్నారు.

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయి



డాక్టర్ వరప్రసాద్‌రెడ్డికి పురస్కారాన్ని అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పురస్కారాలు సమాజంలో బాధ్యతను పెంచడంతో పాటు మరికొంత మందికి స్ఫూర్తిని కలిగిస్తాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఇటీవల పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న విశిష్ట వ్యక్తులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..... శ్రీ క్రోధినామ సంవత్సరం ప్రజలందరికి మేలు జరగాలని ఆకాంక్షించారు. వివిధ రంగాలల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి వారికి పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి, శాంతా బయోటిక్ అధినేత పద్మభూషణ్, డాక్టర్ కేవీ.వరప్రసాద్‌రెడ్డి, శ్రీ డెవలపర్స్ ఎండీ బోగరాజు మూర్తి, కిన్నెర వ్యవస్థాపక కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలను ప్రోత్సహించాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న

ఎల్‌బీనగర్: రక్తదాతలు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్న సంస్థలను ప్రోత్సహించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న అన్నారు. బుధవారంతలసేమియా బాధితుల కోసం మదర్‌థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, సాహెబ్‌నగర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో యువకులు స్థానికులు రక్తదానం చేశారు. వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ తలసేమియా బాధితులకు సకాలంలో రక్తం అందకపోవడం వల్ల దేశంలో ప్రతిరోజు 12వేల మంది చనిపోతున్నారన్నారు. రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన శంకర్‌ను అభినందించారు. శంకర్ చేస్తున్న సేవలు మరువలేనివని , కరోనా లాక్ డౌన్ సమయంలోనూ పేదలకు నిత్యావసరాలు పండ్లు, మందులు పంపిణీ చేశారన్నారు. శంకర్ తన సేవలను ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి సొసైటీ అధ్యక్షులు శంకర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆకృతి సంస్థ చైర్మన్ ఆకృతి సుధాకర్, గంగం శివశంకర్, బోడ రాజశేఖర్, నిమ్స్ సూపరింటెండెంట్ యాదయ్య, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు పెంటపాటి కృష్ణఆదిశేష, పి.జగన్ మోహన్, రాజు, కే.రమేశ్‌నాయుడు, చేపూరి సునీత, గంజి వెంకటేశం, చైతన్య, అర్జున్, వైద్య సిబ్బంది అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, అనురాధ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

కాకి లెక్కలు కుదరవ్!

మార్గదర్శికి తేల్చి చెప్పిన 'సుప్రీంకోర్టు'

- డిపాజిటర్లకు పూర్తిగా చెల్లించేశామన్న రామోజీ
- తమ ఆడిటర్లు లెక్కలు తేల్చేశారంటూ వాదన
- మీ సొంత ఆడిటర్లు చెబితే చెల్లదు..
- అది ధ్రువీకరించాల్సింది రెండు రాష్ట్ర ప్రభుత్వాలేనన్న సుప్రీం
- బహిరంగ నోటీసు ఇవ్వనున్న ఇరు ప్రభుత్వాలు
- డిపాజిటర్ల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు సన్నద్ధం



సాక్షి, అమరావతి: 'నేరం నాదే..! దర్యాప్తు నాదే..! తీర్పూ నాదే..!' అంటూ మొండికేస్తున్న ఈనాడు రామోజీకి సుప్రీంకోర్టు గట్టి మొట్టికాయలు వేసింది. ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా సేకరించిన డిపాజిట్లను తిరిగి డిపాజిట్‌దారులకు చెల్లించేశామని, తమ ఆడిటర్లు ఈ లెక్కలు తేల్చేశారంటూ నమ్మబలుకుతున్న మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చింది. ఆ విషయాన్ని నిర్ధారించాల్సింది మార్గదర్శి ఆడిటర్లు కాదని, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ధ్రువీకరించాలని తేల్చి చెప్పింది. దీంతో రామోజీ గొంతులో పచ్చి వెలగకాయ పడింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు బహిరంగ ప్రకటన జారీ చేసి అభ్యంతరాలు స్వీకరణకు సన్నద్ధం కానుండటం రామోజీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

చెల్లించేశాం.. లెక్క తేల్చేశాం: రామోజీ వితండవాదం

ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన కేసులో చెరుకూరి రామోజీరావు అడ్డగోలు వాదనలు సుప్రీంకోర్టులో ఫలించలేదు. 2023 జూన్ 30 నాటికి 1,247 మంది డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని, కేవలం రూ.5.31 కోట్లు మాత్రమే అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్నాయని ఆయన న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. ఈ విషయాన్ని మార్గదర్శి ఫైనాన్సియర్స్ **ఆడిటర్లు క్షుణ్ణంగా ఆడిట్ చేసి నివేదిక సమర్పించారని, అన్ని లెక్కలు సరిపోయాయని చెప్పుకొచ్చారు. అందువల్ల మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్‌దారులు, చెల్లింపుల వివరాలను వెల్లడిం**చాల్సిన అవసరం లేదని వితండవాదం చేశారు. తద్వారా మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో అక్రమంగా డిపాజిట్ చేసినవారి పేర్లు, ఆ డిపాజిట్ మొత్తాల వివరాలు బయటకు రాకుండా చేసేందుకు రామోజీ ప్రయాస పడ్డారు. అక్రమ డిపాజిట్ల వెనుక భారీగా నల్లధనం దాగి ఉండటమే దీనికి కారణం.

అదేం కుదరదు... నిగ్గు తేలాల్సిందే..

రామోజీ తరఫు న్యాయవాదుల వాదనలను సుప్రీం కోర్టు కొట్టిపారేసింది. 'డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని మీరు చెబితే సరిపోదు. మీ దగ్గర పని చేసే ఆడిటర్ల నివేదికను పరిగణలోకి తీసుకోలేం' అని స్పష్టం చేసింది. డిపాజిట్‌దారులకు న్యాయం జరిగిందో లేదో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు నిర్ధారించాలని పేర్కొంది. 'రూ.5 వేలు డిపాజిట్ చేసిన వ్యక్తి తనకు న్యాయం జరగలేదని న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు.. అంతటి వ్యయ ప్రయాసలు భరించలేరు కదా..!' అని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను పార్టీగా చేరుస్తూ ఈ కేసును తెలంగాణ హైకోర్టు విచారించాలని తీర్పునిచ్చింది. డిపాజిట్లు తిరిగి చెల్లించారో లేదో పరిశీలించేందుకు ఓ జ్యుడిషియల్ అధికారిని నియమించాలని ఆదేశించింది. మొత్తం విచారణ ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని సుప్రీం కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది.

బహిరంగ ప్రకటన.. అభ్యంతరాల స్వీకరణ

సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఈ కేసు కీలక మలుపు తిరిగింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీ సేకరించిన అక్రమ డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలపై ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లోనే డిపాజిట్‌దారులు అత్యధికంగా ఉన్నారు. వారి ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత రెండు రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. తెలంగాణ హైకోర్టు నియమించే జ్యుడిషియల్ అధికారిని సంప్రదించి బహిరంగ ప్రకటన జారీ చేసేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేయనున్నాయి. అగ్రిగోల్డ్ కేసులో మాదిరిగానే ఈ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంది. బహిరంగ ప్రకటన జారీ చేసి డిపాజిట్‌దారులకు సమస్యలుంటే నివేదించాలని కోరనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తారు. డిపాజిట్లు తిరిగి చెల్లించకుంటే ఆ సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వీటిని క్రోడీకరించి తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడతాయి. ఇక రామోజీ డిపాజిట్లు చెల్లించేశామని చెబుతున్న వారి వివరాలను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. ఆ వివరాలను జ్యుడీషియల్ అధికారితోపాటు రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు అందచేయాలి. వాటిని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు బహిరంగ నోటీసు ద్వారా విడుదల చేస్తాయి. అందులోని డిపాజిట్‌దారుల పేర్లు, చెల్లింపుల వివరాలను పరిశీలిస్తాయి. వాటిపై వ్యక్తమయ్యే అభ్యంతరాలపై విచారణ చేపడతాయి. అనంతరం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నివేదికల ఆధారంగా జ్యుడీషియల్ అధికారి తదుపరి చర్యలు తీసుకుంటారు. దీనిపై తెలంగాణ హైకోర్టు విచారిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఆరు నెలల్లో పూర్తి కావాల్సి ఉంది. ఇరు ప్రభుత్వాలు బహిరంగ నోటీసు ఇవ్వడంతో పాటు జిల్లా స్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు దిశగా వేగంగా చర్యలు చేపట్టాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.



చేస్తేనే కదా... ఇచ్చేద్దాం మాట!

అలవి కాని హామీలు... అధికారం కోసం చంద్రబాబు తాయిలాలు

రోజుకో హామీతో ప్రజలను మభ్యపెడుతున్న టీడీపీ అధినేత.. నిన్న మొన్నటివరకూ సూపర్ సిక్స్ పేరుతో మాయ మాటలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆర్థిక ఉగ్రవాది ఉన్మాదం

- మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు, టీడీపీ డీలాతో రామోజీ బెంబేలు
- నైరాశ్యంలో పాతాళానికి పతనమై ఈనాడు రాతలు
- వేల కోట్లు కుమ్మరించేస్తోందంటూ వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతూ రోతరాతలు
- కోర్టు తీర్పుతో తన ఆర్థిక నేరాల గుట్టంతా రట్టవుతుందని గురివింద ఆందోళన



సాక్షి, అమరావతి: ఆర్థిక ఉగ్రవాది పత్రిక నడిపితే ఎలా ఉంటుందో 'ఈనాడు' చాటి చెబుతోంది. జర్నలిజాన్ని అడ్డుపెట్టుకుని ఆర్బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా డిపాజిట్లు సేకరించడమే అందుకు నిదర్శనం. సుప్రీంకోర్టు తీర్పుతో ఆ ఆర్థిక నేరం గుట్టంతా రట్టవుతుండటం.. తన శిష్యుడు చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని తేలడంతో రామోజీరావు భయంతో వణికి పోతున్నారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయం సాధించడం దిశగా దూసుకెళ్తోందని టైమ్స్‌నౌ-ఈటీజీ, జీ న్యూస్ తదితర ప్రతిష్ఠాత్మక జాతీయ మీడియా సంస్థల సర్వేలు తేల్చిచెప్పడం.. రాజకీయ విశ్లేషకులు అదే మాట చెబుతుండటం రామోజీరావుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఓటర్లను ప్రలోభపెట్టి ఓట్లను కొల్లగొట్టేందుకు వేల కోట్లు కుమ్మరిస్తోందని.. అడిగేవారు, అడ్డుకునే వారు లేకపోవడంతో చెలరేగిపోతోందంటూ వైఎస్సార్‌సీపీపై విషం చిమ్ముతూ బుధవారం 'ఈనాడు'లో 'కుమ్మరించేస్తోంది' శీర్షికన రోతరాతలు అచ్చేశారు. ఇటీవల ఐదు జిల్లాల ఎస్పీలు, ఒక ఐజీ, మూడు జిల్లాల కలెక్టర్లను ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ చేస్తే.. 'ఈడ్చికొట్టిన ఈసీ' అంటూ శివాలెత్తిన రామోజీ.. మార్గదర్శి కుంభకోణంపై విచారించిన అధికారి కొల్లి రఘురామిరెడ్డిని ఎన్నికల పరిశీలకుడిగా ఈసీ అస్సాంకు పంపితే.. 'కొల్లికి షాక్' అంటూ కథనాన్ని అచ్చేసి సంబరపడ్డారు. ఈసీ కనుసన్నల్లో అధికారులు పని చేస్తుంటే.. అడిగేవారు, అడ్డుకునేవారు లేరంటూ ఇప్పుడు ఎన్నికల సంఘంపై అబాండాలు వేయడం చూస్తే రామోజీరావు మతిస్థిమితం కోల్పోయారేమో అనిపిస్తోంది. ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహిస్తుంటే.. ఏ రోజు లెక్కలు ఆ రోజే తేలుస్తుంటే.. ప్రతి మద్యం దుకాణానికి వైఎస్సార్‌సీపీ రూ.పది లక్షలు ముందస్తు చెల్లింపులు చేయడం ఎలా సాధ్యం అన్న ఇంగిత /జ్ఞానం కూడా రామోజీరావుకు లేకుండా పోయింది. తన శిష్యుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఘోర పరాజయానికి ఇప్పటి నుంచే గురవింద రామోజీ సాకులు వెతుకుతూ రోత రాతలు అచ్చేశారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

రాజకీయాన్ని వ్యాపారం చేసింది బాబే

దేశంలో రాజకీయాలను పక్కా వ్యాపారంగా మార్చేసి, ఓటుకు నోటును అలవాటు చేసిన ఘనుడు 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబే. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. 1996 లోక్‌సభ ఎన్నికల నుంచి ఓటుకు నోటుకు తెరతీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచేసిన సొమ్ముతోపాటు.. పార్టీని నమ్ముకున్న వారికి కాకుండా బ్యాంకులను కొల్లగొట్టిన ఆర్థిక నేరగాళ్లు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, వ్యాపారులు, ఎన్నారైలకు టికెట్లు ఇచ్చారు. కోట్ల కట్టలను వెదజల్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ప్రక్రియను ప్రారంభించారు. తెలంగాణ శాసనమండలి ఎన్నికల్లో ఓటుకు కోట్లు ఎరగా వేస్తూ ఆడియో, వీడియో టేపులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినా చంద్రబాబు తన తీరు మార్చుకోలేదు సరికదా మరింతగా చెలరేగిపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని దశాబ్దాలుగా నమ్ముకున్న వారిని కాదని రూ.900 కోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చిన విద్యా వ్యాపారి పొంగూరు నారాయణను నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి చంద్రబాబు బరిలోకి దించారు. రూ.వందల కోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చిన ఎన్నారైలు పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి, కాకర్ల సురేష్‌ను ఉదయగిరి నియోజకవర్గం నుంచి, వెలిగండ్ల రామును గుడివాడ నుంచి, యార్లగడ్డ వెంకట్రావును గన్నవరం నుంచి, రియల్టర్ కేశినేని చిన్నిని విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి.. కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబును కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి బరిలోకి దించారు. పార్టీ ఫండ్ రూపంలో.. అభ్యర్థుల నుంచి డిపాజిట్ల రూపంలో వసూలు చేసిన వేల కోట్ల రూపాయలను యథేచ్ఛగా వెదజల్లుతున్నారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు పెమ్మసాని, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, బీజేపీ అభ్యర్థులు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్ వంటి వారు భారీ ఎత్తున నోట్ల కట్టలను వెదజల్లుతున్నారు. ఇతర పార్టీలకు చెందిన సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు వంటి వారిని కొనుగోలు చేస్తూ తమ వైపునకు తిప్పుకోవడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న సభలకు నోట్ల కట్టలను వెదజల్లుతున్నా జనం మొహం చాటేస్తున్నారు. కోట్ల కట్టలతో చంద్రబాబు చేస్తున్న విన్యాసాలు రామోజీ కంటికి కన్పించలేదేమో!

సరి కొత్త ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం

జన బలమే గీటురాయిగా.. ప్రజాసేవే ప్రామాణికంగా.. నిబద్ధతే పరమావధిగా కింది స్థాయి కార్యకర్తలను అభ్యర్థులుగా ఎంపిక చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ప్రజాస్వామ్యానికి సరైన అర్థం చెప్పారు. శింగనమల నియోజకవర్గం నుంచి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును, మడకశిర నియోజకవర్గం నుంచి ఉపాధి కూలీ ఈర లక్కప్పను, నెల్లూరు సిటీలో విద్యా వ్యాపారి కోటీశ్వరుడు నారాయణపై సాధారణ కార్యకర్త ఖలీల్ అహ్మద్‌ను, మైలవరం నియోజకవర్గం నుంచి రైతుబిడ్డ సర్నాల తిరుపతిరావును, కోటీశ్వరులు బరిలోకి దిగే నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి న్యాయవాది గూడూరి ఉమాబాలను సీఎం వైఎస్ జగన్ బరిలోకి దించడం ద్వారా రాజకీయాల్లో సరి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో అర్హతే ప్రమాణికంగా.. ఎలాంటి వివక్షకు తావు లేకుండా.. లంచాలకు చోటులేకుండా సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి గుమ్మం వద్దే అందిస్తున్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలను కొనసాగించి.. ఇచ్చిన మాటపై నిలబడి.. సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పారు. దీంతో సీఎం వైఎస్ జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజు రోజుకూ పెరుగుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు పోటెత్తిన జనసంద్రమే అందుకు నిదర్శనం. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు మండుటెండైనా.. అర్ధరాత్రి అయినా ఉప్పొంగుతున్న అభిమానసంద్రమే అందుకు తార్కాణం. ఓ వైపు వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభలు, నిర్వహిస్తున్న బస్సు యాత్రకు అభిమాన సంద్రం ఉప్పొంగుతుండటం.. మరో వైపు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేయడాన్ని చూస్తే రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభంజనమేనన్నది స్పష్టమవుతోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టైమ్స్‌నౌ-ఈటీజీ, జీన్యూస్ వంటి డజనుకుపైగా జాతీయ మీడియా సంస్థల సర్వేలూ అదే చెబుతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్న రామోజీరావు.. శిష్యుడు చంద్రబాబు ఘోర పరాజయానికి ఇప్పటి నుంచే సాకులు వెతుక్కుంటున్నారని స్పష్టమవుతోంది.

ఇదీ మా ప్రోగ్రెస్ రిపోర్ట్

2.31 లక్షల ఉద్యోగాలు, ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం.. చంద్రబాబు హయాంలో కేవలం 32 వేల ఉద్యోగాలే

ఊసరవెల్లి ఎన్నిసార్లు రంగు మారుస్తుందో నాకు తెలియదు గానీ, చంద్రబాబు మాత్రం ఊసరవెల్లిని దాటిపోయాడు. నీ మోసాలు అందరికీ తెలిసినవే. మొట్ట మొదటిగా ఈ వలంటీర్లను పీకేస్తావు. మళ్లీ నీ జన్మభూమి కమిటీ సభ్యులందర్నీ వలంటీర్లుగా తెచ్చుకుంటావు. వాళ్లు దోచుకునే దాని కోసం రూ.10 వేలు అదనంగా వాళ్లకు ఇస్తావు. ఇదీ నువ్వు చేయబోయే మోసపూరిత రాజకీయం అనేది చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. చంద్రబాబు బతుకంతా అబద్ధాలే పునాదులు, మోసాలే. వెన్నుపోట్లే చరిత్ర. సినిమాల్లో విలన్ క్యారెక్టర్ చూస్తే అది చంద్రబాబు క్యారెక్టర్ కిందనే గుర్తుకొస్తుంది. – సీఎం వైఎస్ జగన్

పిడుగురాళ్ల సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- చంద్రబాబు, పచ్చమీడియా కుట్ర రాజకీయాల్లో నిజాల నిగ్గు తేలుద్దాం





పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మేమంతా సిద్ధం సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉద్యోగాలివ్వడంలో.. రైతులు, మహిళల అభ్యున్నతికి కృషి చేయడంలో, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడంలో చంద్రబాబు ఇస్తున్నది బోగస్ రిపోర్టు అయితే, వైఎస్ జగన్ ఇస్తున్నది కళ్లెదుటే కనిపిస్తున్న ప్రోగ్రెస్ రిపోర్టు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మనందరి ప్రభుత్వ హయాంలో 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా స్వయం ఉపాధి రంగాన్ని ప్రోత్సహించామని చెప్పారు. మొట్ట మొదటిసారిగా ఎంఎస్‌ఎంఈలకు చేయూతనిచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. వాహన మిత్ర, నేతన్న నేస్తం, జగనన్న తోడు, జగనన్న చేదోడు, మత్స్యకార భరోసా, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ.. ఇలా అన్ని విధాలా ప్రోత్సహించబట్టే స్వయం ఉపాధి రంగం ఈరోజు తన కాళ్ల మీద తాను నిలబడగలుగుతోందన్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక చక్రం పరుగులు పెడుతోందని చెప్పడానికి గర్వపడుతున్నానని చెప్పారు. 'మేమంతా సిద్ధం'బస్సు యాత్రలో భాగంగా బుధవారం ఆయన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో జరిగిన సభలో మాట్లాడారు. ఈ జన సంద్రాన్ని చూస్తుంటే నెల రోజుల్లోనే పట్టపగలు కోటప్పకొండ తిరునాళ్లు కనిపిస్తోందని అన్నారు. ఐదేళ్ల మన ప్రభుత్వంలో ఇంటింటికీ వచ్చిన అభివృద్ధిని, సంక్షేమాన్ని, లంచాలు, వివక్ష లేని పాలనను.. ఆ దుష్ట కూటమి, ఎల్లో మీడియా కబంధ హస్తాల నుంచి కాపాడుకునేందుకు పలనాటి సీమ పౌరుషంతో జన సముద్రంగా మారిన దృశ్యం కనిపిస్తోందని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

ఏది నిజం, ఏది అబద్ధం.. మీరే తేల్చండి

✦ బాబుగారి గురించి ఈరోజు ఈ సిద్ధం సభకు వచ్చిన లక్షల మందితో నేను కొన్ని నిజానిజాలు తేల్చదల్చుకున్నా. ఈ రోజు ఇక్కడ మీరు, నేను జాయింట్ గా ఓ ఫ్యాక్ట్ చెక్ (నిజ నిర్ధారణ) చేద్దాం. ఈ చంద్రబాబు గురించి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5.. ఈ చెత్త మీడియా చేస్తున్న ప్రచారంలో ఏది నిజం, ఏది అబద్ధం అనేది మీ ముందు పెడుతున్నా.

✦ చంద్రబాబు, ఈ ఎల్లో మీడియా కూడబలుక్కుని ఒక నిర్ణయానికి వస్తారు. తర్వాత వీరంతా కలిసి ఒక గాడిదను తీసుకొస్తారు. దాన్ని గుర్రం, గుర్రం అంటూ పదే పదే ఊదరగొడతారు. ఇలా 30 ఏళ్లుగా చేస్తూ వస్తున్నారు. 2014లో జాబు రావాలి అంటే బాబు రావాలి అని సభల్లో, టీవీ చానళ్లలో, ఊరూరా ఊదరగొట్టారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పాలించిన చంద్రబాబు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? మీ వాళ్లకు, మీ ఇంటి చుట్టు పక్కల వాళ్లకు ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందా?

✦ మీ బిడ్డ జగన్ వచ్చాక ప్రతి గ్రామంలో ఒక సచివాలయం తీసుకొచ్చారు. ఆ సచివాలయాల్లో ఏకంగా 1.35 లక్షల మంది మన పిల్లలు ఈరోజు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో నేను నా.. నా.. నా.. నా.. అని పిలుచుకునే నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకంగా 80 శాతం మంది ఉన్నారు.

✦ ఈరోజు ఒక్క వైద్య ఆరోగ్య రంగంలో మాత్రమే ఈ 58 నెలల కాలంలో 54 వేల పోస్టులు భర్తీ చేశాం. గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళితే గతంలో మాదిరి డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లేరన్న పరిస్థితి లేదు. మొత్తంగా 58 నెలల్లో 2.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మీ బిడ్డ పాలన రాక ముందు రాష్ట్రంలో 4 లక్షల ఉద్యోగాలుంటే.. ఈ 58 నెలల కాలంలోనే మీ బిడ్డ మరో 2.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాడు. ఈ పెద్దమనిషి చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్య కేవలం 32 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. ఈ లెక్కన జాబు రావాలి అంటే ఫ్యాను రావాలా? లేక తుప్పు పట్టిన సైకిల్ రావాలా?

నిర్మాణంలో 4 సీ పోర్టులు, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 నోడ్స్

✦ మరోవైపు రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా కొత్తగా మరో నాలుగు సీ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 ఇండస్ట్రియల్ నోడ్స్ కూడా వేగంగా పరుగులెత్తుతున్నాయి. 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కూడా నిర్మాణంలో ఉన్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం దేశంలోనే వరుసగా ప్రతి సంవత్సరం నంబర్ వన్‌గా నిలుస్తోంది.

✦ రైతు అంటే బాబుకు ప్రేమట. నమ్ముతారా? (నమ్మం.. నమ్మం.. అని నినాదాలు) గతంలో ఏమీ చేయని బాబు.. ఇప్పుడు రైతుకు ఎక్కువ మేలు చేస్తాడట. ఇదీ వాళ్ల ఎల్లో మీడియా, చంద్రబాబు కొత్తగా చెబుతున్న మాటలు.

బాబువన్నీ విఫల హామీలే

✦ 2014లో రూ.87,612 కోట్లు రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడు. చేశాడా? రైతులకు పగటిపూటే 12 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తానన్నాడు. ఇచ్చాడా? బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపిస్తానన్నాడు. విడిపించాడా? రైతులకు సున్నా వడ్డీ కూడా ఎగరగొట్టేశాడు. ఇన్‌పుట్ సబ్సిడీ సైతం 2017 నుంచి ఎగ్గొట్టేశాడు. కరెంటు విషయంలోనూ బకాయిలే. ధాన్యం సేకరణలోనూ బకాయిలే, రైతుల నుంచి కొనుగోలు చేసిన విత్తనాలకు సైతం డబ్బులివ్వకుండా బకాయిలే.

✦ మీ బిడ్డ జగన్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 ప్రతి రైతన్న చేతిలో పెడుతున్నాడు. ఈ ఐదేళ్లలో ప్రతి రైతన్నకూ రూ.67,500 ఇచ్చాం. మేనిఫెస్టోలో రూ.50 వేలు ఇస్తామని చెప్పి, అంతకంటే మిన్నగా రూ.67,500 ఇచ్చామా? లేదా? అని అడుగుతున్నా.

✦ సున్నా వడ్డీకే పంట రుణాలు చంద్రబాబు ఎత్తేస్తే.. మీ బిడ్డ జగన్, బాబు బకాయిలను సైతం కట్టి, మళ్లీ సున్నా వడ్డీకే పంట రుణాలు ఇప్పిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా ఏకంగా 35 లక్షల ఎకరాల మీద శాశ్వత భూహక్కులు కల్పించాం. ఈ పరిస్థితిలో రైతు కోసం ఈ రాష్ట్రానికి ఎవరు అవసరం? రుణ మాఫీ అని మోసం చేసిన చంద్రబాబా? లేక వ్యవసాయానికి అండగా నిలబడిన మీ బిడ్డనా? వాళ్లు ఇచ్చేది బోగస్ రిపోర్ట్. మీ జగన్ ఇస్తున్నది ప్రోగ్రెస్ రిపోర్ట్.

ముస్లింలకు సీఎం జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రంజాన్ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలిపారు. దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు కలిగించాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని పేర్కొన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

ఇంతకన్నా ఇంకేం సర్టిఫికెట్ కావాలి?

✦ మొన్నటి దాకా మన వలంటీర్ల వ్యవస్థ పట్ల భయంకరమైన ద్వేషం వెళ్లగక్కారు. మూటలు మోసే వాళ్లు అన్నాడు. వారి కథ తేలుస్తా అన్నాడు. వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నాడు. మగవాళ్లు ఇంట్లో లేనప్పుడు తలుపులు కొడతారని కూడా అన్నాడు. ఇక ఆయన దత్తపుత్రుడు ఇంకో నాలుగు అడుగులు ముందుకేసి.. వలంటీర్లు ట్రాఫికింగ్ చేయిస్తున్నారని అన్నాడు. అందువల్లే అమ్మాయిలు మిస్ అయిపోతున్నారు.. మాయమైపోతున్నారని కూడా అన్నాడు. వలంటీర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ సైన్యం అన్నాడు. వాలంటీర్లు జగన్‌కు అధికార పెగసస్ అని కూడా ట్వీట్ చేశాడు ఈ దత్తపుత్రుడు. ఇలా అన్న వాళ్లు వలంటీర్ వ్యవస్థను గుర్తించినందుకు సంతోషం. మన ప్రభుత్వానికి ఇంతకన్నా ఏం సర్టిఫికెట్ కావాలి?

✦ అయ్యా చంద్రబాబూ.. నీ హయాంలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. వాళ్లు, మీరు ఇద్దరూ కలిసి మరుగుదొడ్లకూ, రేషన్‌కు, పెన్షన్‌కూ లంచాలు తీసుకున్నారు. రాష్ట్రాన్ని దోచేశారు. చంద్రబాబు మనస్తత్వం రాష్ట్రాన్ని దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం. చనిపోయిన తర్వాత కూడా ప్రతి పేదవాడి గుండెల్లో బతికే ఉండాలన్నది జగన్ మనస్తత్వం. ఇదీ.. నీకు నాకు మధ్య ఉన్న తేడా.

✦ ఇదే చంద్రబాబు మొన్నటికి మొన్న నిమ్మగడ్డ రమేష్ అనే తన మనిషితో ఎలక్షన్ కమిషన్‌కు కంప్లయింట్ చేయించి, అవ్వాతాతలకు ఇంటి వద్దే అందాల్సిన పెన్షన్ ఆపించారు. ఆ అవ్వాతాతలు ఇబ్బందులు పడేట్టుగా చేసి, చివరికి అనేక మంది అవ్వాతాతలు మరణానికి కూడా కారణమయ్యారు. ఒక్కసారిగా గాలి ఎదురు తిరిగే సరికే చంద్రబాబులో ఉన్న మోసం మళ్లీ చంద్రముఖిలా పైకి లేచింది.

ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా?

ఇన్ని అబద్ధాలు, ఇన్ని మోసాలతో రాష్ట్ర పేదల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునే ఈ యుద్ధనికి మీరంతా సిద్ధమేనా? (సిద్ధమేనని జనం నినాదాలు) మీరు సిద్ధంగా ఉంటే మోసగాళ్ల సోషల్ మీడియా, ఎల్లో మీడియా అసత్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీ జేబులోంచి సెల్ ఫోన్ బయటకు తీసి, అందులోని టార్చ్ లైట్ వెలిగించండి. (అందరూ సెల్‌లో టార్చ్ వెలిగించి పైకెత్తి చూపారు). 175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లుకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు. మన బతుకులు బాగుపడాలి అంటే ఫ్యాను మీద రెండు ఓట్లు కచ్చితంగా వేయాలి.



సాకేత్ జోడీకి చుక్కెదురు

బుసాన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత ప్లేయర్ సాకేత్ మైనేని పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. దక్షిణ కొరియాలో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సాకేత్-ప్యాట్రిక్ నిక్లాస్ సాల్మినెన్ (ఫిన్‌లాండ్) ద్వయం 5-7, 2-6తో అలెక్స్ బోల్ట్-లి టు (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్ జంట తమ సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయింది.

భారత హాకీ జట్టుకు 'హ్యాట్రిక్' ఓటమి



ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. పెర్త్‌లో బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో టీమిండియా 1-2 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (41వ ని.లో) ఏకైక గోల్ చేయగా... ఆస్ట్రేలియా జట్టుకు జెరెమి హేవార్డ్ (44వ, 49వ ని.లో) రెండు గోల్స్ అందించి గెలిపించాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 3-0తో ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్ రేపు జరుగుతుంది.

రాయల్స్‌కు టైటాన్స్ షాక్

197 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది... చివర్లో 4 ఓవర్లలో 59 పరుగులు చేయాల్సిన దశలో గెలుపు అసాధ్యంగా అనిపించింది. కానీ తర్వాతి నాలుగు ఓవర్లలో వరుసగా 17, 7, 20, 17 పరుగులు సాధించిన టైటాన్స్ అనూహ్య విజయాన్ని అందుకుంది. అప్పటి వరకు నియంత్రణతో బౌలింగ్ చేసిన రాజస్తాన్ రాయల్స్ పేలవ బౌలింగ్, వ్యూహ వైఫల్యంతో చేజేతులా మ్యాచ్‌ను కోల్పోయి ఈ సీజన్‌లో తొలి ఓటమిని ఎదుర్కొంది.

- చేజేతులా ఓడిన రాజస్తాన్
- 3 వికెట్లతో గుజరాత్ గెలుపు
- రాణించిన గిల్, రషీద్ ఖాన్



రషీద్ ఖాన్

జైపూర్: వరుస విజయాలతో అజేయంగా దూసుకుపోతున్న రాజస్తాన్ రాయల్స్‌కు బ్రేక్ పడింది. బుధవారం జరిగిన పోరులో గుజరాత్ టైటాన్స్ 3 వికెట్ల తేడాతో రాయల్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (48 బంతుల్లో 76; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), సామ్సన్ (38 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (44 బంతుల్లో 72; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, సాయి సుదర్శన్ (29 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టైటాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

శతక భాగస్వామ్యం...

గత మూడు మ్యాచ్‌లలో వైఫల్యాల తర్వాత ఈసారి యశస్వి (19 బంతుల్లో 24; 5 ఫోర్లు) కాస్త మెరుగైన ప్రదర్శన కనబర్చగా, గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన బట్లర్ (8) విఫలమయ్యాడు. పవర్‌ప్లేలో రాజస్తాన్ 43 పరుగులే చేయగా... ఈ దశ నుంచి సామ్సన్, పరాగ్ భారీ భాగస్వామ్యం రాయల్స్‌ను పటిష్ట స్థితికి చేర్చింది. ఇద్దరూ వేగంగా పరుగులు సాధించారు. పరాగ్ 34 బంతుల్లో, సామ్సన్ 31 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నారు. ఎట్టకేలకు 19వ ఓవర్లో పరాగ్‌ను అవుట్ చేసి మోహిత్ ఈ జోడీని విడదీశాడు. అయితే ఉమేశ్ వేసిన చివరి ఓవర్లో సామ్సన్, హెట్‌మైర్ (13 నాటౌట్) చెరో సిక్స్ బాదడంతో మొత్తం 19 పరుగులు వచ్చాయి.

గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్...

భారీ ఛేదనలో టైటాన్స్‌కు సుదర్శన్, శుబ్‌మన్ గిల్ దూకుడైన ఆరంభాన్ని ఇవ్వలేకపోయారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించినా... అందుకు 50 బంతులు తీసుకున్నారు. రాయల్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వీరి పరుగుల వేగాన్ని నిరోధించింది. బౌల్ట్ తొలి 2 ఓవర్లలో 8 పరుగులే ఇవ్వగా... అవేశ్ బౌలింగ్‌లో 14 పరుగులు రాబట్టడంతో టైటాన్స్ స్కోరు పవర్‌ప్లే ముగిసే సరికి 44 పరుగులకు చేరింది. అయితే కుల్దీప్ సేన్ ఒక్కసారిగా గుజరాత్‌ను దెబ్బ తీశాడు. తన బౌలింగ్‌లో 6 పరుగుల వ్యవధిలో అతను సుదర్శన్, వేడ్ (4), మనోహర్ (1)లను వెనక్కి పంపించాడు. ఈ దశలో కెప్టెన్ గిల్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. 35 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయ్ శంకర్ (16) ప్రభావం చూపలేకపోగా... 28 బంతుల్లో 65 పరుగులు చేయాల్సిన స్థితిలో గిల్ వెనుదిరగడంతో టైటాన్స్ ఆశలు సన్నగిల్లాయి. అయితే కీలక సమయంలో రషీద్ ఖాన్ (11 బంతుల్లో 24 నాటౌట్; 4 ఫోర్లు), రాహుల్ తెవాటియా (11 బంతుల్లో 22; 3 ఫోర్లు) ఆట జట్టును గెలిపించింది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) వేడ్ (బి) ఉమేశ్ 24; బట్లర్ (సి) తెవాటియా (బి) రషీద్ 8; సామ్సన్ (నాటౌట్) 68; పరాగ్ (సి) శంకర్ (బి) మోహిత్ 76; హెట్‌మైర్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-32, 2-42, 3-172. **బౌలింగ్:** ఉమేశ్ 4-0-47-1, జాన్సన్ 4-0-37-0, రషీద్ 4-0-18-1, నూర్ 4-0-43-0, మోహిత్ 4-0-51-1. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సుదర్శన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 35; గిల్ (స్టంప్డ్) సామ్సన్ (బి) చహల్ 72; వేడ్ (బి) కుల్దీప్ 4; మనోహర్ (బి) కుల్దీప్ 1; విజయ్ శంకర్ (బి) చహల్ 16; తెవాటియా (రనౌట్) 22; షారుఖ్ (ఎల్బీ) (బి) అవేశ్ 14; రషీద్ ఖాన్ (నాటౌట్) 24; నూర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 199. **వికెట్ల పతనం:** 1-64, 2-77, 3-79, 4-111, 5-133, 6-157, 7-195. **బౌలింగ్:** బౌల్ట్ 2-0-8-0, అవేశ్ 4-0-48-1, మహరాజ్ 2-0-16-0, అశ్విన్ 4-0-40-0, చహల్ 4-0-43-2, కుల్దీప్ సేన్ 4-0-41-3.

ఐపీఎల్‌లో నేడు

ముంబై X బెంగళూరు
వేదిక: ముంబై
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	5	4	1	8	0.871
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
పంజాబ్	5	2	3	4	-0.196
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

గుకేశ్‌కు రెండో విజయం

హంపి ఖాతాలో నాలుగో 'డ్రా'



గుకేశ్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఐదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్స్ అజేయంగా నిలిచారు. ఓపెన్ విభాగంలో తమిళనాడు కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేయగా... ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి ఖాతాలో నాలుగో 'డ్రా' చేరగా... తమిళనాడు అమ్మాయి వైశాలి కూడా తన గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. గుకేశ్ 87 ఎత్తుల్లో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)ను ఓడించగా... విదిత్-కరువానా (అమెరికా) గేమ్ 30 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద-నెపోమ్‌నిషి (రష్యా) గేమ్ 44 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. హంపి-గొర్యాచ్‌కినా (రష్యా) గేమ్ 44 ఎత్తుల్లో... వైశాలి-అనా ముజిచుక్ (ఉక్రెయిన్) గేమ్ 49 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఐదో రౌండ్ తర్వాత ఓపెన్ విభాగంలో గుకేశ్ 3.5 పాయింట్లతో నిపోమ్‌నిషితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. 2.5 పాయింట్లతో ప్రజ్ఞానంద నాలుగో ర్యాంక్‌లో, 2 పాయింట్లతో విదిత్ ఆరో ర్యాంక్‌లో ఉన్నారు.

భారత్‌కు తొలి ఓటమి



చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. పటిష్టమైన చైనా జట్టుతో బుధవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 0-3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో సహజ యామలపల్లి 2-6, 3-6తో ప్రపంచ 43వ ర్యాంకర్ జిన్‌యు వాంగ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 0-6, 0-6తో ప్రపంచ 7వ ర్యాంకర్ క్విన్‌వెన్ జెంగ్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో రుతుజా భోస్లే-ప్రార్థన ద్వయం 1-6, 1-6తో హాన్‌యు గువో-జియు వాంగ్ జోడీ చేతిలో పరాజయం పొందడంతో భారత ఓటమి ఖరారైంది. నేడు జరిగే మూడో మ్యాచ్‌లో చైనీస్ తైపీతో భారత్ ఆడుతుంది.



పీవీ సింధు



ప్రణయ్

శ్రమించి గెలిచిన సింధు, ప్రణయ్

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ మాత్రమే బరిలో మిగిలారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 64 నిమిషాల్లో 18-21, 21-14, 21-19తో ప్రపంచ 33వ ర్యాంకర్ గో జిన్ వె (మలేసియా)పై... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 90 నిమిషాల్లో 17-21, 23-21, 23-21తో ప్రపంచ 16వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)పై గెలుపొందారు. గతంలో గ్వాంగ్ జుతో ఆడిన మూడుసార్లూ ఓడిపోయిన ప్రణయ్ నాలుగో ప్రయత్నంలో విజయాన్ని అందుకున్నాడు. తొలి గేమ్‌ను కోల్పోయిన ప్రణయ్ రెండో గేమ్‌లో, మూడో గేమ్‌లో మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని నెగ్గడం విశేషం. మహిళల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మాళవిక (భారత్) 18-21, 19-21తో సిమ్ యు జిన్ (కొరియా) చేతిలో, ఆకర్షి కశ్యప్ 10-21, 11-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ 19-21, 15-21తో టాప్ సీడ్ షి యుకీ (చైనా) చేతిలో, కిడాంబి శ్రీకాంత్ 14-21, 13-21తో రెండో సీడ్ జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో, ప్రియాన్షు 9-21, 13-21తో లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ (భారత్) జోడీ 2-21, 12-21తో లియు షెంగ్ షు-టాన్ నింగ్ (చైనా) జంట చేతిలో ఓటమి పాలైంది.

బోపన్న జోడీ అవుట్



మోంటెకార్లో (మొనాకో): పురుషుల టెన్నిస్ డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో టాప్ సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిముఖం పట్టింది. తొలి రౌండ్ 'బై' పొందిన బోపన్న-ఎబ్డెన్ జంట బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 3-6, 6-7 (6/8)తో మాట్ పావిచ్ (క్రొయేషియా)-మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్) జోడీ చేతిలో ఓడిపోయింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 25,510 యూరోల (రూ. 22 లక్షల 82 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



తెలంగాణ జట్టుకు రజతం

స్వర్ణ పతకం గెలిచిన సరయు

సాక్షి, హైదరాబాద్: జాతీయ టీమ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో వేల్పుల సరయు, గాదె శరణ్య, ఆలపాటి సాయి మహతి, కీర్తిక, దీక్షితలతో కూడిన తెలంగాణ జట్టు 11 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ టోర్నీలో తెలంగాణ జట్టు ఐదు మ్యాచ్‌ల్లో నెగ్గి, ఒక మ్యాచ్‌లో ఓడి, మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. 14 పాయింట్లతో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) విజేతగా నిలిచింది. బోర్డు-2పై ఆడిన తెలంగాణ కెప్టెన్, వరంగల్ జిల్లాకు చెందిన సరయు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోవడం విశేషం. ఆరు గేమ్‌లు ఆడిన సరయు ఐదింటిలో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని 5.5 పాయింట్లతో బోర్డు-2 విజేతగా నిలిచింది.

సినిమా



చిరంజీవి · నాగార్జున · వెంకటేశ్ · రవితేజ

చెబుతావా రత్నం



విశాల్

విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రత్నం'. హరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న తెలుగు, తమిళ్‌లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని శ్రీ సిరి సాయి సినిమాస్ బ్యానర్‌పై తెలుగులో సీహెచ్ సతీష్ కుమార్, కె. రాజ్‌కుమార్ విడుదల చేస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'చెబుతావా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, సింధూరి విశాల్ పాడారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'రత్నం'. 'చెబుతావా..' పాట మెలోడియస్‌గా, ఎమోషనల్‌గా సాగుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

కర్చీఫ్ మడతపెట్టి...!

సంక్రాంతికి 'కుర్చీని మడత పెటి...' అంటూ 'గుంటూరు కారం'లో మహేశ్‌బాబు చేసిన సందడి ఇంకా వినబడుతోంది. పండగ వెళ్లి మూడు నెలలు కూడా కాక ముందే వచ్చే సంక్రాంతి కోసం కర్చీఫ్ మడతపెట్టి, పండగ బరిలో సీట్ రిజర్వ్ చేసుకున్నారు కొందరు స్టార్స్. అయితే సంక్రాంతి రిలీజ్ అంటూ ప్రకటనలు రావడం, చివరి నిమిషంలో కొన్ని సినిమాలు తప్పుకోవడం మామూలే. ఇక 2025 సంక్రాంతి రేసులో ఇప్పటివరకూ షురూ అయిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.

విశ్వంభర వస్తున్నాడు

సంక్రాంతికి పండక్కి చాలా హిట్స్ సాధించారు చిరంజీవి. 2023లో 'వాల్తేరు వీరయ్య'తో సంక్రాంతికి వచ్చి మరో హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు. మళ్లీ 2025లో 'విశ్వంభర' సినిమాతో సంక్రాంతి బరిలోకి దిగుతున్నారు. జనవరి 10న రిలీజ్ డేట్ కూడా ఫిక్స్ చేశారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్‌లో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారనీ టాక్. అలాగే ఈ చిత్రంలో చిరంజీవిది హనుమంతుడి భక్తుడి పాత్ర అట.

భార్య.. మాజీ ప్రేయసి.. మధ్యలో మాజీ పోలీసాఫీసర్

ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్ 'సైంధవ్' రిలీజైంది. వచ్చే సంక్రాంతికి కూడా రానున్నారు. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు వెంకటేశ్. ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఓ మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, అతని మాజీ ప్రేయసి.. ఇలా ఈ మూడు పాత్రల చుట్టూ సాగే క్రైమ్ కామెడీ మూవీ ఇది. 'ఎఫ్ 2, ఎఫ్ 3' చిత్రాల నిర్మాత 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే.. 2017లో శర్వానంద్ హీరోగా నటించిన 'శతమానం భవతి' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'శతమానం భవతి పేజీ 2' ఉందని, 2025 సంక్రాంతికి ఈ సినిమాను రిలీజ్ చేస్తామని ఆ్రరెడీ 'దిల్' రాజు ప్రకటించారు. ఇప్పుడు వెంకటేశ్-అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లోని సినిమాను కూడా సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారు.

మళ్లీ బంగార్రాజు వస్తాడా?

'నా సామిరంగ' అంటూ ఈ ఏడాది సంక్రాంతికి హిట్ సాధించారు నాగార్జున. ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో 'సంక్రాంతికి కలుద్దాం' అన్నారు నాగార్జున. సో.. 2025 సంక్రాంతికి కూడా నాగార్జున ఓ సినిమాను రిలీజ్ చేయడానికి రెడీ అవుతున్నారని ఊహించవచ్చు. 2016 సంక్రాంతికి 'సోగ్గాడే చిన్ని నాయనా', 2022 సంక్రాంతికి 'బంగార్రాజు' ('సోగ్గాడే చిన్ని నాయనా'కు సీక్వెల్) సినిమాలతో హిట్స్ అందుకున్నారు నాగార్జున. సో.. 2025 సంక్రాంతికి 'బంగార్రాజు 3'ని రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందా? అనే ఆలోచనలో ఉన్నారట. మరి.. నాగార్జున ఏ సినిమాను రిలీజ్ చేస్తారు? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

లక్ష్మణ్ భేరి రెడీ

రవితేజ హీరోగా నటించిన 'ఈగల్' ఈ ఏడాది సంక్రాంతి బరిలో నిలిచి, చివరి నిమిషంలో ఇండస్ట్రీ మేలు కోసం అంటూ వాయిదా పడింది. ఈ చిత్రం ఫిబ్రవరిలో రిలీజైంది. ఈసారి పక్కాగా సంక్రాంతికి రావాలనుకుంటున్నారు రవితేజ. అందుకే తన కెరీర్‌లోని 75వ చిత్రాన్ని 2025 సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా మారుతున్నారు. ఈ సినిమాలో లక్ష్మణ్ భేరి పాత్రలో కనిపిస్తారు రవితేజ. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా సాగుతుందని టాక్. మరోవైపు 2021 సంక్రాంతికి 'క్రాక్' సినిమాతో వచ్చి రవితేజ హిట్ సాధించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

ఇంకా...

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజా సాబ్' 2025 సంక్రాంతికి వచ్చే చాన్స్ ఉందని ఇటీవల పేర్కొన్నారు ఈ చిత్రనిర్మాత టీజీ విశ్వప్రసాద్. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం రిలీజ్‌పై మరోసారి స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఈ ఏడాది సంక్రాంతికి తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'హనుమాన్' మంచి వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ఇకపై ప్రతి సంక్రాంతికి ఓ సినిమా వస్తుందని పేర్కొన్నారు ప్రశాంత్ వర్మ. మరి.. వచ్చే సంక్రాంతికి ప్రశాంత్ నుంచి వచ్చే సినిమాపై ఇంకా ప్రకటన రాలేదు. ఇలా సంక్రాంతి బరిలో నిలిచే చిత్రాలు మరికొన్ని ఉన్నాయని తెలిసింది.

సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో డబ్బింగ్ చిత్రాలు ఉంటుంటాయి. ఇలా అజిత్ హీరోగా నటించనున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతి విడుదలకు ఖరారైంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. అలాగే సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కూడా 2025 సంక్రాంతికి విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది. ఇంకా కన్నడ ఫిల్మ్ 'కాంతార'కు ప్రీక్వెల్‌గా రూపొందుతున్న 'కాంతార: ది లెజెండ్ చాప్టర్ 1' చిత్రం కూడా సంక్రాంతికి రిలీజ్ అవుతుందనే వార్త వచ్చిన సంగతి తెలిసిందే.

నవ్వు... భయం



తమన్నా

తమన్నా, సుందర్ సి, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాక్'. సుందర్ సి. దర్శకత్వం వహించారు. ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం తమిళ్, తెలుగులో ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ చిత్రం తెలుగు రిలీజ్ హక్కులను సొంతం చేసుకున్న ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారీగా విడుదలను ప్లాన్ చేస్తున్నారు. కాగా ఈ చిత్రంలో శివానీ పాత్రలో తమన్నా, శివ శంకర్‌గా సుందర్ సి. నటించారు. వారి పాత్రలను పరిచయం చేస్తూ లుక్స్ రిలీజ్ చేశారు. ''హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బాక్'' అన్నారు మేకర్స్.

డ్యాన్స్ చేశాం - ఎంఎం కీరవాణి



కీరవాణి, ఆశిష్, వైష్ణవీ చైతన్య

''లవ్ మీ' సినిమాలో 'ఆటగదరా శివ..' అని ఓ టైటిల్ సాంగ్ రాశారు చంద్రబోస్‌గారు. ఈ సినిమాకు పని చేయడానికి మేం స్టూడియోలో డ్యాన్స్ చేశాం. చంద్రబోస్‌గారితో ఫైట్ కూడా చేశాం (నవ్వుతూ). ఈ చిత్రం విజయం సాధించాలి'' అని సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి అన్నారు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మీ'. శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ సినిమా ఆడియో విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఆడియో రిలీజ్ ఈవెంట్స్‌ని మర్చిపోయి చాలా రోజులైంది. 'లవ్ మీ'తో మళ్లీ ఆ సంస్కృతిని తీసుకొస్తున్నాం'' అన్నారు. ''ఆడియో లాంచ్ ఈవెంట్ చూస్తుంటే సక్సెస్ మీట్‌లా అనిపిస్తోంది'' అన్నారు అరుణ్ భీమవరపు. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు ఆశిష్. ఈ కార్యక్రమంలో వైష్ణవీ చైతన్య, హన్షిత, శిరీష్, హర్షిత్ రెడ్డి, నాగ మల్లిడి, కెమెరామేన్ పీసీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రకథ గొప్పగా ఉంది - సుకుమార్



విరాట్, గణేశ్, సుకుమార్

''జగడం' సినిమా ద్వారా గణేశ్‌ని కొరియోగ్రాఫర్‌గా పరిచయం చేశాను. ఇప్పుడు 'గాడ్ సాబ్'తో తను దర్శకుడిగా మారడం హ్యాపీగా ఉంది. ఈ చిత్ర కథ గొప్పగా ఉంది'' అన్నారు డైరెక్టర్ సుకుమార్. దివంగత నటుడు రెబల్‌స్టార్ కృష్ణంరాజు బంధువు విరాట్ రాజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'గాడ్ సాబ్'. కొరియోగ్రాఫర్ గణేశ్ దర్శకత్వంలో మల్లీశ్వరి సమర్పణలో రాజు, కల్వకోట వెంకటరమణ, కాటారి సాయికృష్ణ కార్తీక్ నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ఆరంభమైంది. 'గాడ్ సాబ్' లోగోను సుకుమార్ లాంచ్ చేశారు. తొలి సీన్‌కి నృత్య దర్శకులు యాని, భాను, జానీ కెమెరా స్విచ్చాన్ చేయగా, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ క్లాప్ కొట్టారు. ''మా విరాట్ లాంచ్ కావడం హ్యాపీగా ఉంది'' అన్నారు కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి. ''ఇది నా కెరీర్‌లో ఉత్తమ చిత్రంగా నిలిచిపోతుంది'' అన్నారు విరాట్ రాజ్. ''లవ్ స్టోరీతో ఈ చిత్రం తెరకెక్కుతోంది'' అన్నారు గణేశ్. ''మంచి యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ'' అన్నారు నిర్మాతలు.

డైరెక్టర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహిస్తాం

- దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్



దివంగత దర్శకుడు దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని మే 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. దాసరి జయంతి అయిన మే 4న 'డైరెక్టర్స్ డే'గా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ సెలబ్రేట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ మాట్లాడుతూ– ''దాసరి నారాయణరావుగారి జయంతిని ఈ ఏడాది మే 4న ఎల్బీ స్టేడియంలో ఘనంగా నిర్వహించబోతున్నాం. ఈ ఈవెంట్ ద్వారా ఫండ్ రైజ్ చేసి డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం, మిడ్ డే మీల్స్, అసోసియేషన్‌కు కొత్త బిల్డింగ్ నిర్మాణం, వయసు పైబడిన దర్శకులకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు చేయాలనుకుంటున్నాం. ఈ కార్యక్రమాల కల్చరల్ కమిటీలో డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, శివ నిర్వాణ, నందినీ రెడ్డి, అనుదీప్ కేవీ, విజయ్ కనకమేడల ఉంటారు'' అన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
11-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
354	111
75,038	22,754

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,111	▽	197
డోజోన్స్	38,327	▽	557
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,961	▲	26
డాక్స్	18,097	▲	21
షాంఘై	3,027	▽	21
నికాయ్	39,565	▽	194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,823
బంగారం (99.5 స్వచ్ఛత)	71,535
వెండి (కేజీ)	82,343

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎదురు	82.82	83.84
£	బ్రిటన్ పౌండ్	ఎదురు	104.37	106.92
€	యూరో	ఎదురు	89.25	91.63
¥	జపాన్ ఎన్ (100)	ఎదురు	54.31	55.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎదురు	54.26	56.18
S$	సింగపూర్ డాలర్	భారతీయుడు	59.55	64.25
SAR	సౌదీ రియాల్	భారతీయుడు	21.29	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయుడు	21.76	23.54
¥	చైనా యువాన్	భారతీయుడు	10.38	12.45

మైక్రోసాఫ్ట్‌తో టెక్ మహీంద్రా జట్టు



న్యూఢిల్లీ: బిజినెస్, డేటా నిపుణులకు సులభతరంగా ఉండే మైక్రోసాఫ్ట్ ఫ్యాబ్రిక్ ఆధారిత వర్క్‌బెంచ్‌ను రూపొందించేందుకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపినట్లు టెక్ మహీంద్రా వెల్లడించింది. మైక్రోసాఫ్ట్ ఫ్యాబ్రిక్ వినియోగాన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు వర్క్‌బెంచ్ సిస్టమ్ ఉపయోగపడగలదని, సంక్లిష్టమైన డేటా వర్క్ ఫ్లోను సరళతరమైన ఇంటర్‌ఫేస్‌తో సులభంగా రూపొందించవచ్చని టెక్ మహీంద్రా వివరించింది. వ్యాపారాల వృద్ధిలో తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మైక్రోసాఫ్ట్‌తో భాగస్వామ్యం తోడ్పడగలదని పేర్కొంది.

స్విఫ్ట్ కారు కాస్త ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తాజాగా హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ ధరను రూ.25,000 వరకు పెంచింది. గ్రాండ్ విటారా సిగ్మా వేరియంట్ ధర రూ.19,000 అధికం అయింది. దీంతో ఎక్స్‌షోరూంలో స్విఫ్ట్ ధర రూ.5.99 లక్షల నుంచి రూ.8.89 లక్షల వరకు ఉంది. గ్రాండ్ విటారా సిగ్మా ధర రూ.10.8 లక్షలకు చేరింది. సవరించిన ధరలు ఏప్రిల్ 10 నుంచి అమలులోకి వచ్చినట్టు మారుతీ సుజుకీ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-4-2024 ఫామ్ ధర...

విశాఖ	405-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	390-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

75,000 @ రూ. 400 లక్షల కోట్లు

మార్కెట్ల సరికొత్త రికార్డ్స్
- 75,000 దాటి నిలిచిన సెన్సెక్స్
- 354 పాయింట్లు హైజంప్
- 22,754కు నిఫ్టీ- 111 పాయింట్లు ప్లస్
- రూ. 400 లక్షల కోట్లకు మార్కెట్ విలువ

ఒక్క రోజు గ్యాప్‌లో దేశీ స్టాక్ మార్కెట్లు మరోసారి దుమ్మురేపాయి. ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ తొలిసారి 75,000 పాయింట్లపైన నిలవగా.. నిఫ్టీ 22,754 వద్ద ముగిసింది. వెరసి బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ మళ్లీ రూ. 400 లక్షల కోట్లను అధిగమించింది. తాజా ట్రేడింగ్‌లో చిన్న షేర్లకు సైతం కొనుగోళ్ల మద్దతు లభించింది.

సెన్సెక్స్ జోరిలా

పాయింట్లు	తేదీ
1,000	1990 జూలై
5,000	1999 అక్టోబర్
10,000	2006 ఫిబ్రవరి
20,000	2007 డిసెంబర్
30,000	2017 ఏప్రిల్
50,000	2021 ఫిబ్రవరి
65,000	2023 జూలై
70,000	2023 డిసెంబర్



రంజాన్ సందర్భంగా నేడు(గురువారం) స్టాక్, మనీ మార్కెట్లకు సెలవు. తిరిగి శుక్రవారం యథావిధిగా పనిచేస్తాయి.



అమెరికాలో ద్రవ్యోల్బణం మరోసారి కట్టుతప్పడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆలోచనకు చెక్‌పడే వీలుంది. దీంతో యూఎస్ మార్కెట్లు 1.3 శాతం డీలాపడి ట్రేడవుతున్నాయి.



ముంబై: ఇన్వెస్టర్లు అన్ని రంగాలలోనూ పెట్టుబడులకు ఆసక్తి చూపడంతో దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారంలో రెండోసారి సరికొత్త రికార్డులను సాధించాయి. సెన్సెక్స్ 354 పాయింట్లు జంప్ చేసి మార్కెట్ చరిత్రలో తొలిసారి 75,038 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 111 పాయింట్ల వృద్ధితో కొత్త గరిష్టం 22,754 వద్ద ముగిసింది. ఇంట్రాడేలోనూ సెన్సెక్స్ 75,105 వద్ద, నిఫ్టీ 22,776 వద్ద చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. ఈ ప్రభావంతో బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ సైతం 1-0.5 శాతం మధ్య బలపడ్డాయి. ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)కు రూ. 2,27,025 కోట్లు జమయ్యింది. మొత్తం విలువ రూ. 402 లక్షల కోట్ల(4.83 ట్రిలియన్ డాలర్లు) ఎగువకు చేరింది.

ఫార్మా మినహా..

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మీడియా, ప్రభుత్వ బ్యాంక్స్, చమురు, ఎఫ్‌ఎంసీజీ, మెటల్ 1.5 శాతంస్థాయిలో పుంజుకోగా.. ఫార్మా 0.3 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో కోల్ ఇండియా, బీపీసీఎల్, ఐటీసీ, కొటక్ బ్యాంక్, హిండాల్కో, ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, అదానీ ఎంటర్, ఏషియన్ పెయింట్స్, ఓఎన్‌జీసీ, ఐషర్, టెక్‌ఎం, ఆర్‌ఐఎల్ 3.6-1% మధ్య లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, మారుతీ, దివీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2-1% మధ్య క్షీణించాయి. బీఎస్‌ఈలో మొత్తం ట్రేడైన షేర్లలో 1,904 లాభపడితే.. 1,939 బలహీనపడ్డాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 2,778 కోట్లు, దేశీ ఫండ్స్ సైతం రూ. 163 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

మూడోరోజూ మెరిసిన పసిడి, వెండి

పసిడి, వెండి ధరలు న్యూఢిల్లీలో వరుసగా మూడవ రోజు బుధవారం కూడా రికార్డుల ర్యాలీ చేశాయి. పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర ఒక దశలో లైఫ్‌టైమ్ హై రూ.72,000 తాకింది. అటు తర్వాత క్రితం ముగింపుతో పోల్చితే రూ.200 లాభంతో రికార్డు స్థాయి రూ.71,840 వద్ద ముగిసింది. వెండి కూడా కేజీకి రూ.200 ఎగసి రూ.84,700 వద్ద ముగిసింది. పసిడి ధర గడచిన మూడు రోజుల్లో రూ.690 పెరగ్గా, వెండి ధర ఇదే కాలంలో రూ.1,500 పెరిగింది. కాగా, అంతర్జాతీయ బులిష్ ధోరణులు ఈ రెండు మెటల్స్ తాజా పెరుగుదలకు కారణంకాగా, బుధవారం వెలువడిన అమెరికాలో తీవ్ర ద్రవ్యోల్బణం గణాంకాలు, వడ్డీరేట్లు తగ్గకపోవచ్చని భయాలతో బంగారం, వెండి తక్షణ ర్యాలీకి బ్రేక్ పడవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. అంతర్జాతీయంగా, జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లు క్రితం ముగింపుతో పోల్చితే మైనస్‌లో ట్రేడవుతుండడం ఇక్కడ గమనార్హం.

నకిలీ వీడియోలతో తస్మాత్ జాగ్రత్త!

ఎన్‌ఎస్‌ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ స్టాక్ రికమండేషన్లు ఇస్తున్నట్లు అవాస్తవ(డీప్‌ఫేక్) వీడియోల సృష్టి జరిగినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం తాజాగా పేర్కొంది. ఆధునిక సాంకేతికతను తప్పుడు మార్గంలో వినియోగించడం ద్వారా ఎన్‌ఎస్‌ఈ లోగో సహా.. ఆశిష్‌కుమార్ ముఖం లేదా గొంతుతో షేర్ల సిఫారసులు చేస్తున్న ఫేక్ వీడియోలను నమ్మొద్దని హెచ్చరించింది.

అనిల్ అంబానీ అదృష్టం తారుమారు

గ్రూప్ సంస్థకు అనుకూలంగా ఉన్న రూ.8,000 కోట్లు ఆర్బిట్రేషన్ అవార్డు కొట్టివేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత సంపన్నులకు సంబంధించి 2008లో వెలువడిన జాబితాలో ఆరవస్థానంలో నిలిచిన అనిల్ అంబానీకి వరుస ఎదురు దెబ్బలు కొనసాగుతున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ సంస్థల్లో ఒకటైన- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు(డీఏఎంఈపీఎల్) అనుకూలంగా గతంలో వచ్చిన ఆర్బిట్రేషన్ అవార్డును సుప్రీంకోర్టు తాజాగా కొట్టేసింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ- డీఏఎంఈపీఎల్ అలాగే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) మధ్య కుదిరిన ''రాయితీ ఒప్పందం'' విషయంలో తలెత్తిన ఒక వివాదానికి సంబంధించి రూ.8,000 కోట్ల అవార్డుతో ఆయన కష్టాలు కొంత గట్టెక్కుతాయన్న అంచనాలను తాజా పరిణామం దెబ్బతీసింది. ఆర్బిట్రేషన్ అనుగుణంగా గతంలో డీఎంఆర్‌సీ చెల్లించిన రూ.3,300 కోట్లను వాపసు చేయాలని సుప్రీం డీఏఎంఈపీఎల్‌ని ఆదేశించింది. అయితే తీర్పు వల్ల తనకు వచ్చిన ఇబ్బందేమీ లేదని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేర్కొంది. అటు డీఎంఆర్‌సీ నుంచి కానీ ఇటు గ్రూప్ సంస్థ డీఏఎంఈపీఎల్ నుంచి తనకు ఎటువంటి డబ్బూ అందలేదని వివరించింది.

భారత పర్యటనకు ఎలాన్ మస్క్

ఈ నెలలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యేందుకు అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ ఈ నెలలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో తమ కంపెనీ పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మస్క్ పర్యటన ఏప్రిల్ నాలుగో వారంలో ఉండొచ్చని, ఆయనతో పాటు కంపెనీ అధికారులు కూడా రావొచ్చని పేర్కొన్నాయి. దేశీయంగా తయారీని ప్రోత్సహించే క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని కేంద్రం ఇటీవల సవరించిన నేపథ్యంలో మస్క్ రాక ప్రాధాన్యం సంతరించుకుంది. దీని ప్రకారం భారత్‌లో కనీసం 500 మిలియన్ డాలర్లతో తయారీ ప్లాంటును పెట్టే విదేశీ కంపెనీలు తక్కువ సుంకాలతో ఎలక్ట్రిక్ కార్లను దిగుమతి చేసుకునేందుకు వెసులుబాటు లభిస్తుంది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో తయారైన కారును (సీబీయూ) దిగుమతి చేసుకుంటే 70 శాతం నుంచి 100 శాతం వరకు కస్టమ్స్ సుంకాలు వర్తిస్తున్నాయి. భారత మార్కెట్లో ప్రవేశించేందుకు టెస్లా వంటి కంపెనీలకు ఇది అవరోధంగా ఉంటోంది. దీంతో సుంకాలను తగ్గించాలంటూ కొన్నాళ్లుగా కేంద్రాన్ని కోరుతున్నాయి. దానికి అనుగుణంగా దేశీయంగా తయారీతో ముడిపెట్టి పాలసీని ప్రభుత్వం సవరించింది. గతేడాది మోదీ అమెరికాలో పర్యటించిన సందర్భంగా ఆయనతో మస్క్ సమావేశమయ్యారు. భారత మార్కెట్లో టెస్లా ఎంట్రీకి సంబంధించి 2024లో తాను వచ్చే అవకాశమున్నట్లు అప్పట్లో ఆయన చెప్పారు.

వన్‌ప్లస్ విక్రయాలు నిలిపేస్తున్నాం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయినందుకు వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్స్, ట్యాబ్లెట్స్, వేరబుల్స్ విక్రయాలను మే 1 నుంచి నిలిపివేస్తున్నట్టు సౌత్ ఇండియన్ ఆర్గనైజ్డ్ రిటైలర్స్ అసోసియేషన్ (ఓఆర్‌ఏ) నిర్ణయించింది. అతి తక్కువ మార్జిన్స్, వారంటీ క్లెయిమ్స్ ఆలస్యం కావడం, బలవంతంగా కొన్ని ఉత్పత్తులను రిటైలర్లపై రుద్దడం వంటి సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అసోసియేషన్ వెల్లడించింది. ఆన్‌లైన్‌కు అనుకూలంగా వన్‌ప్లస్ వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు వన్‌ప్లస్ టెక్నాలజీ ఇండియా సేల్స్ డైరెక్టర్ రంజీత్ సింగ్‌కు ఓఆర్‌ఏ లేఖ రాసింది. పూర్విక, బిగ్-సీ, సంగీత, హ్యాపీ, బీ-న్యూ, సెలెక్ట్, సెల్ పాయింట్ వంటి 23 ప్రముఖ మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్స్ ఓఆర్‌ఏ సభ్యులుగా ఉన్నాయి. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లో సుమారు 4,500 స్టోర్లతో కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

3712 పోస్టుల భర్తీకి ఎస్‌ఎస్‌సీ సీహెచ్‌ఎస్‌ఎల్ నోటిఫికేషన్ విడుదల

కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ).. కంబైన్డ్ హయ్యర్ సెకండరీ(10+2) లెవెల్ ఎగ్జామినేషన్- 2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 3712 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3712
» **పోస్టుల వివరాలు:** లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో), డేటా ఎంట్రీ ఆపరేటర్ (గ్రేడ్ ఏ).
» **అర్హతలు:** 10+2/ఇంటర్మీడియెట్ తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. 01.08.2024 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈఓ), డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10-15ఏళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ రూ.19,900-63,200; డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో) రూ.29,200-92,300; డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ రూ.25,500-81,100 వేతన శ్రేణి లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** టైర్1, టైర్ 2 పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 07.05.2024
» **దరఖాస్తుల సవరణ తేదీలు:** 10.05.2024 నుంచి 11.05.2024
» **టైర్ 1 పరీక్ష తేదీలు:** జూలై 1-12 తేదీల్లో.
» **టైర్ 2 పరీక్ష తేదీలు:** తర్వాత వెల్లడిస్తారు.
» **వెబ్‌సైట్:** https://ssc.gov.in

ఐజీఆర్‌యూఏ, అమేథీలో సీపీఎల్ ప్రోగ్రామ్

అమేథీ(యూపీ)లోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ(ఐజీఆర్‌యూఏ)..సెప్టెంబర్ 2024 సెషన్ కమర్షియల్ పైలట్ లైసెన్స్(సీపీఎల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 125.
» **కోర్సు వ్యవధి:** 24 నెలలు.
» **అర్హత:** కనీసం 45శాతం మార్కులతో 10+2(ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు కనీసం 158సెం.మీ.ఎత్తు ఉండాలి.
» **వయసు:** 17 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, వైవా/ఇంటర్వ్యూ, ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.05.2024
» **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ ప్రారంభం:**24.05.2024
» **ఆన్‌లైన్ రాతపరీక్ష తేది:** 03.06.2024.
» **ఇంటర్వ్యూ/వైవా ప్రారంభం:** 16.07.2024.
» **వెబ్‌సైట్:** https://igrua.gov.in

ఎస్‌పీఏవీ, విజయవాడలో పీహెచ్‌డీ ప్రవేశాలు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టోరల్ ప్రోగ్రామ్స్(పార్ట్ టైమ్/ఫుల్ టైమ్)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **డాక్టోరల్ ప్రోగ్రామ్స్:** పీహెచ్‌డీ ఇన్ ప్లానింగ్, పీహెచ్‌డీ ఇన్ ఆర్కిటెక్చర్, పీహెచ్‌డీ ఇన్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ, సర్వే నెం.4/4, ఐటీఐ రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.05.2024.
» **దరఖాస్తుల షార్ట్‌లిస్ట్ తేది:** 10.05.2024.
» **పరీక్ష-ఇంటర్వ్యూ తేది:** 21.05.2024, 22.05.2024.
» **వెబ్‌సైట్:** https://www.spav.ac.in

ఐసీఎస్‌ఐ, న్యూఢిల్లీలో 30 సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్‌ఐ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **అర్హత:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్‌లో మెంబర్ అయి ఉండాలి. పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.04.2024 నాటికి 31 ఏళ్ల లోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 60,000.
» **పనిచేయాల్సిన ప్రదేశం:** సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్, కార్పొరేషన్ భవన్, ఐఐసీఏ, మనేసర్, గుడ్‌గావ్(హర్యానా).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.04.2024
» **వెబ్‌సైట్:** https://www.icsi.edu

» ఎన్నికలతో వాయిదాపడిన సివిల్స్ ప్రిలిమ్స్
» మే 26కు బదులు జూన్ 16న నిర్వహణ
» అవకాశంగా మలచుకోవాలంటున్న నిపుణులు
» 1,056 పోస్టులకు సివిల్స్ ప్రిలిమ్స్-2024 పరీక్ష
» ఆరు లక్షల మంది హాజరయ్యే అవకాశం

ఆలస్యమే.. అవకాశం!

సివిల్స్ ప్రిలిమ్స్-2024.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ సహా 21 కేంద్ర సర్వీసుల్లో అభ్యర్థుల ఎంపికకు తొలిదశ పరీక్ష! మే నెల 26వ తేదీన జరగాల్సిన సివిల్స్ ప్రిలిమ్స్.. దేశంలో లోక్‌సభ ఎన్నికల కారణంగా జూన్ 16కు వాయిదా పడింది. పరీక్ష వాయిదాను ఆలస్యంగా భావించకుండా.. అందివచ్చిన అవకాశంగా మలచుకోవాలన్నది నిపుణుల సూచన! ఈ నేపథ్యంలో.. సివిల్స్ అభ్యర్థులు మారిన ప్రిలిమ్స్ పరీక్ష తేదీకి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించడంపై ప్రత్యేక కథనం..



పోటీ పరీక్షలకు సీరియస్‌గా ప్రిపరేషన్ సాగించేవారు.. అవి వాయిదా పడితే నిరాశకు గురవడం సహజం. ముఖ్యంగా దాదాపు ఏడాదిన్నర పాటు ఎంపిక ప్రక్రియ సాగే సివిల్స్ విషయంలో ఈ ధోరణి కొంత ఎక్కువగానే ఉంటుంది. జూన్‌లో జరుగనున్న ప్రిలిమ్స్‌కు దాదాపు ఆరు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా మెయిన్స్‌కు ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్య 13 వేల వరకూ ఉంటుంది. ఇలాంటి వడపోత పరీక్షలో నెగ్గడం అంత తేలికకాదు. కాబట్టి పరీక్ష వాయిదాతో అదనంగా లభించిన సమయంలో తమ ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టుకుని విజయావకాశాలను మెరుగుపరచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

అదనంగా 20 రోజులు

వాస్తవానికి మే 26న సివిల్స్ ప్రిలిమ్స్ జరగాల్సి ఉంది. కానీ లోక్‌సభ ఎన్నికల కారణంగా రీ-షెడ్యూల్ చేసి జూన్ 16న నిర్వహించనున్నారు. అంటే.. ప్రిలిమ్స్ అభ్యర్థులకు అదనంగా లభించిన సమయం 20 రోజులు. మొత్తంగా చూస్తే ఇప్పటి నుంచి 65 రోజుల సమయం అందుబాటులో ఉంది. ఆయా సబ్జెక్ట్‌లపై మరింత పట్టు సాధించేందుకు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు టైం మేనేజ్‌మెంట్‌ను తప్పనిసరిగా పాటించాలి. జనరల్ స్టడీస్ పేపర్ సిలబస్‌లో పేర్కొన్న ఏడు విభాగాలకు సంబంధించిన సిలబస్‌ను పరిశీలించి.. ప్రతి సబ్జెక్ట్‌ను ప్రతి రోజూ చదివేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ప్రతిరోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించాలి. దీంతోపాటు ప్రతి వారం సెల్ఫ్ టెస్టులు, మాక్ టెస్టులు రాయడం కూడా ఉపకరిస్తుంది.

కరెంట్ అఫైర్స్‌తో సమ్మిళితం

ప్రస్తుతం అభ్యర్థులు ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశం.. కరెంట్ అఫైర్స్. తాజా పరిణామాలను చదవడమే కాకుండా.. సిలబస్‌లో పేర్కొన్న కోర్ టాపిక్స్‌ను సమ్మిళితం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఆయా అంశాల నేపథ్యం, ప్రభావం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అంచనా వంటి వాటిని విశ్లేషించుకుంటూ చదవాలి. ఇటీవల కాలంలో ప్రిలిమ్స్‌లో అడుగుతున్న ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

ప్రాధాన్య అంశాల గుర్తింపు

అభ్యర్థులు సబ్జెక్ట్‌ల వారీగా ముఖ్యాంశాలను గుర్తించి.. వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి.. ఆయా సబ్జెక్ట్‌ల నుంచి అడుగుతున్న ప్రశ్నల సంఖ్య.. ఏఏ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందో గుర్తించాలి. ఉదాహరణకు చరిత్రనే పరిగణనలోకి తీసుకుంటే..ఆర్ట్ అండ్ కల్చర్, స్వాతంత్ర్యోద్యమం ముఖ్యమైనవిగా పేర్కొనొచ్చు. ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌లో గత ఏడాది కాలంలో సంభవించిన ముఖ్యమైన పరిణామాలపై దృష్టి సారించాలి. వార్తల్లో నిలిచిన ప్రాంతాలు, వ్యక్తులు, సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి.

రివిజన్.. రివిజన్

ప్రస్తుతం అభ్యర్థులు తమకు అందుబాటులో ఉన్న సమయంలో ప్రతి సబ్జెక్ట్‌ను కనీసం రెండు సార్లు పునశ్చరణ చేసుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌ల సిలబస్‌ను మే మొదటి వారానికి పూర్తి చేసుకునే విధంగా సమయ పాలన సిద్ధం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల రెండుసార్లు రివిజన్ చేసేందుకు సమయం లభిస్తుంది. రివిజన్ చేసేందుకు ఉపకరించే విధంగా ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి.

కొత్త అంశాలు వద్దు

ప్రస్తుత సమయంలో ఇప్పటికే చదివిన అంశాలపై మరింత పట్టు లభించేలా కృషి చేయడం మేలు. ఇప్పుడు కొత్త టాపిక్స్ చదవడం మొదలుపెడితే.. అనవసరపు ఆందోళనకు గురవడం, ఇది ఇతర అంశాల ప్రిపరేషన్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త అంశాలను చదవాలనుకుంటే.. వాటికి సంబంధించి సినాప్సిస్, కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి.

సెల్ఫ్ మెమొరీ టిప్స్

ప్రిపరేషన్ సాగించే సమయంలో అభ్యర్థులు మెమొరీ టిప్స్ అనుసరించాలి. ఇది పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబర్చడానికి దోహదం చేస్తుంది. పాయింటర్స్, ఫ్లో చార్ట్స్, విజువలైజేషన్ టెక్నిక్స్, నుమానిక్స్ వంటి వాటిని అనుసరించాలి. ముఖ్యమైన సంవత్సరాలు, గణాంకాలను గుర్తుంచుకునేందుకు వాటిని వ్యక్తిగతంగా అన్వయించుకోవచ్చు. ఆయా అంశాలను విభిన్న కోణాల్లో విశ్లేషించగలిగే విధంగా అభ్యసిస్తే పరీక్షలో ప్రతిభ చూపొచ్చు.

గత ప్రశ్న పత్రాల సాధన

ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. గత ప్రశ్న పత్రాల సాధన. పరీక్షకు నెల రోజుల ముందు నుంచి ప్రతి రోజు ఒక ప్రీవియస్ పేపర్ ప్రాక్టీస్ చేసేలా సమయం కేటాయించుకోవాలి. దీనిద్వారా తమ బలాలు, బలహీనతలపై అవగాహన ఏర్పడుతుంది.

సబ్జెక్ట్‌ల వారీగా ముఖ్యంశాలపై పట్టు

- చరిత్రలో.. ప్రాచీన చరిత్రలో సింధూ నాగరికత, బౌద్ధ, జైన మతాలు; మౌర్యులు, గుప్తులు, విజయనగర సామ్రాజ్యం, ఢిల్లీ సుల్తానులు, మొఘలులు, ఆధునిక భారత చరిత్ర, జాతీయోద్యమం, ప్రాచీన, మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక-ఆర్థిక చరిత్ర; ఆధునిక చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన-పరిపాలన విధానాలు; బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు -ఉద్యమాలు (ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం), సంస్కరణోద్యమాలపై దృష్టి సారించాలి.
- పాలిటీలో.. రాజ్యాంగం, రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ, పీఠిక, ఇప్పటివరకు జరిగిన ముఖ్య రాజ్యాంగ సవరణలు-వాటికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు, రాజకీయ వ్యవస్థ, పార్లమెంటరీ వ్యవస్థ, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల సంఘం, ఫైనాన్స్ కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్, వాటికి సంబంధించి రాజ్యాంగ ప్రకరణలు చదవాలి. అదే విధంగా.. పంచాయతీరాజ్ వ్యవస్థ -బల్వంత్‌రాయ్ మెహతా, అశోక్‌మెహతా,హన్మంతరావ్,జి.వి.కె.రావ్, సింఘ్వీ కమిటీల సిఫార్సులు,73వ రాజ్యాంగ సవరణ చట్టాలపై అవగాహన పొందాలి. అదేవిధంగా కేంద్ర-రాష్ట్ర సంబంధాలు; గత కొద్ది రోజులుగా చర్చనీయాంశంగా మారిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఎకానమీలో.. ఆర్థికాభివృద్ధిలో సహజ వనరులు-మూలధన వనరుల పాత్ర; ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి (వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం); ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలో ఆర్థిక-సాంఘికాభివృద్ధి; పారిశ్రామిక తీర్మానాలు-వ్యవసాయ విధానం; బ్యాంకింగ్ రంగం-సంస్కరణలు వంటి వాటిపై పట్టు సాధించాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీలో.. గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు, గగన్‌యాన్, చంద్రయాన్, ఆదిత్య ఎల్-1 వంటి ప్రయోగాలు; వ్యాధులు-కారకాలు; సైబర్ సెక్యూరిటీ యాక్ట్; రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు; ముఖ్యమైన వన్యమృగ సంరక్షణ కేంద్రాలు; పర్యావరణ పరిరక్షణ ఒప్పందాలు, చర్యలపై అవగాహన పెంచుకోవాలి.
- జాగ్రఫీలో.. సౌర వ్యవస్థ, భూమి అంతర్ నిర్మాణం, శిలలు, జియలాజికల్ టై స్కేల్, రుతుపవనాలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, ఉష్ణోగ్రత విలోమం, భూకంపాలు, సునామీలు; మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ; రుతుపవనాలు, ఎల్‌నినో, బయోడైవర్సిటీ, పర్యావరణ సమస్యలు తదితరాలపై దృష్టిపెట్టాలి.

క్లుప్తంగా...

చిన్నతనం.. గొప్పగుణం

- చెత్త తొలగించాలని కమిషనర్‌కు 6వ తరగతి విద్యార్థిని వినతి



రాయికల్: డ్రైనేజీ చెత్తను తొలగించాలని ఓ విద్యార్థిని మున్సిపల్ కమిషనర్‌కు స్వయంగా లేఖ రాసింది. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని 11వ వార్డులో తమ ఇంటి ముందు డ్రైనేజీలో ఉన్న చెత్తను తొలగించాలని కోరుతూ ఆరో తరగతి చదువుతున్న మన్హా మొబిన్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రం అందించింది. కమిషనర్ మాట్లాడుతూ చిన్న వయసులో బాధ్యతాయుతంగా ఫిర్యాదు చేయడం అభినందనీయమని, వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రంగోత్సవ్ విజేత ఆరాధ్య కృతి



సాక్షి, హైదరాబాద్: రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో తెలుగమ్మాయి ఆరాధ్యకృతి కొల్లాజ్ మేకింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఏడేళ్ల ఆరాధ్యకృతి.. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డి పాలెం మండలం, కాళయకాగల్లులోని నెల్లూరు చంద్రారెడ్డి హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. ముంబై కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'రంగోత్సవ్ సెలబ్రేషన్-ఏన్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంపిటీషన్స్'సంస్థ సెలబ్రేషన్ ఆఫ్ కలర్స్ అంశంగా పాఠశాల విద్యార్థులకు కలరింగ్, హ్యాండ్ రైటింగ్, కొల్లాజ్ మేకింగ్, కార్టూన్, గ్రీటింగ్ కార్డ్, టాటూ మేకింగ్, ఫింగర్ అండ్ థంబ్ పెయింటింగ్, స్కెచింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించింది. ప్రతి విభాగంలో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించింది రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ. జాతీయస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచి రజతపతకం అందుకున్న ఆరాధ్యకృతి.. అంతర్జాతీయ పోటీల్లో కొల్లాజ్ మేకింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకుంది.

కిచెన్‌కు టాటా.. హోటళ్ల బాట..


గత పదేళ్లలో గణనీయంగా తగ్గిన ఇళ్లలో వంట

- పెరిగిన ఫుడ్ డెలివరీ.. ప్రాసెస్డ్ ఫుడ్‌కు, డైనింగ్ ఔట్‌కు పెరిగిన డిమాండ్
- మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తాజా నివేదికలో వెల్లడి
- కుటుంబ ఆదాయాల పెరుగుదలతో మారుతున్న తిండి ప్రాధాన్యతలు
- దంపతులు ఇద్దరూ ఉద్యోగులైతే.. బయటి తిండికే ఎక్కువ మొగ్గు
- మూడింతలు పెరిగిన ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం



సాక్షి, హైదరాబాద్: ఇటీవలికాలంలో కుటుంబాల ఆదాయం పెరుగుతోంది. జీవన శైలి మారుతోంది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న పరిస్థితి ఉంది. దీనితో మన దేశంలోని కుటుంబాలు ఇళ్లలో వంట గదికి టాటా చెప్తున్నారని.. హోటళ్ల బాట పడుతు న్నారని తాజాగా ఓ సర్వేలో తేలింది. ఇంట్లో వంట చేసుకోవడానికి బద్ధకంతోపాటు వివిధ వెరైటీల ఆహారం తినాలన్న కోరిక దీనికి కారణమని వెల్లడైంది. ప్రాసెస్డ్ ఆహారం వినియోగం భారీగా పెరిగినట్టు తేలింది. వీధి వీధినా వెలసిన రెస్టారెంట్లు, హోటళ్లు, విస్తృతంగా అందుబాటులోకి ఫుడ్ డెలివరీ యాప్‌లు, నిమిషాల్లో సరుకులు తెచ్చిచ్చే గ్రోసరీ యాప్‌లు.. దీనికి మరింత ఊతమిస్తున్నట్టు వెల్లడైంది. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ (ఎంఓఎస్‌పీఐ), ఐసీఐసీఐ సెక్యూరిటీస్ చేసిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఆ నివేదికల్లోని గణాంకాలను పరిశీలిస్తే..

- అంతకుముందటి పదేళ్లతో పోల్చితే 2022–23 ఆర్థిక సంవత్సరంలో పట్టణ ప్రాంతాల్లోని అధిక ఆదాయ వర్గాల వారు ప్యాకేజ్డ్ ఫుడ్, డైనింగ్ ఔట్, ఫుడ్ డెలివరీ సర్వీసెస్ కోసమే తమ ఫుడ్ బడ్జెట్‌లో 50శాతానికిపైగా ఖర్చు చేశారు. గతంలో ఇది 41.2 శాతమే.
- మధ్యతరగతి కుటుంబాలు తమ ఆహార బడ్జెట్‌లో ప్రాసెస్డ్ ఫుడ్, పానీయాలపై చేస్తున్న ఖర్చు 16శాతం నుంచి 25 శాతానికి (గత పదేళ్లలో) పెరిగింది.
- అధికాదాయ కుటుంబాలకు సంబంధించి చూస్తే.. 'స్టేపుల్ ఫుడ్ (ముడి ఆహార పదార్థాల)'పై వ్యయం తగ్గుతోందని.. క్రమంగా వారి ఇళ్లలో వంట గదులకు పనిలేకుండా పోతోందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ రిపోర్ట్ పేర్కొంది.
- 2022–23లో అధికాదాయ కుటుంబాల తలసరి ఫుడ్ డెలివరీ వ్యయం ఏకంగా రూ.971గా ఉంది. అదే మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాల్లో తలసరి ఫుడ్ డెలివరీ ఖర్చు రూ.60గా ఉంది.
- గత పదేళ్లతో పోల్చితే ఇంట్లో వంట చేసుకోవడం తగ్గింది. హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లడం, డెలివరీ యాప్‌ల ద్వారా తెప్పించుకోవడం బాగా పెరిగింది. ఇది రాబోయే రోజుల్లో మరింతగా పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.
- గత పదేళ్లలో పోల్చితే ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగించే అధికాదాయ కస్టమర్లు రెండింతలు పెరిగారు. అదే మధ్య తరగతి కస్టమర్లు మూడింతలు పెరిగారు.
- అధికాదాయ వర్గాల వారు.. చక్కెర శాతం తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు, సేంద్రియ ఆహారం, పానీయాల వంటి వాటి వినియోగం పెంచారు. మిగతా వర్గాల వారూ వాటివైపు ఆకర్షితులవుతున్నారు.
- డ్రైఫ్రూట్స్‌పై చేస్తున్న కుటుంబ వ్యయం పట్టణ ప్రాంతాల్లో 1.3శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 1.2శాతంగా ఉంది.
- పట్టణ ప్రాంత కుటుంబాల ఆదాయం పెరిగినా.. ప్రాసెస్డ్ ఫుడ్, పానీయాలపై ఖర్చు తగ్గి.. ధాన్యాలు (సెరీల్స్), కోడిగుడ్లు, చేప, మాంసం, వంటనూనె వంటి వాటి వినియోగం గతంలోని స్థాయిలోనే ఉండిపోయింది.



4 నెలల్లో 1.17 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు నెలల్లో 1.17 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనివల్ల వారికి దాదాపు రూ. 1,177 కోట్ల మేర డబ్బు ఆదా అయిందని తెలిపింది. గతేడాది డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ (పల్లె వెలుగు) బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం... తాజాగా అందుకు సంబంధించిన లెక్కలను విడుదల చేసింది. అయితే ఈ పథకం ప్రారంభమైన ఈ నాలుగు నెలల్లో ఆర్టీసీకి ఎంత మేర రీయింబర్స్ చేసిందో మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిత్యం దాదాపు 6 లక్షల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఆ సంఖ్య సగటున రోజుకు 29.67 లక్షలుగా ఉందని వివరించింది. పథకం ప్రారంభించిన తొలి రోజుల్లో ఆ సంఖ్య 14 లక్షలుగా ఉండగా క్రమంగా పెరుగుతూ రెట్టింపునకు చేరుకుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పథకం ప్రారంభమైన గతేడాది డిసెంబర్‌లో 26.99 లక్షల మంది, జనవరిలో 28.10 లక్షల మంది, ఫిబ్రవరిలో 30.56 లక్షల మంది, మార్చిలో 31.42 లక్షల మంది ఉచితంగా ప్రయాణించినట్లు ఈ గణాంకాలతో తేలింది.

గరీబ్‌రథ్ జాడేది?

- హైదరాబాద్–విశాఖపట్నం మధ్య నిత్యం తిరిగే గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయం 12 గంటల 35 నిమిషాలు. ఇందులో మూడో శ్రేణి ఏసీ తరగతి టికెట్ ధర రూ.1395
- సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య వారంలో మూడురోజులు తిరిగే దురొంతో ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయం 10 గంటల 15 నిమిషాలు. ఇందులో మూడో శ్రేణి ఏసీ తరగతి టికెట్ ధర రూ.1630
- సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య రోజూ తిరిగే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయం 11 గంటలే. ఇందులో మూడో శ్రేణి ఏసీ తరగతి టికెట్ ధర రూ.1085 మాత్రమే.

గోదావరి, దురొంతో ఎక్స్‌ప్రెస్‌లతో పోలిస్తే గరీబ్‌రథ్‌కు డిమాండ్ ఎక్కువ. కానీ, ఆ శ్రేణి రైళ్ల సంఖ్య పెంచేందుకు కేంద్రప్రభుత్వం ససేమిరా అంటోంది. కేవలం రంగు మార్పు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల ఏర్పాటుకే పరిమితమవుతున్నట్టు తెలుస్తోంది.

వందేభారత్ సంఖ్య పెరుగుతున్నా.. పేదల రైళ్ల అతీగతీ లేదు

- 17 ఏళ్లుగా రెండింటితోనే నెట్టుకొస్తున్న తీరు
- ఇప్పుడు వాటి రంగు మార్చి, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: పేదలు కూడా తక్కువ ధరతో ఏసీ కోచ్‌లలో ప్రయాణించే వెసులుబాటు కల్పించాలన్న ఉద్దేశంతో 17 ఏళ్ల క్రితం రైల్వేశాఖ గరీబ్‌రథ్ కేటగిరీ రైళ్లు ప్రారంభించింది. లాలూప్రసాద్‌యాదవ్ రైల్వేశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఇవి పట్టాలెక్కాయి. సులభంగా ప్రజలకు తెలిసేలా పూర్తి ఆకుపచ్చ రంగుతో ఈ రైళ్లు ఉన్నాయి. వీటిల్లో అన్నీ ఏసీ మూడో శ్రేణి కోచ్‌లే. గరిష్ట వేగం గంటకు దాదాపు 130 కిలోమీటర్లు. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల కంటే ఇవి వేగంగా పరుగుపెడతాయి. అందుకే వాటితో పోలిస్తే ఇవి కొంత తొందరగా గమ్యం చేరుతాయి. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్ల మూడోశ్రేణి ఏసీ కోచ్‌లలో ఉండే టికెట్ ధర కంటే దాదాపు 15 శాతం తక్కువ ధరకే గరీబ్‌రథ్ రైళ్లలో ప్రయాణించే వెసులుబాటు కల్పించారు.

- 2008 ఫిబ్రవరిలో సికింద్రాబాద్–యశ్వంతపూర్ మధ్య, అదే సంవత్సరం అక్టోబరులో సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య రెండు రైళ్లను దక్షిణ మధ్య రైల్వేకు కేటాయించారు. దేశవ్యాప్తంగా ఈ రైళ్లు వారంలో కొన్ని రోజులు మాత్రమే తిరుగుతాయి. ఒక్క విశాఖపట్నం గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే నిత్యం తిరుగుతుంది. డిమాండ్ ఎక్కువగా ఉన్నందున అందులో టికెట్ దొరకటం గగనమే.
- గతేడాది సంక్రాంతి రోజున సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య వందేభారత్ రైలును ప్రారంభించారు. 16 కోచ్‌లతో తిరుగుతున్న ఆ రైలులో ఆక్యుపెన్సీ రేషియో 114– 120 శాతంగా ఉంటోంది. దీంతో ఇటీవలే అదే రూట్‌లో 8 కోచ్‌లుండే మరో వందేభారత్‌ను ప్రారంభించారు. కానీ, దీనికంటే ఎక్కువ డిమాండ్ ఉన్నా.. ఆ మార్గంలో రెండో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌ను మాత్రం కేటాయించటం లేదు.
- ఇతర నగరాలకు కూడా గరీబ్‌రథ్ రైళ్లు నడపాలని కోరుతున్నా పట్టించుకోవటం లేదు. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఏసీ కోచ్ టికెట్ ధరలను కూడా పేదలు భరించలేరన్న ఉద్దేశంతో గరీబ్‌రథ్ రైళ్లను ప్రారంభించారు. అలాంటిది వందేభారత్ కేటగిరీ రైలు టికెట్ ధరలను అసలే భరించలేరు. కానీ, వాటి సంఖ్యను మాత్రం పెంచుతూ, 17 ఏళ్లు గడుస్తున్నా రెండో గరీబ్‌రథ్‌ను ప్రారంభించలేదు.

త్వరలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

ప్రస్తుతం గరీబ్‌రథ్ రైళ్లు సంప్రదాయ ఐసీఎఫ్ కోచ్‌లతో తిరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వీటితో తీవ్ర ప్రాణనష్టం జరుగుతోందన్న ఉద్దేశంతో.. అన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఏర్పాటు చేయాలని గతంలోనే కేంద్రం నిర్ణయించింది. వేగంగా ఆ పనులు జరుగుతున్నాయి. కానీ ఇప్పటివరకు గరీబ్‌రథ్ కేటగిరీ రైళ్లకు మాత్రం వాటిని ఏర్పాటు చేయలేదు. త్వరలో వాటన్నింటికి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఏర్పాటు చేయాలని తాజాగా రైల్వే నిర్ణయించింది. తొలినుంచి ఆకుపచ్చ రంగు కోచ్‌లే ఉన్నందున, ఇప్పుడు వాటి రంగు మార్చాలని కూడా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఎరుపురంగు వేయాలని భావిస్తున్నట్టు అనధికార సమాచారం. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఏర్పాటు చేసినప్పుడు, 3 ఏసీ ఎకానమీ నమూనా కోచ్‌లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. వీటిల్లో బెర్తుల సంఖ్య ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం గరీబ్‌రథ్‌లో ఒక్కో కోచ్‌లో 78 మంది ప్రయాణించే వెసులుబాటు ఉంది. ఆ సంఖ్య 83కు చేరుతుందని సమాచారం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.